అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 19-06-2024 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 170 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

విలువల శిఖరం మోటూరి

- అన్ని రంగాల్లోనూ ఆయన నిష్ణాతులు : ఎంహెచ్ వర్ధంతిలో చెరుపల్లి సీతారాములు 3లో..



ఆగిన సాంచెల సప్పుడు

కొనఊపిరితో ఉండగా విద్యుత్ సబ్సిడీ ఎత్తివేత

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో తుక్కు కింద మరమగ్గాల అమ్మకం
- ఏ యేటికాయేడు సగానికి తగ్గింపు
- ఆర్నెల్లలో ఇనుప సామానుకు రెండు వేల మరమగ్గాలు
- పాతబకాయిలు రాక.. అప్పులు తీరక ఇండస్ట్రీ ఆందోళన

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సాంచెల (మరమగ్గాలు) సప్పుడు ఆగింది. ఇన్నాళ్లూ సర్కారు ఆర్డర్లతో నెట్టుకొచ్చిన పరిశ్రమకు ఆర్నెళ్లుగా కొత్త ఆర్డర్ల ఊసే లేకుండా పోయింది. దీంతో ఆర్డర్ల కోసం కొన ఊపిరితో ఎదురుచూస్తున్న పరిశ్రమకు ఇన్నాళ్లూ సబ్సిడీ కింద ఇచ్చిన విద్యుత్ సౌకర్యాన్నీ ఎత్తివేయడంతో ప్రాణం తీసినట్టయింది. చేసేదేమీ లేక ఆశలన్నీ వదులుకున్న పరిశ్రమ.. సాంచెలన్నీ తెగనమ్ముకుంటోంది. ఏండ్లుగా వీడని సంక్షోభంలో ఏయేటికాయేడు ఒక్కొక్కటిగా స్క్రాప్ కింద పోగా మిగిలిన కాస్త మగ్గాలూ తుక్కు కింద తరలిపోతూ పరిశ్రమయే పూర్తిగా కనుమరుగయ్యే దిశగా పయనిస్తున్న పరిస్థితులపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

యజమాని, ఆసామి, కార్మికుడు ఇలా మూడంచెల వ్యవస్థ ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఒకప్పుడు 45వేల మరమగ్గాలు, సుమారు 10వేల చేనేత మగ్గాలతో కాటన్, పాలిస్టర్ వస్త్రం ఉత్పత్తి అయ్యేది. మార్కెట్‌లో పోటీ పరిస్థితులను ఎదురీదుతూ ఎన్నో ఒడిదొడుకులు, నష్టాలను చవిచూస్తూ కార్మికుల 'చావు పరిస్థితుల' వరకూ వెళ్లి సిరిసిల్ల.. 'ఉరిసిల్లగానూ మారింది. దీంతో కాటన్ ఉత్పత్తి నిలిచిపోయి.. పాలిస్టర్ ఉత్పత్తులకూ గిట్టుబాటు ధర లేక మరమగ్గాలు 35వేలకు చేరాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన గత ప్రభుత్వం నేరుగా ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి ఉపశమనాన్ని కలిగించింది. సర్వశిక్ష అభియాన్ కింద స్కూల్ యూనిఫాం మొదలు బతుకమ్మ రంజాన్, క్రిస్మస్ పండుగల పేరుతో చీరల ఉత్పత్తి కింద 2017 నుంచి రూ.280 కోట్ల విలువైన ఆర్డర్లు ఇవ్వడం మొదలుపెట్టింది. ప్రతియేటా కొంత పెంచుతూ 2022 నాటికి రూ.350 కోట్ల ఆర్డర్లు ఇచ్చింది. 40 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉండగా, 9 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తికి మాత్రమే ఆర్డర్లు ఇచ్చింది. ఈ ఆర్డర్లతో ఏడాదిలో ఆర్నెళ్లుమాత్రమే పని దొరికేది. చీరల డిజైన్, ఇతరాత్ర కొర్రీల నడుమ ఆసాములు, కార్మికులు గిట్టుబాటుకాని కూలి కోసం పోరాడాల్సి వచ్చింది. యారన్ సబ్సిడీ పేరుతో ఏదోరూపంగా అదనపు కూలిని సాధించి ఆర్నెళ్లు పని, మరో ఆర్నెళ్లు పస్తులతో కాలం ...6లో



ఎన్టీఏపై సుప్రీం ఆగ్రహం

0.001 శాతం నిర్లక్ష్యమున్నా వెంటనే పరిష్కరించాలి

- ఆరోపణలపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన 'నీట్' పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్షలు నిర్వహిస్తున్న జాతీయ పరీక్ష మండలి(ఎన్టీఏపై)పై మండిపడింది. నీట్‌యూజీ-2024 పరీక్షల్లో ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా దాన్ని సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేసింది. పరీక్షలు నిర్వహిస్తున్న సంస్థగా ఎక్కడ నిర్లక్ష్యం ఉన్నా న్యాయంగా వ్యవహరించాలని, తప్పిదం జరిగితే జరిగిందని అంగీకరించాలని, చర్యలు తీసుకున్నామని వివరించాలని ఎన్టీఏకు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన వెకేషన్ ధర్మాసనం స్పష్టం చేసింది. తప్పు ...7లో



మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో భూమిపూజ అనంతరం ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆధునికంగా ఐటీఐలు

రూ.2,324.21 కోట్లతో అభివృద్ధి చేస్తాం

- ఉన్నత సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం
- టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం
- నైపుణ్యం లేని సర్టిఫికెట్లు పనికి రావు
- సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉపాధి
- యువతకు తగిన నైపుణ్యాలను అందిస్తాం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) తీర్చిదిద్ది, యువతకు ఆధునిక శిక్షణ అందించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ ప్రాజెక్టుకు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 40, 50 ఏండ్ల కిందటి నైపుణ్యాలను ఐటీఐల్లో నేర్పిస్తున్నారనీ, వాటి వల్ల ఉపాధి లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాను హైదరాబాద్‌లో ఇల్లు నిర్మించేటప్పుడు చాలా మంది ఇంజినీరింగ్ చేసిన వారు రూ.15, రూ.20 వేలకు పని చేస్తామని వచ్చారనీ, నిర్మాణ రంగంలో అనుభవమున్న తాపీ మేస్త్రీని సంప్రదిస్తే రూ.60 వేలు ఇస్తేనే వస్తానని చెప్పాడని గుర్తు చేశారు. నైపుణ్యం లేని పట్టాలు ఎందుకూ పనికి రావని ఆరోజే తనకు అర్థమైందని చెప్పారు. "40 లక్షల మంది యువతీ యువకులు ఉపాధి లేక రిక్రూట్మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారు. నా ఆలోచనల నుంచి వచ్చిందే ఏటీసీ సెంటర్స్.. సర్టిఫికెట్ ఉంటే సరిపోదు. సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉపాధి లభిస్తుందని నేను నమ్ముతున్నా. దుబాయ్ లాంటి దేశాలకు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి గ్యారెంటీ ఇస్తుంది. టాటా సంస్థ సహకారంతో సాంకేతిక నైపుణ్యాల కోసం రూ. 2324 కోట్లతో 65 ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నాం. ఈ శాఖ నా దగ్గరే ఉంది. నేనే స్వయంగా ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా. మధ్య, దిగువ తరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ చేపట్టాం" అని తెలిపారు. ఐటీఐల్లో విరివిగా చేరాలని ...13లో

కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ బృందంతో రేవంత్ భేటీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కుష్ మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భేటీ ...13లో

'పీఎం కిసాన్' నిధులు విడుదల

- రైతుల ఖాతాల్లో రూ. 20 వేల కోట్లు జమ



వారణాసి: కేంద్రప్రభుత్వం 'పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి' 17వ విడత నిధులను విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని తన సొంత నియోజకవర్గమైన వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో ప్రధాని మోడీ ఈ నిధులను విడుదల ...13లో

నీట్ వివాదంపై మౌనంగా ఎందుకున్నారు?

- మోడీపై రాహుల్ విమర్శలు



ఢిల్లీ : నీట్ వివాదంపై మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా నీట్‌లో అవకతవకలు, పేపర్ లీకేజీపై విద్యార్థులు, విపక్షాలు ...13లో



నీట్ రద్దుకై..

కదం తొక్కిన విద్యార్థులు

- 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడం న్యాయమేనా..!
- అక్రమాలపై సుప్రీం జడ్జితో విచారణకు డిమాండ్
- అవకతవకల ఎన్టీఏను రద్దు చేయాలి
- పరీక్షా పే చర్చ అనే మోడీ.. నేషనల్ పరీక్షపై చర్చ చేయాలి
- రాజకీయ ప్రయేయం, కన్సల్టెన్సీల పాత్రపై విచారణ జరిపించాలి
- స్పందించకుంటే కేంద్ర మంత్రులను అడ్డుకుంటాం: రాష్ట్ర విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ
- నీట్ పేపర్ లీకేజీపై హైదరాబాద్‌లో 'స్టూడెంట్ మార్చ్'

నవతెలంగాణ- సిటీబ్యూరో/హిమాయత్‌నగర్

అవకతవకలు జరిగిన ప్రతిష్టాత్మక నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ విద్యార్థి, యువజన లోకం కదం తొక్కింది. మోడీ ప్రభుత్వం మౌనం వీడాలంటూ హైదరాబాద్ నగరం నడిబొడ్డున గర్జించింది. నీట్ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, తక్షణమే ...13లో

పీజీఈసెట్‌లో 18,829 మంది ఉత్తీర్ణులు

ఫలితాలు విడుదల చేసిన బుర్రా వెంకటేశం



వివరాలు 6లో

వైద్యారోగ్యశాఖలో ప్రక్షాళన

మూడు రకాల టాస్క్ ఫోర్స్‌ల ఏర్పాటు : మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో ప్రక్షాళన మొదలుపెట్టినట్టు ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ ప్రక్షాళనతో ఒకట్రెండు సంవత్సరాల్లో స్థిరమైన మార్పులు కనిపిస్తాయని చెప్పారు. మూడు రకాల టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రయివేటు ఆస్పత్రుల పర్యవేక్షణ (క్లినికల్ ఎస్టాబ్లిష్), ఫార్మా పర్యవేక్షణ (డ్రగ్స్ నియంత్రణ), ఆహార నాణ్యత పర్యవేక్షణ కోసం టాస్క్ ఫోర్స్‌లు పని చేస్తాయని ...13లో

20 శాతం మించకుండా బదిలీలు చేయాలి

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

వివరాలు 13లో

వర్షాల నేపథ్యంలో వ్యాధులు పెరిగే ప్రమాదం

13లో..

జాగ్రత్తలు తీసుకోండి : ప్రజలకు వైద్యారోగ్యశాఖ సూచన



దోస్త్ రెండో విడతలో 41,533 మందికి సీట్లు

- సెల్ఫ్ రిపోర్టింగ్‌కు 26 వరకు గడువు
- నేటినుంచి మూడోవిడత కౌన్సెలింగ్

వివరాలు 6లో

అప్పుడే చెప్పాం..వినలే

ఇప్పడవే సమస్యలు వెంటాడుతున్నాయి

- జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట విద్యుత్‌రంగ నిపుణులు రఘు వివరణ
- రాజ్యాంగ వ్యవస్థల్ని ధ్వంసం చేశారు : కోదండరాం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం పూర్తిగా లోపభూయిష్టమని 2016లోనే ప్రభుత్వాన్ని హెచ్చరించినా, పట్టించుకోలేదని విద్యుత్‌రంగ నిపుణులు కే రఘు చెప్పారు. మంగళవారంనాడాయన ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణంపై ...6లో

తక్కువ ధరకు బంగారమంటూ గాలం

- నకిలీ బంగారం బిస్కెట్లను అంటగడుతున్న ముఠా
- నలుగురి అరెస్ట్
- నకిలీ నోట్లతోపాటు ఐదు కిలోల నకిలీ బంగారం స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ముఠాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6.86 లక్షల నకిలీ నోట్లు, 5 కిలోల నకిలీ బంగారం బిస్కెట్లతోపాటు రూ.51లక్షలు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ తరుణ్‌జోషీ వివరాలు వెల్లడించారు.

ఏపీ నెల్లూరుకు చెందిన కె.విజయ్‌కుమార్ అలియాస్ కృష్ణ మోహన్ చౌదరి, గుంటూరుకు చెందిన ఎస్.డేవిడ్ లివింగ్ స్టోన్, కావలికి చెందిన బి.సునీల్ గవాస్కర్ అలియాస్ హరీష్, బోడుప్పల్‌కు చెందిన ఆదిగోపుల ఓంసాయి కిరీటీ ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. చెన్నయ్, బెంగళూర్‌లో కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి పెద్దఎత్తున బంగారం బిస్కెట్లను కొనుగోలు చేశామని బంగారం వ్యాపారులను, స్నేహితులతోపాటు అమాయకులను నమ్మించారు. మార్కెట్ ధర కంటే తక్కువకు బంగారం బిస్కెట్లు విక్రయిస్తామంటూ నమ్మబలికారు. ముందుగా డబ్బులు తీసుకుని కొంత బంగారాన్ని అందించేవారు. ఆ తర్వాత లక్షల్లో డబ్బులు తీసుకుని నకిలీ బంగారం బిస్కెట్లను అంటగట్టేవారు. ఇదే తరహాలో బోడుప్పల్‌కు చెందిన దిలీప్ బర్వాను మోసం చేశారు. తక్కువ ధరకు బంగారం బిస్కెట్లు ఇస్తున్నారని బోడుప్పల్‌లో నివాసముంటున్న స్నేహితుడు సింగిరెడ్డి సురేష్ ద్వారా తెలుసుకున్న దిలీప్.. అతనితో కలిసి గత నెల 19న బెంగళూర్‌కు వెళ్లాడు. విజయ్‌కుమార్, హరీష్‌ను కలిశాడు. రూ.6 లక్షలు చెల్లించిన 81గ్రాముల బంగారాన్ని తీసుకుని దిలీప్ హైదరాబాద్‌కు వచ్చాడు. నాలుగు రోజుల తర్వాత బోడుప్పల్‌కు వచ్చిన హరీష్ వారితో వ్యాపారం కోసం మాట్లాడాడు. కమీషన్లపై బంగారాన్ని విక్రయించాలని ఒప్పందం చేసుకుని 20 గ్రాముల బంగారాన్ని వారికి అప్పగించాడు. ఒర్జినల్ బంగారం కావడంతో పూర్తిగా నమ్మిన దిలీప్ మరో 2 కిలోల బంగారం కావాలని రూ.కోటికి ఒప్పందం చేసుకుని అడ్వాన్స్‌గా రూ.20లక్షలు హరీష్‌కు చెల్లించాడు. అయితే, బంగారాన్ని పంపకపోవడంతో తన స్నేహితుడు సింగిరెడ్డిని తీసుకుని దిలీప్ తిరిగి బెంగళూర్‌కు వెళ్లి విజయ్‌కుమార్‌ను కలిశాడు. స్టాక్ అయిపోయిందని, మిగిలిన డబ్బులు చెల్లించి బంగారాన్ని చెన్నయ్‌లోని తన మేనేజర్ లివింగ్ స్టన్ వద్ద తీసుకోవాలని చెప్పడంతో దిలీప్ మరో రూ.90 లక్షలు ఇచ్చాడు. గత నెల 30న చెన్నయ్‌కి వెళ్లిన స్నేహితులిద్దరూ రాయల్ మెరీడియన్ హోటల్‌లో లివింగ్ స్టన్‌ను కలిశారు. తానే హైదరాబాద్‌కు వచ్చి బంజారాహిల్స్‌లో బంగారాన్ని అందిస్తానని చెప్పడంతో వారు తిరిగి వచ్చారు. కానీ బంగారాన్ని పంపించకపోవడంతో బాధితులు పలుమార్లు విజయ్ కుమార్‌కు ఫోన్లు చేసినా స్పందించలేదు. దాంతో అనుమానం వచ్చిన దిలీప్ రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న మేడిపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నలుగురి ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వారిపై పలు కేసులు నమోదైనట్టు సీపీ తెలిపారు. ఎవరైనా తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెప్తే నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ పద్మజా, ఏసీపీ చక్రపాణి, మేడిపల్లి ఎస్‌హెచ్‌వో గోవర్ధన్ రెడ్డి, ఐఓ ఏ.నర్సింగరావు తదితరులు ఉన్నారు.

లోపాలున్న కాలేజీలకు గుర్తింపు ఇచ్చేది లేదు

- 2,3 రోజుల్లో యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తాం
- ఇంజినీరింగ్ విద్యలో ప్రమాణాలు పెంచడమే లక్ష్యం
- కౌన్సెలింగ్ నాటికి అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తి
- అన్ని కాలేజీల్లోనూ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి : విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో లోపాలుంటే కఠినంగా వ్యవహరిస్తామనీ, అనుబంధ గుర్తింపు ఇచ్చేది లేదని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, జేఎన్టీయూహెచ్ ఇన్‌చార్జీ వీసీ బుర్రా వెంకటేశం చెప్పారు. లోపాలను సరిదిద్దుకుంటేనే అనుబంధ గుర్తింపు ఇస్తామని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో కొన్నింటిలో ప్రిన్సిపాళ్లు లేరనీ, మరికొన్నింటిలో అధ్యాపకుల్లేరని చెప్పారు. కొన్ని కాలేజీల్లో ల్యాబ్‌లు, ఇతర వసతులు సరిగ్గా లేవని అన్నారు. లోపాలున్న కాలేజీలకు గుర్తింపు ఇస్తే ప్రమాణాలు ఎలా మెరుగవుతాయనీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు హోంగార్డులు, డాటాఎంట్రీ ఆపరేటర్లుగా మారితే ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ విద్యార్థులంటే ఉద్యోగాలు కల్పించే వారిలాగా మారాలనీ, ఉద్యోగాల కోసం ఎదురుచూడొద్దని అన్నారు. అందుకే కాలేజీల్లో ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమన్నారు. ప్రమాణాలను పాటించిన కాలేజీలకే అనుబంధ గుర్తింపు ఇస్తామని చెప్పారు. ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ నాటికి రాష్ట్రంలో అన్ని ఇంజినీరింగ్ కాలేజీలకు గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. లోపాలున్న కాలేజీ యాజమాన్యాలతో రెండు, మూడు రోజుల్లో సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. లోపాలను సరిదిద్దుకోవాలనీ, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచిస్తామన్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీలన్నింటిలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పనిసరిగా అమలు చేస్తామని అన్నారు. ఇందుకు సంబంధించి ఆదేశాలను జారీ చేస్తామన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లపై పరిశీలిస్తామని చెప్పారు.

యువత జీవితాలతో బీఆర్ఎస్ సర్కారు చెలగాటం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు యువత జీవితాలతో చెలగాటమాడిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయడం గులాబీ పార్టీకి ఇష్టం లేదని చెప్పారు. గత పదేండ్లలో ఒక్క గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేకపోయిందని విమర్శించారు.మంగళవారం హైదరాబాద్ లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నోటిఫికేషన్‌లో పేర్కొన షెడ్యూల్ ప్రకారం గ్రూప్ 1 పరీక్షలు ఉంటాయని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ నేతల ఇష్టానుసారం షెడ్యూల్ మార్చేందుకు వీలుం డదని తెలిపారు. కేసీఆర్ నిర్ణయంతో విద్యుత్ శాఖపై రూ.40వేల కోట్ల ఆర్థిక భారం పడిందనీ, కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఎక్కువ పైసలు పెట్టి విద్యుత్ కొనుగోలు చేశారని ఆరోపించారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ భారమవుతుందని అప్పుడే హెచ్చరించినా ఆయన వినలేదని గుర్తు చేశారు. బొగ్గు ఉత్పత్తి అయ్యే చోట పవర్ ప్లాంట్లు పెట్టాలిగానీ దామర చర్లలో ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. విద్యుత్ శాఖలో అప్పుడు జరిగిన అవినీతి, అక్రమాలు ఇప్పుడు కేసీఆర్ మెడకు చుట్టుకుంటున్నాయని తెలిపారు. ఆ విషయాలు చర్చకు రాకుండా హరీశ్‌రావు పక్కదారి పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు.

హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకో

- ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై చిల్లర మాటలు మానుకోవాలని ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. పోర్లు దండాలు పెట్టిన ఆయనకు పార్టీ పగ్గాలు ఇవ్వబోరని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. హరీశ్‌రావు తన స్థాయికి అనుగుణంగా మాట్లాడాలని వారు సూచించారు.

ప్రజలకు తెలియజేసేందుకే 'పవర్ కమిషన్' : వినోద్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లలో నెలకొన్న అక్రమాలు ప్రజలకు తెలియజేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'పవర్ కమిషన్' ఏర్పాటు చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షులు వినోద్ రెడ్డి స్పష్టం చేశారు. మార్వా పవర్ ప్లాంట్ పనులు పూర్తి కాకుండా ఎందుకు ఎమ్‌వోయూ కుదుర్చుకున్నారని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో లీగల్ సెల్ విభాగం చైర్మెన్ దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి పవర్ కమిషన్ వేయాలంటూ అసెంబ్లీలో చేసిన విజ్ఞప్తిమేరకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కేసీఆర్ పవర్ కమిషన్ ముందుకు రాకుండా బహిరంగ లేఖ రాయడమేంటని ఆయన ప్రశ్నించారు.

ప్రియాంక పోటీకి నిర్ణయించుకోవడం పట్ల హర్షం : నిరంజన్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వయనాడ్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకోవడం పట్ల టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ హర్షం వ్యక్తం చేశారు. ఆమె నిర్ణయాన్ని వయనాడ్ ప్రజలే కాకుండా యావత్ దక్షిణ భారతదేశ ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అఖండ మెజార్టీతో గెలిచి చరిత్ర సృష్టిస్తారని తెలిపారు. రాహుల్, ప్రియాంకకు మద్దతుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇందులో కొత్తేముంది?

వారణాసిలో మోడీ చేతుల మీదుగా పీఎం-కిసాన్ నిధులు విడుదల

- ఇచ్చేది గోరంత...ప్రచారం కొండంత
- అరకొర సాయంతో మభ్యపెట్టే ప్రయత్నం
- రైతన్న గోడు పట్టని ప్రభుత్వం



న్యూఢిల్లీ : రైతాంగానికి ఆర్థికంగా చేయూత అందించేందుకు ఐదు సంవత్సరాల క్రితం మోడీ ప్రభుత్వం ప్రారంభించిన పథకం పీఎం-కిసాన్. దీని కింద ఒక్కో విడతలో రెండు వేల రూపాయల చొప్పున సంవత్సరానికి మూడు విడతలుగా మొత్తం ఆరు వేల రూపాయలు అందజేస్తున్నారు. ఈ అరకొర సాయానికే ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్భాటం చేస్తోంది. అదేదో కొత్త పథకమైనట్లు ప్రధాని నరేంద్ర మోడీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో అట్టహాసంగా అన్నదాతల ఖాతాలకు నగదు బదిలీ చేశారు. దీనికి బీజేపీ అనుకూల మీడియా ఎనలేని ప్రాధాన్యత ఇచ్చింది. ఇచ్చేది గోరంత...ప్రచారమేమో కొండంత.

సమస్యల పరిష్కారంలో ఉదాసీనత

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంటులో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం కింద రైతులకు ఏటా మూడు విడతలుగా మొత్తం ఆరు వేల రూపాయలు సంబంధిత బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. ఇప్పటికే అలాంటి 16 వాయిదాలకు సంబంధించి చెల్లింపులు జరిగాయి. తాజాగా మంగళవారం 17వ వాయిదా సొమ్మును బదిలీ చేశారు. ఇది రొటీన్‌గా జరిగే కార్యక్రమమే. సంబంధిత మంత్రిత్వ శాఖకు బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ము నుండి రైతుల ఖాతాకు నేరుగా నగదును బదిలీ చేస్తారు. మంత్రిత్వ శాఖకు చెందిన సిబ్బంది ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేస్తారు. ఇదంతా యథావిధిగా జరిగే కార్యక్రమమే అయినప్పటికీ ఇప్పుడు ప్రధానమంత్రిని భాగస్వామిని చేయడమే విశేషం.

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రధాని మోడీ తన నియోజకవర్గమైన వారణాసిలో మంగళవారం తొలిసారి పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన దేశంలోని 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.20,000 వేల కోట్లు జమ చేస్తారని బీజేపీ అనుకూల ప్రసార మాధ్యమాలలో కొద్ది రోజుల నుండి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా రెండున్నర కోట్ల మంది అన్నదాతలు ఆన్‌లైన్ ద్వారా వీక్షించే ఏర్పాటు చేశారు.

సంకీర్ణ సారథినన్న వాస్తవాన్ని మరచి...

లోక్‌సభ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సాధించలేక చతికిలపడిన బీజేపీ, ఎన్డీఏ మిత్రపక్షాల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే తాను సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నానన్న వాస్తవాన్ని మోడీ విస్మరించారు. గడచిన దశాబ్ద కాలంలో ఎలా చక్రం తిప్పారో ఇప్పుడూ అలాగే తిప్పాలని ఆయన ఆశిస్తున్నారు. ప్రతి కార్యక్రమం తన చేతుల మీదుగానే నడవాలని కోరుకుంటున్నారు. సంకీర్ణ ప్రభుత్వానికి మోడీ నేతృత్వం వహిస్తున్నారన్న సత్యాన్ని ప్రజల మనసుల్లో నుండి చెరిపివేసేందుకు తంటాలు పడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ విడుదల చేసిన మ్యానిఫెస్టోకు 'మోడీ కీ గ్యారంటీ' అని పేరు పెట్టిన విషయం తెలిసిందే. అందులో రైతుల కోసం కొత్తగా చేర్చిన కార్యక్రమం కానీ, పథకం కానీ ఏమీ లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గతంలో ఇచ్చిన హామీని తాజా మ్యానిఫెస్టోలో కనీసం ప్రస్తావించనైనా లేదు. తమ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధరలు కల్పించాలని, వాటికి చట్టబద్ధత ఇవ్వాలని రైతులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నప్పటికీ బీజేపీ మ్యానిఫెస్టో దానిపై మౌనాన్నే ఆశ్రయించింది. మోడీ ఎన్నికల ప్రచారంలో కూడా రైతు సమస్యలను పెద్దగా ప్రస్తావించలేదు.

ఇప్పుడూ అదే అరకొర సాయం

ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు అందజేస్తున్న సాయాన్ని పెంచుతారని అందరూ ఆశించారు. అయితే ప్రభుత్వం ఆ పని కూడా చేయలేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకోకుండా గత ఐదు సంవత్సరాలుగా అందజేస్తున్న సాయాన్నే ఇప్పుడూ కొనసాగిస్తున్నారు. తాజాగా అదేదో కొత్త పథకమైనట్లు ప్రధాని చేతులు మీదుగా నగదు బదిలీ చేయించారు. పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించినప్పుడు దానిపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రైతుకు ఏటా ఆరు వేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటే ప్రయోజనమేమీ ఉండబోదని పలువురు నిపుణులు అప్పుడే తేల్చి చెప్పారు. ఈ స్వల్ప మొత్తంతో రైతన్న ఆదాయంలో వచ్చే మార్పేమీ ఉండదు. అతని రుణభారమూ తీరదు. పైగా ఆ అరకొర సాయం కూడా భూ యజమానులకే అందుతుంది తప్పించి కౌలు రైతులకు దక్కేదేమీ ఉండదు.

సమస్యలకు పరిష్కారాలేవి?

వ్యవసాయం రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు నానాటికీ తగ్గిపోతున్నాయి. మరోవైపు దేశ జనాభాలో 45 శాతం మందికి పైగా ప్రజలు తమ జీవనోపాధి కోసం ఇప్పటికీ వ్యవసాయం పైనే ఆధారపడుతున్నారు. వ్యవసాయ రంగం ప్రతి సంవత్సరం కొత్త కొత్త సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పులు అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతుల ఇబ్బందులు చెప్పనలవి కావు. ప్రభుత్వం మాత్రం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. అరకొర సాయాన్ని అందిస్తూ దానినే ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటోంది. ఆందోళనలు, నిరసనల సందర్భంగా రైతులు లేవనెత్తిన పలు సమస్యలకు ఇప్పటికీ పరిష్కారం లభించలేదు. దీర్ఘకాలిక ఉద్యమాల కారణంగా వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం ఉపసంహరించుకున్నప్పటికీ అనేక మౌలిక అంశాలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి.

ఎన్నో సమస్యలు

అన్ని పంటలకూ కనీస మద్దతు ధరలు, ఉత్పత్తుల సేకరణలో వికేంద్రీకరణ, వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచడం, పంట వైవిధ్యం, రుణ సదుపాయం, పంట బీమా, డబ్ల్యూటీఓ ఆంక్షలు, రసాయన ఎరువులు-క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించడం, మార్కెట్లలో ప్రవేశానికి అవరోధాలు తొలగించడం....ఇలా చెప్పుకుంటూ పోతే వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు సవాలక్ష. కులం, లింగం సహా భూ యాజమాన్య హక్కుల పంపిణీలో అసమానతలకు సంబంధించిన సమస్యను కనీసం ప్రస్తావించే వారు కూడా లేరు.

గుణపాఠాలు తప్పవు

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ స్థానాలు కోల్పోయిందని కొన్ని విశ్లేషణలు చెబుతున్నాయి. వేతనాలు స్థిరంగా ఉండడం, వ్యవసాయంలో తగినంత ఆదాయం లభించకపోవడం, నిరుద్యోగం పెరగడం వంటివి ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. ఈ తీర్పు నుండి పాలక పక్షం గుణపాఠం నేర్చుకొని గ్రామీణ ప్రాంతాలపై మరింత దృష్టి సారించాలని, ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని ఇతోధికంగా ఆదుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రైతులుగా గుర్తింపేదీ?



స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీలు) చెందిన 30 వేల మంది మహిళలకు పారా ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పనిచేసేందుకు ప్రధాని వారణాసి పర్యటనలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వీరందరికీ ఇప్పటికే 'కృషి సఖులు'గా శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు వీరికి అతి తక్కువ ప్రతిఫలాన్ని చెల్లిస్తూ క్లిష్టమైన పనులు చేయించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వీరికి తగిన గుర్తింపు కూడా ఉండదు. ఓ రకంగా చెప్పాలంటే వాలంటీర్ల వంటి వారు. అన్నదాతల కోసం ఉద్దేశించిన కార్యక్రమంలో కూడా మహిళలను వాలంటీర్లుగా తీసుకుంటున్నారే తప్పించి రైతులుగా కాదు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో 75 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు. అదే పురుషుల్లో 49 శాతం మందే ఈ రంగంలో ఉన్నారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే 63 శాతం మంది గ్రామీణ పురుషులు యజమాని హోదా పొందితే 52 శాతం మంది మహిళలు సహాయకులుగానే ఉండిపోతున్నారు. పురుషులతో సమానంగా...ఒక్కోసారి ఎక్కువగానే మహిళలు పొలంలో కష్టపడినప్పటికీ వారిని రైతులుగా గుర్తించడం లేదు. పీఎం-కిసాన్ పథకంలో సైతం మొత్తం లబ్దిదారుల్లో 25 శాతం మంది మాత్రమే మహిళలు.

దేశీయ వెబ్‌సైట్లపై పెరుగుతున్న సైబర్ దాడులు

న్యూఢిల్లీ : 2024 జనవరి-ఏప్రిల్ మధ్యకాలంలో భారతీయ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు 261% మేర పెరిగాయి. గత సంవత్సరం ఇదే కాలంలో ఈ తరహా దాడుల సంఖ్య 76% మాత్రమే పెరిగిందని ఇండస్‌ఫేస్ అనే అప్లికేషన్ సెక్యూరిటీ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక తెలిపింది. పరిశ్రమతో పోలిస్తే విద్యుత్, ఇంధన కంపెనీలు 500 రెట్లు అధికంగా దాడులు ఎదుర్కొన్నాయి. భారతీయ వెబ్‌సైట్లపై దాడులు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే విషయమేనని, గత సంవత్సరంతో పోలిస్తే విద్యుత్, ఉత్పత్తి వంటి అనియంత్రిత పరిశ్రమలపై మరిన్ని దాడులు జరుగుతున్నాయని ఇండస్‌ఫేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆశిష్ టాండన్ తెలిపారు.

సైబర్ దాడులు చేసే వారు ఇంటర్నెట్ ట్రాఫిక్‌తో సర్వర్‌ను పంపుతారు. అది ఆన్‌లైన్ సేవలు పొందకుండా, ఆన్‌లైన్ సైట్లలో ప్రవేశించకుండా వినియోగదారులను అడ్డుకుంటుంది. దీనినే డిస్ట్రిబ్యూటెడ్ డినయల్-ఆఫ్-సర్వీస్ (డీడీఓఎస్) అంటారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లో డీడీఓఎస్ దాడులు 76% పెరిగాయి. దాడులు అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, హెల్త్‌కేర్ యాప్‌లు 100%, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగానికి చెందిన యాప్‌లు 90% మేర సైబర్ దాడులకు గురయ్యాయని నివేదిక తెలిపింది.

సీఆర్‌పీఎఫ్ సైనికులను కిందకు దించి బస్సును దగ్ధంచేసిన దుండగులు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ ఇంకా కొనసాగుతూనే ఉంది. సాయుధ దుండగులు ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. తాజాగా సిఆర్‌పిఎఫ్ జవాన్లతో వెళుతున్న బస్సును అడ్డగించిన దుండగులు బస్సులో ఉన్న జవాన్లు అందర్నీ కిందకు దిగమని చెప్పి తరువాత బస్సును దగ్ధం చేశారు. కాంగ్పోక్పి జిల్లాలో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనపై కాంగ్పోక్పి పోలీసుస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదయింది. ఇది ఒక అద్దె బస్సు అని, సిఆర్‌పిఎఫ్ జవాన్లతో ఈ బస్సు ప్రయాణం చేస్తుందని పోలీసులు చెప్పారు.

గతవారం బిష్ణుపూర్ జిల్లాలో రెండు ట్రక్కులను దగ్ధం చేసినందుకు ప్రతీకారంగా ఈ తాజా ఘటన జరిగిందని పోలీసులు చెబుతున్నారు. మణిపూర్‌లో గత ఏడాది మే నుంచి హింసాకాండ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ హింసాకాండలో ఇప్పటి వరకూ 220 మంది మరణించగా, 50 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

రాహుల్‌పై కేసు విచారణ 26కి వాయిదా

సుల్తాన్‌పూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై దాఖలైన పరువు నష్టం కేసు విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదా పడింది. సుల్తాన్‌పూర్‌లోని ఎంపీ, ఎమ్మెల్యేల కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండడంతో మంగళవారం విచారణ జరగలేదు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలకు సంబంధించి రాహుల్‌పై బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసుపై ఈ నెల 7న విచారణ జరగ్గా సంబంధిత న్యాయమూర్తి శుభం వర్మ దానిని 18వ తేదీకి వాయిదా వేశారు.



ఎంహెచ్ వర్థంతి సభలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

విలువల శిఖరం మోటూరి

అన్ని రంగాల్లోనూ ఆయన నిష్ణాతులు : ఎంహెచ్ వర్థంతిలో చెరుపల్లి సీతరాములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జర్నలిజంలో విలువల కోసం పాటుపడ్డ మహనీయుడు మోటూరు హనుమంతరావు అనీ, ఆయన అన్ని రంగాల్లోనూ నిష్ణాతులని నవతెలంగాణ సబ్‌కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు కొనియాడారు. మంగళవారం హైదరాబాద్‌లోని నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం లో ఎంహెచ్ వర్ధంతిని నిర్వహించారు. ఎంహెచ్ చిత్రపటానికి సీతారాములు, నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్, ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ..మోటూరు హనుమంతరావు స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యులుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొట్లాడారన్నారు. ఎంహెచ్ జీవితం గురించి అధ్యయనం చేయాలని సూచించారు. ఆయన ప్రజాశక్తి పత్రికకు వన్నె తెచ్చారనీ, ఆయన రాసిన ఎడిటోరియల్స్, సైద్ధాంతిక వ్యాసాలు ఎంతో పేరు తెచ్చిపెట్టాయని గుర్తుచేశారు. ఆయన ప్రతి అంశంపైనా విపరీతంగా అధ్యయనం చేసేవారనీ, తాను అధ్యయనం చేసిన దాని గురించి ప్రజలకు విడమర్చి చెప్పడంలో నేర్పరి అని కొనియాడారు. అప్పట్లో ప్రజలకు, కార్యకర్తలకు ప్రజాశక్తి వారపత్రిక దిక్సూచిగా ఉండేదన్నారు. కమ్యూనిస్టు పార్టీల చీలిక సమయాల్లో అతివాద, మితవాదం మీద ఆయన పెద్ద పోరాటమే చేశారన్నారు. దేశంలో సమసమాజాన్ని నిర్మించాలనే ఒక లక్ష్యం కోసం జీవితాంతం నిజాయితీగా పనిచేసిన గొప్ప నాయకుల్లో ఆయన ఒకరని కొనియాడారు. సీపీఐ(ఎం)ను విప్లవపార్టీగా తీర్చిదిద్దడంలో ఎంహెచ్ కృషి మరువలేనిదన్నారు. ఆయన స్ఫూర్తితో విప్లవ లక్ష్యాల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించేవారనీ, ప్రజలతో, కార్యకర్తలతో, నాయకులతో ఎంతో అన్యోన్యంగా ఉండేవారని గుర్తుచేశారు. అడ్వర్టజ్‌మెంట్, పెయిడ్ న్యూస్ పేరుతో పత్రికారంగంలో విలువలు పడిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విలువలను, నవతెలంగాణ పత్రిక నాణ్యతను పెంచేలా సిబ్బంది తమ వంతు కృషి చేయాలని కోరారు. నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ మాట్లాడుతూ...ప్రజాశక్తి పత్రికను ముందుకు తీసుకెళ్లడంలో ఎంహెచ్ కీలకపాత్ర పోషించారనీ, ఆయన రాసిన వ్యాసాలు సైద్ధాంతిక చర్చకు దారితీసేవని గుర్తుచేశారు. సమాజాన్ని వివిధ కోణాల్లో చూసి ప్రజలకు అర్థమయ్యేలా విడమర్చి చెప్పడం, రాయటం కీలకమన్నారు. కార్యక్రమంలో నవతెలంగాణ న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేశ్, బుక్‌హౌజ్ ఎడిటర్ ఆనందాచారి, బ్యూరోచీఫ్ పద్మరాజు, జనరల్ మేనేజర్లు వెంకటేశ్, రఘు, శశిధర్, మేనేజర్లు, బోర్డు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మానవ హక్కులను రాజకీయం చేస్తున్నారు !

ఈయూ చర్యలపై చైనా తీవ్ర విమర్శ

బీజింగ్ : మానవ హక్కుల అంశాలను రాజకీయం చేస్తూ, వాటిపై ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారంటూ యురోపియన్ యూనియన్ (ఈయు) చర్యలను చైనా తీవ్రంగా నిరసించింది. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి మానవ హక్కుల అంశాలను ఉపయోగిస్తున్నారని విమర్శించింది. యురోపియన్ యూనియన్‌తో పరస్పర మార్పిడుల ద్వారా పరస్పర పురోగతి సాధించగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. తద్వారా అంతర్జాతీయ మానవ హక్కుల పాలనకు సంబంధించి సానుకూల సహకారం అందించగలరని ఆశిస్తున్నట్లు చైనా విదేశాంగ సహాయ మంత్రి మియో డెయూ చెప్పారు. బీజింగ్‌లో సోమవారం ఈయు అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడారు.

చైనా మానవ హక్కుల సూత్రాలు, సిద్ధాంతాలను ఈ సమావేశంలో ఆయన సమగ్రంగా వివరించారు. ప్రజల ప్రాథమిక ప్రయోజనాలనునెరవేర్చేందుకు ప్రజలకు హృదయపూర్వకంగా సేవ చేయాలన్నదే చైనా కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజానుకూల విధానాలకు చైనా కట్టుబడి వుందని చెప్పారు. ప్రజలకు సంతోషకరమైన జీవితాన్ని అందించడమే అత్యంత గొప్పదైన మానవ హక్కని వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా వుండేలా, దేశ కాలమాన పరిస్థితులకు అనువుగా వుండేలా మానవ హక్కుల పంథాను అభివృద్ధిపరిచిందని చెప్పారు. మానవ హక్కులకు సంబంధించి చారిత్రక విజయాలు సాధించామన్నారు. చైనా తరహా ఆధునీకరణ ద్వారా చైనా పునరుజ్జీవనాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయంగా మానవ హక్కులకు సంబంధించి చర్చలు, సహకారం వంటి అంశాల్లో చైనా చురుకుగా పాల్గొంటోందని చెప్పారు. అంతర్జాతీయ మానవ హక్కులను ఆరోగ్యకరంగా అభివృద్ధి పరచడంలో చైనా ముందుంటుందన్నారు. చైనా తరహా ఆధునీకరణ వల్ల చైనాలో మానవ హక్కుల పరిరక్షణ మరింత పటిష్టపడుతుందన్నారు. మానవ హక్కుల అంశాలకు సంబంధించి తమదైన నమూనాను ఇతరులపై రుద్దాలనుకునే వైఖరిని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని మియో స్పష్టం చేశారు. ఇలా ప్రతిసారీ మానవ హక్కుల అంశాలను ఉపయోగిస్తూ చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. బహుముఖ వేదికలపై ఘర్షణలను, మైక్రోఫోన్స్ దౌత్యాన్ని వ్యతిరేకించారు. పరస్పర మార్పిడుల ద్వారా, పరస్పరం నేర్చుకుంటూ, తెలుసుకుంటూ ఇయు, చైనా పరస్పర పురోగతి సాధించగలవని ఆశిస్తున్నట్లు తెలిపారు.

కాంచనగంగ రైలు ప్రమాదంలో 10కి చేరిన మృతుల సంఖ్య

సిలిగురి : పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం జరిగిన కాంచనగంగ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరుకుంది. ఈ విషయాన్ని అధికారులు మంగళవారం వెల్లడించారు. ప్రమాద స్థలంలోనే మృతి చెందిన ఎనిమిది మంది మృత దేహాలను సిలిగురిలోని నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్ (ఎన్‌బిఎంసిహెచ్)కు తరలించారు. మరో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. వీరిలో ఒకరు ఆరేళ్ల బాలిక అని ఎన్‌బిఎంసిహెచ్ డీన్ డాక్టర్ సందీప్ సేన్‌గుప్తా తెలిపారు. ఆరేళ్ల బాలికను తీవ్రగాయాలతో ఆసుపత్రికి తీసుకొచ్చారని, చికిత్స పొందుతూ మరణించిందని చెప్పారు. మొత్తంగా ఈ రైలు ప్రమాదానికి సంబంధించి 37 మంది గాయాలతో ఆసుపత్రిలో చేరారని, ఇందులో ఇద్దరు ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారని తెలిపారు. చికిత్స పొందుతున్న మిగిలిన అందర్నీ మంచి ఆరోగ్యంతో ఇంటికి పంపించడమే తన లక్ష్యమని అన్నారు. న్యూ జల్పాయిగురి స్టేషన్‌కు 30 కిమీ దూరంలోని రంగపాణి వద్ద సోమవారం ఉదయం కాంచనగంగా ఎక్స్‌ప్రెస్ రైలును గూడ్స్ రైలు ఢీకొట్టిన సంగతి తెలిసిందే. కాగా, ఈ ప్రమాదంలో ప్రభావానికి గురికాని బోగీలతో కోల్‌కతాలోని సీల్దా స్టేషన్‌కు ఈ రైలు మంగళవారం ఉదయం చేరుకుంది. తెల్లవారు జామున 3:16 గంటలకు దాదాపు 850 మంది ప్రయాణీకులతో రైలు చేరుకుందని అధికారులు తెలిపారు. ప్రమాద ప్రాంతం నుంచి సోమవారం మధ్యాహ్నం రైలు బయలుదేరినట్లు చెప్పారు. వాస్తవంగా షెడ్యూల్ ప్రకారం ఈ రైలు సోమవారం సాయంత్రం 7:20 గంటలకు సీల్దా స్టేషన్‌కు చేరుకోవాల్సి ఉంది. ప్రయాణీకులకు వైద్య సదుపాయాలు, ఆహారం, నీరు అందించినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణీకులను ఇళ్లకు చేర్చేందుకు 16 బస్సులు, 60 కార్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసు

భవాని రేవణ్ణకు బెయిల్

బెంగుళూరు : ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసులో అతని తల్లి భవానీ రేవణ్ణకు కర్ణాటక హైకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసు బాధితుల్లో ఒకరిని అపహరించిన ఆరోపణలతో భవాని రేవణ్ణపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. భవానికి బెయిల్ మంజూరు చేసిన కోర్టు విచారణ కోసం ఆమెను హాసన్, మైసూర్ జిల్లాలకు తీసుకుని వెళ్లడానికి సిట్‌కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వేడుకలు, ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని భవాని రేవణ్ణను కోర్టు ఆదేశించింది.

యూపీలోనే మహిళలపై దాడుల ఫిర్యాదులు అధికం

ఈ ఏడాదిలో జాతీయ మహిళా కమిషన్‌కు ఇప్పటికే 12,600 ఫిర్యాదులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ మహిళా కమిషన్(ఎన్సీడబ్ల్యూ)కు ఈ ఏడాది సుమారు 12,600 ఫిర్యాదులు అందాయి. దీంట్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి నమోదయ్యాయి. ఎన్సీడబ్ల్యూ రైట్ టు డిగ్నిటీ కింద ఎక్కువ ఫిర్యాదులు అందుకున్నట్లు డేటాలో వెల్లడించారు. దీంట్లో గృహ హింస కాకుండా ఇతర వేధింపులు ఉన్నాయి. ఇలాంటివి సుమారు 3,107 ఫిర్యాదులు ఉన్నట్లు ఎన్సీడబ్ల్యూ డేటా ప్రకారం తెలుస్తోంది. వరకట్న వేధింపుల కింద నమోదైన



ఫిర్యాదులు 1,957 ఉన్నాయి. వేధింపులు 817, మహిళల పట్ల పోలీసుల వైఖరి 518, లైంగికదాడుల కింద 657 ఫిర్యాదులు ఉన్నాయి. లైంగిక వేధింపుల కింద 493, సైబర్ క్రైం కింద 339, వెంబడించడం లాంటివి 345, హానర్ క్రైం కింద 206 ఫిర్యాదులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి మొత్తం 6,470 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఆ తరువాత స్థానంలో ఢిల్లీ నిలిచింది. ఢిల్లీలో 1,113, మహారాష్ట్రలో 762, బీహార్‌ల 584, మధ్యప్రదేశ్‌లో 514, హర్యానాలో 506, రాజస్థాన్‌లో 408, తమిళనాడులో 301, పశ్చిమ బెంగాల్‌లో 306, కర్నాటకలో 305 ఫిర్యాదులు నమోదయ్యాయి. 2023లో 28,811 ఫిర్యాదులను ఎన్సీడబ్ల్యూ రిజిస్టర్ చేసింది.

కవితను కలిసిన మాజీ మంత్రులు సత్యవతి,సబితా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై తీహార్ జైల్‌లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పరామర్శించేందుకు బీఆర్ఎస్ నేతలు క్యూ కడుతున్నారు. మంగళవారం మాజీ మహిళా మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రా రెడ్డి తీహార్ జైల్‌లో ఆమెను కలిశారు. ఉదయం 9 గంటలకు వారు తీహార్ జైల్‌కు చేరుకున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు కవితతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కవితకు ధైర్యం చెప్పారు. కాగా, దాదాపు రెండు నెలల తర్వాత గతవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కవితతో ములాఖాత్ అయ్యారు. దాదాపు 20 నిమిషాలు మాట్లాడారు. న్యాయ సలహాతో పాటు, తాజా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే రోజు సాయంత్రం ప్లానింగ్ కమిషన్ మాజీ ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ కవితను కలిసి ధైర్యం చెప్పారు. అంతకుముందు ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్, ఇతర పార్టీ నేతలు ఆమెను కలిసారు. అయితే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాలతో కవితను కలిసేందుకు ఢిల్లీ వస్తున్నట్లు నేతలు చెబుతున్నారు. మరోవైపు లిక్కర్ స్కాంలో ఈ ఏడాది మే 15 న కవితను ఈడీ, ఏప్రిల్ 11 న సీబీఐ అరెస్ట్ చేయగా దాదాపు రెండున్నర నెలలుగా ఆమె తీహార్ జైల్‌లో ఉన్నారు.


నవతెలంగాణ

రాజకీయ నాయకుడు భావి ఎన్నికల గురించి ఆలోచిస్తే, రాజనీతిజ్ఞుడు భావి భారతాన్ని గురించి ఆలోచిస్తాడు - ఫ్రీమన్ క్లార్క్

బుధవారం 19 జూన్ 2024
www.navatelangana.com

సంపాదకీయం

ఆగని రైలు ప్రమాదాలు



బాలాసోర్ విషాదం నుండి పూర్తిగా తేరుకోకముందే బెంగాల్‌లో కాంచనజంగ ప్రమాదం కలవరపెట్టింది. రైలుపెట్టెలు అగ్గిపెట్టెల్లా చెల్లా చెదురయ్యాయి. ఈ ప్రమాదంలో 15 మంది చనిపోగా 60 మంది గాయపడ్డారు. ఈ వరుస ప్రమాదాలు ఎందరో తల్లులకు కడుపుకోత మిగిల్చాయి! ఇక కాళ్ళూ, చేతులు కోల్పోయి జీవచ్ఛవాల్లా మారినవారెందరో? ప్రజలను గమ్యస్థానాలకు చేర్చాల్సిన రైళ్లు శ్మశానాలను తలపిస్తున్నాయి. ఈ భయానక దృశ్యాలు మనసును విచలితం చేస్తున్నాయి. రైలు ప్రయాణమంటేనే వెన్నులో వణుకు పుట్టేలా చేస్తున్నాయి. మోడీ పాలనలో రైల్వే శాఖ భద్రత విషయంలో పూర్తిగా వైఫల్యం చెందినదనేది వాస్తవం.

2016లో ఇండోర్-రాజేంద్రనగర్ ఎక్స్‌ప్రెస్... పుఖ్‌రాయన్ దగ్గర పట్టాలు తప్పింది. 14 బోగీలు చెల్లాచెదురయ్యాయి. ఈ ప్రమాదంలో 152 మంది చనిపోగా 250 మందికి పైగా గాయపడ్డారు. 2017లో విజయనగరంలోని కూనేరు వద్ద హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 41 మంది చనిపోగా, 69 మంది గాయపడ్డారు. గతేడాది ఒడిశా, బాలాసోర్‌లో కోరమండల్ ఎక్స్‌ప్రెస్, ఓ గూడ్స్ రైలుని ఢీకొట్టడంతో ఏకంగా 15 బోగీలు చెల్లాచెదురయ్యాయి. అదే సమయంలో హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అటుగా వస్తూ పక్కకు పడిన బోగీలను ఢీకొట్టింది. దాని కొన్ని బోగీలు కూడా పక్కకు పడ్డాయి. ఇలా మూడు రైళ్ల ప్రమాదంలో 290 మంది చనిపోగా, 1200 మంది గాయపడ్డారు. ఇలా ఎంతో మంది ప్రజల ప్రాణాలు ప్రమాదాల్లో ముగిసిపోయాయి.

రైలు ప్రమాదాల్లో వందల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా కేంద్రం మాత్రం చోద్యం చూస్తోంది. కంచన్‌జంగ ప్రమాదానికి కూడా సిగ్నల్ వ్యవస్థ సరిగా పని చేయకపోవడం, అత్యాధునిక కవచ్ రక్షణ వ్యవస్థ ఆ మార్గంలో లేకపోవడమే ప్రధాన కారణాలని తెలుస్తోంది. ఒకపక్క రైళ్లలో అత్యంత ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామంటూ మోడీ వందేభారత్ రైళ్లను ఆర్భాటంగా ప్రారంభించారు. వీటిని తన మానస పుత్రికలుగా కూడా చెప్పుకున్నారు. మరోపక్క రైలు మార్గాల్లో భద్రత ఏర్పాట్లలో మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారు. త్వరలో దేశానికి బుల్లెట్ రైళ్లను కూడా ప్రవేశపెడతామని గొప్పగా చెప్పారు. భద్రత కరువైన మన రైల్వే ట్రాక్‌లపై బుల్లెట్ రైళ్లను ఎలా నడుపుతారో ఆయనకే తెలియాలి?

ఇలా వరుసగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆడిటర్ అయిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రైలు భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాక్‌ల పునరుద్ధరణకు నిధులు కేటాయింపు తగ్గిందనీ, కేటాయించిన నిధులను కూడా పూర్తిగా వినియోగించడం లేదని తేల్చి చెప్పింది. కాగ్ విశ్లేషణ ప్రకారం 2017-2021 మధ్య దేశంలో మొత్తం 2017 ప్రమాదాలు జరిగాయి. అందులో పట్టాలు తప్పినవి 1392. అంటే పట్టాలు తప్పి ఢీ కొనటం వంటి రైల్వే ప్రమాదాలే అధికం. అయితే ఈ ప్రమాదాలకు కారణం మానవ తప్పిదమని తప్పించుకోవడం సర్వ సాధారణంగా మారిపోయింది. రైల్వే శాఖ పట్ల కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని 2022లో కాగ్ తన నివేదికలో నొక్కి వక్కాణించింది.

రైలు ప్రమాదాల్లో వందల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా కేంద్రం మాత్రం చోద్యం చూస్తోంది. కంచన్‌జంగ ప్రమాదానికి కూడా సిగ్నల్ వ్యవస్థ సరిగా పని చేయకపోవడం, అత్యాధునిక కవచ్ రక్షణ వ్యవస్థ ఆ మార్గంలో లేకపోవడమే ప్రధాన కారణాలని తెలుస్తోంది. ఒకపక్క రైళ్లలో అత్యంత ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామంటూ మోడీ వందేభారత్ రైళ్లను ఆర్భాటంగా ప్రారంభించారు. వీటిని తన మానస పుత్రికలుగా కూడా చెప్పుకున్నారు. మరోపక్క రైలు మార్గాల్లో భద్రత ఏర్పాట్లలో మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారు. త్వరలో దేశానికి బుల్లెట్ రైళ్లను కూడా ప్రవేశపెడతామని గొప్పగా చెప్పారు. భద్రత కరువైన మన రైల్వే ట్రాక్‌లపై బుల్లెట్ రైళ్లను ఎలా నడుపుతారో ఆయనకే తెలియాలి?

ప్రమాదాలు జరిగిన ప్రతీసారీ 'మరో సారి ఇలాంటివి జరగకుండా చూస్తాం, ప్రజల రక్షణే మా ప్రథమ కర్తవ్యం' అంటూ సర్వసాధారణంగా చెప్పేస్తున్నారు. కానీ జరుగుతున్న ప్రమాదాల నుండి గుణపాఠం మాత్రం నేర్వడం లేదు. రైల్వేలో కనీస అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ప్రస్తుతం రైల్వే శాఖలో మూడు లక్షల 60వేల పోస్టులు ఖాళీగా పడున్నాయి. ఉన్న ఉద్యోగులపై పని భారం పెరిగిపోయింది. నైట్ షిఫ్టులతో విశ్రాంతి లేకుండా పని చేస్తున్నారు. రైల్వేలో పని చేస్తున్న సుమారు 8 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, చట్టబద్ధ హక్కులు కోల్పోయారు. ప్రశ్నిస్తే సస్పెన్షన్లు, బదిలీలు, శిక్షలు. ఇన్ని సమస్యల మధ్య మన రైల్వే సిబ్బంది పని చేస్తున్నారు. గతంలో రైల్వే అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించే వారు. ఇప్పుడు ఆ పద్ధతీ నిర్వీర్యమైపోయింది. వీటన్నింటి ఫలితంగా ప్రజల భద్రత మరింత ప్రమాదంలో పడింది.

ఒక ట్రాక్‌పైకి రెండు రైళ్లు వచ్చినప్పుడు ప్రమాదాలు నివారించేందుకు ఏర్పాటు చేసిన కవచ్ రక్షణ వ్యవస్థ ఈ మార్గంలో ఉండి ఉంటే ప్రమాదం తప్పేదని నిపుణులు అంటున్నారు. ఇలాంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ మన దగ్గర చాలా చోట్ల అందుబాటులో లేదు. పదే పదే డిజిటల్ ఇండియా, వికసిత్ భారత్ అంటూ గొప్పగా చెప్పుకునే మోడీ రైల్వేలో అత్యాధునిక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఇన్నేండ్లు నిర్లక్ష్యంగా ఎందుకున్నట్టో! ఏది ఏమైనా మోడీ హయాంలో కార్పొరేట్లకు తప్ప సామాన్యుల ప్రాణాలకు గ్యారెంటీ లేదనేది వాస్తవం. ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వని పాలకుడిని ప్రజలు ఎన్నటికీ క్షమించరన్నది పచ్చి నిజం. ఇప్పటికైనా కేంద్రం తన నిర్లక్ష్య వైఖరిని విడనాడి రైల్వే భద్రతా వ్యవస్థకై పటిష్ట చర్యలు చేపట్టాలి. ప్రజల ప్రాణాలను కాపాడాలి.

చైనా-రష్యాలను దగ్గర చేసిన జి7 కూటమి!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఇటలీలోని అపూలియాలో 2024 జూన్ 13-15 తేదీలలో జరిగిన జి7 50వ శిఖరాగ్ర వార్షిక సమావేశ తీరుతెన్నులు, పరిణా మాలు, పర్యవసానాల గురించి చర్చ జరుగుతున్నది. ఈ సమావేశాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా భారత ప్రధాని నరేంద్రమోడీతో సహా పన్నెండు దేశాధినేతలను,ఆఫ్రికా యూనియన్ ప్రతినిధిని ఆహ్వానించారు. ఇలాంటి వేదికలన్నింటా పూసల్లో దారంలా ప్రపంచ దేశాల బలాబలాల సమీకరణ లక్ష్యం ఉంటుంది. ధనికదేశాలు తమకు సవాలు విసురుతున్న చైనా, రష్యాలను దెబ్బతీసేందుకు గాను వర్ధమాన,పేద దేశాలను తమ వైపు తిప్పుకొనేందుకు అపూలియాలో గట్టి ప్రయత్నమే చేసినా ఫలితం ఏమిటన్నది ప్రశ్నార్ధకమే. అనేక అంశాల మీద ఈ కూటమి ఒక ప్రకటన చేసినప్పటికీ దానిలో ప్రధానమైన వాటిని చూద్దాం. ఆతిథ్యం ఇచ్చిన దేశం తనకు నచ్చిన, తాను మెచ్చిన వారిని ప్రత్యేకంగా ఆహ్వానిస్తుంది. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆహ్వానం మేరకు అల్జీరియా, అర్జెంటీనా,బ్రెజిల్,భారత్,జోర్డాన్, కెన్యా, మారిటేనియా, ఆఫ్రికన్ యూనియన్,ట్యునీసియా, టర్కీ, యునైటెడ్ అరబ్ఎమిరేట్స్, ఉక్రెయిన్, వాటికన్ నగరం నుంచి అధిపతులు వచ్చారు. ప్రపంచంలో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా, రష్యా దేశాలకు ఆహ్వానం లేనప్పటికీ మూడు రోజుల సమావేశాలు వాటి నామజపంతోనే ముగిశాయంటే అతిశయోక్తి కాదు. సమావేశ ప్రకటనలో 28 సందర్భాలలో చైనా పేరును ప్రతికూలంగా ప్రస్తావించారంటే దాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. దీని అర్థం ఘర్షణకు సన్నాహాలు మొదలు పెట్టినట్లుగా చైనా పత్రిక గ్లోబల్ టైమ్స్ పేర్కొన్నది.గతేడాది జపాన్-ఒసాకాలో జరిగిన కూటమి ప్రకటనలో 20సార్లు ప్రస్తావించారు.ప్రస్తుతం ధనికదేశాల కూటమికి చైనాను ఢీకొనే సత్తా ఉందా అన్నది ప్రశ్న. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు కారణం చైనా అని నెపం నెట్టేందుకు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు పశ్చిమ దేశాలు చూస్తున్నాయి.

అసలు జి 7 కూటమి, ఎందుకు ఎలా ఉనికిలోకి వచ్చిందో పరిశీలిస్తే గనుక అమెరికా,జపాన్, కెనడా, నెదర్లాండ్స్‌తో తలెత్తిన వివాదంలో ఆ దేశాలకు చమురు సరఫరాలపై నిషేధం విధిస్తూ ఒపెక్ దేశాలు చేసిన ప్రకటన 1973లో చమురు సంక్షోభానికి దారి తీసింది. ఆ పర్యవసానంతో పుట్టిందే జి7. చమురు, విత్త సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు 1975లో నాటి ఫ్రెంచి అధ్యక్షుడు వాలెరీ గిస్కార్డ్, జర్మన్ ఛాన్సలర్ హెల్మట్ స్మిత్ చొరవతో పారిస్‌లో తొలి సమావేశం జరిగింది. అమెరికా,బ్రిటన్,ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ నేతలు వచ్చారు.మరుసటి ఏడాది కెనడా, 1998లో రష్యా చేరింది. దాంతో అది జి8గా మారింది. 2014లో ఉక్రెయిన్ ఏలుబడిలో ఉన్న పూర్వపు తన క్రిమియా ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవటంతో ఆ బృందం నుంచి రష్యాను తొలగించటంతో తిరిగి జి7గా మారింది. 1981 నుంచి ఐరోపా సమాఖ్య(ఇయు)ను శాశ్వత ఆహ్వానిత సంస్థగా మార్చారు. శిఖరాగ్ర సమావేశాలకు ఎవరు ఆతిథ్యం ఇస్తే తదుపరి సమావేశం వరకు ఏడాది పాటు దేశాధినేత అధ్యక్ష స్థానంలో ఉంటారు.ఈ బృందానికి ఒక కేంద్ర స్థానం లేదా శాశ్వత సిబ్బంది లేరు. సమావేశాల్లో ఐరాసతో సహా వివిధ ప్రపంచ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. అపూలియా సభలో ఉక్రెయిన్, వాతావరణ సంక్షోభాలు, సైబర్ భద్రతకు ముప్పు, తైవాన్, దక్షిణ చైనా సముద్రం, మానవహక్కుల హరింపు, అవసరాలకు మించి అదనంగా ఉత్పత్తి చేస్తూ విద్యుత్ వాహనాలను ప్రపంచం మీద కుమ్మరిస్తున్నదంటూ చైనా మీద దుమ్మెత్తి పోశారు. రష్యాకు ఆయుధాలను సరఫరా చేయకపోయినా, వాటి ఉత్పత్తికి అవసరమైన వాటిని అందిస్తున్నదంటూ విధించిన ఆంక్షలకు ఆమోదం తెలిపింది. ప్రతికూల చర్యలు తీసుకుంటామంటూ బెదిరింపులకు దిగింది.

ఈ సమావేశాలకు హాజరైన నేతలందరి పరిస్థితి ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత అన్నట్లుగా ఉంది. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమస్యతో సతమతమవుతున్నారు. అయినా లేస్తే మనుషులం కాదన్నట్లుగా ఫోజు పెట్టారు. చైనాను దెబ్బతీసేందుకు మిత్ర'దేశాలను అమెరికా ఎలా కూడగడుతున్నదో తనను తాను రక్షించుకొనేందుకు బీజింగ్ కూడా అదే చేయనుందని వేరే చెప్పనవసరం లేదు. "ఆరుగురు అసమర్థులు మరియు జార్జియా మెలోనీ 2024 జి7 తరగతిలో కూడికా" అన్న శీర్షికతో పొలిటికో పత్రిక ఒక బలహీన సమావేశం అంటూ విశ్లేషణ రాసింది. ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో పచ్చిమితవాద పార్టీలు బలపడటంతో ఫ్రెంచి అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ ఏకంగా పార్లమెంటును రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లాడు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కూడా అంతకు ముందే అదేపని చేశాడు. జర్మనీ ఛాన్సలర్ షఉల్జ్ కూడా చావు దెబ్బతిన్నాడు, ఎప్పుడైనా అదేపని చేయవచ్చు. తొమ్మిదేండ్లుగా తేలింది. గత రెండు సమావేశాల్లో చైనా పాత్ర గురించి దాదాపు లేవనెత్తలేదని, ఉక్రెయిన్‌పై వ్లదిమిర్ పుతిన్ అణ్వాయుధాన్ని పేల్చుతారన్న భయాలు తలెత్తినపుడు షీ జిన్‌పింగ్ అంతదాకా పోనివ్వని నియంత్రణశక్తిగా భావించారని, ఈసారి దానికి భిన్నంగా సమావేశ ప్రకటన ప్రారంభమైందని న్యూయార్క్ టైమ్స్ వ్యాఖ్యానించింది.రష్యా యుద్ధ యంత్రాంగానికి వస్తు సరఫరా చేస్తున్న చైనా, మూడవ పక్షదేశాల సంస్థలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవటం కొనసాగిస్తామని ప్రకటనలో పేర్కొన్నట్లు ఉటంకించింది. గత సమావేశాల్లో వాతావరణ ప్రతికూల మార్పులను అడ్డుకొనేందుకు,ఉగ్రవాదం, అణ్వాయుధ నిరోధం కోసం చైనాతో చేతులు కలుపుతామంటూ మాట్లాడిన ధనికదేశాలు ఇప్పుడు శత్రువుగా చూస్తున్నాయంటే ఆ సమస్యల పట్ల వాటి చిత్తశుద్ధి ఏమిటో స్వయంగా వెల్లడించుకున్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ షీ జిన్‌పింగ్ చైనా ఆధిపత్య లక్ష్యంతో పనిచేస్తున్నట్లు అపూలియా అంతరంగిక సమావేశంలో అభిప్రాయపడినట్లు అమెరికా అధికారి ఒకరు విలేకర్లతో చెప్పాడు. ఉక్రెయిన్ వివాదంలో చైనా పాత్ర గురించి షీ జింపింగ్ వైఖరిలో గతేడాది కాలంలో మార్పు వచ్చినట్లు అమెరికా ప్రచారం చేస్తున్నది.రష్యాతో అవధులు లేని భాగస్వామ్యంగా ప్రకటించినప్పటి



అవసరానికి మించి చైనా ఉత్పత్తులు చేస్తున్నదనే పశ్చిమదేశాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఇటలీ సభలో కూడా ఇది ఒక ప్రధాన అజెండాగా ఉంది. పెట్టుబడిదారీ విధాన సూత్రం ప్రకారం అవసరానికి మించి ఉత్పత్తి చేస్తే కొనేవారు లేక సంక్షోభానికి దారితీస్తుంది. ఈ కనీస ఇంగితం చైనా నాయకత్వానికి లేదని భావిస్తున్నారా? చైనా ఉత్పత్తులు, సరఫరా గొలుసు మీద ఆధారపడ కూడదని, విడగొట్టుకోవాలని చెబుతున్నవారిని ఎవరూ బలవంతంగా ఆపలేదే. వస్తు తయారీకి ధనిక దేశాల వద్ద పెట్టుబడులు లేవా, సాంకేతిక పరిజ్ఞానం లేదా, పని చేసే కార్మికులు లేరా? చైనా నిబంధనలను ఉల్లంఘిస్తున్నది అనుకుంటే ప్రపంచ వాణిజ్య సంస్థలో ఫిర్యాదు చేయవచ్చు. అమెరికా, ఐరోపా యూనియన్ కూడా చైనా ఉత్పత్తుల మీద దిగుమతి పన్నులను పెంచి రక్షణాత్మక చర్యలు తీసుకొని కూడా గగ్గోలు పెడుతున్నాయి. తమ బలహీనతలను కప్పిపుచ్చుకొనేందుకు తమమీద నిందలు వేస్తున్నట్లు చైనా విమర్శిస్తున్నది.

అధికారంలో ఉన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ "వెర్రి(క్రేజీ)" పదవి నుంచి తప్పుకోనున్నట్లు బహిరంగంగానే ప్రకటించాడు.జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా పలుకుబడి అధ్వాన్నంగా ఉంది. అమెరికా ఎన్నికల్లో జో బైడెన్ తిరిగి అధికారానికి రావటం అనుమానంగానే ఉంది. ఇలాంటి వాటన్నింటినీ మూసిపెట్టేం దుకు రష్యాతో పాటు చైనాను కూడా బూచిగా చూపేందుకు కసరత్తు చేశారు.

ఉక్రెయిన్-రష్యా వివాదం ప్రధాన అంశంగా ముందుకు వచ్చింది. అయితే దాన్ని పరిష్కరించటానికి బదులు మరింత ఎగదోసేదిగా కనిపించింది. ఈ సమావేశం ఫలితాలు, పర్యవసానాల విషయానికి వస్తే ఇప్పటికే దగ్గరైన చైనా-రష్యాలను మరింత దగ్గరగా చేసేందుకు దోహదం చేసిందని చెప్పవచ్చు.ఉక్రెయిన్ యుద్ధంలో చైనా ఆయుధాలను రష్యాకు సరఫరా చేయటం లేదు, కానీ వాటిని ఉత్పత్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యాన్ని సమకూరుస్తున్నది, కాబట్టి నిజానికి అది రష్యాకు సాయం చేయటమే అని జో బైడెన్ విలేకర్ల సమావేశంలో చెప్పాడు. రష్యా యుద్ధ యంత్రాంగ రక్షకురాలిగా చిత్రించటం తప్ప వేరు కాదు.గత కొద్ది సంవత్సరాలుగా చైనా మీద సాగిస్తున్న విమర్శ మరింత పదును నుంచి అది ప్రారంభమైందని ఆరోపిస్తోంది. స్విడ్జర్లాండ్‌లో పశ్చిమదేశాలు నిర్వహించిన ఉక్రెయిన్ శాంతి సదస్సులో పాల్గొనవద్దని దేశాలను నిరుత్సాహపరచిందని కూడా ఆరోపించింది. చిత్రమేమిటంటే ఈ సమావేశంలో భాగస్వామిగా ఉన్న మనదేశం సమావేశ ప్రకటనను ఆమోదించటానికి తిరస్కరించింది. దీని వెనుక కూడా చైనా హస్తం ఉందని చెప్పగలరా ?

అవసరానికి మించి చైనా ఉత్పత్తులు చేస్తున్నదనే పశ్చిమదేశాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఇటలీ సభలో కూడా ఇది ఒక ప్రధాన అజెండాగా ఉంది. పెట్టుబడిదారీ విధాన సూత్రం ప్రకారం అవసరానికి మించి ఉత్పత్తి చేస్తే కొనేవారు లేక సంక్షోభానికి దారితీస్తుంది. ఈ కనీస ఇంగితం చైనా నాయకత్వానికి లేదని భావిస్తున్నారా? చైనా ఉత్పత్తులు, సరఫరా గొలుసు మీద ఆధారపడకూడదని, విడగొట్టుకోవాలని చెబుతున్నవారిని ఎవరూ బలవంతంగా ఆపలేదే. వస్తు తయారీకి ధనిక దేశాల వద్ద పెట్టుబడులు లేవా, సాంకేతిక పరిజ్ఞానం లేదా, పని చేసే కార్మికులు లేరా? చైనా నిబంధనలను ఉల్లంఘిస్తున్నది అనుకుంటే ప్రపంచ వాణిజ్య సంస్థలో ఫిర్యాదు చేయవచ్చు. అమెరికా, ఐరోపా యూనియన్ కూడా చైనా ఉత్పత్తుల మీద దిగుమతి పన్నులను పెంచి రక్షణాత్మక చర్యలు తీసుకొని కూడా గగ్గోలు పెడుతున్నాయి. తమ బలహీనతలను కప్పిపుచ్చుకొనేందుకు తమమీద నిందలు వేస్తున్నట్లు చైనా విమర్శిస్తున్నది.

చైనా మీద వ్యతిరేకతను పెంచేందుకు చేయని తప్పుడు ప్రచారం లేదు. అవసరమైనపుడు అమెరికా, ఐరోపా దేశాలలోని అన్నిరకాల వ్యవస్థలను పనిచేయకుండా చేసేందుకు వాటిలో కంప్యూటర్ వైరస్‌లను పెట్టి సిద్ధంగా ఉంచిందని అమెరికా ఆరోపించింది. దీనికి "ఓల్ట్ టైఫూన్" అనే పేరు పెట్టారు. దీని ప్రకారం విద్యుత్, నీరు,రేవుల వంటి వ్యవస్థలను అమెరికా, దాని మిత్రదేశాలలో పనిచేయకుండా చేసేందుకు చైనా ఒక ప్రోగ్రామ్‌ను రూపొందించి సదరు వ్యవస్థలలో ప్రవేశపెట్టినట్లు ప్రచారం చేస్తున్నారు. ఐటి, అన్ని రకాల సాంకేతిక రంగాలలో తమకు మించిన వారు లేరని విర్రవీగుతున్న పశ్చిమదేశాలు తమ వ్యవస్థలకు రక్షణ ఏర్పాట్లు చేసుకోలేనంత అసమర్ధంగా ఉన్నాయా? అంటే ఎవరూ నమ్మరు, చైనాను బూచిగా చూపి జనంలో దిగజారుతున్న తమ పలుకుబడిని నిలుపుకొనేందుకు, ఆర్థిక వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు ఒక మైండ్ గేమ్ తప్ప మరొకటి కాదు. ఒకవేళ బలవంతంగా తైవాన్ విలీనానికి చైనా పూనుకుంటే అక్కడి చిప్స్ తయారీ కేంద్రాలను పేల్చివేస్తామని అమెరికా బెదిరించిన సంగతి తెలిసిందే. అందువలన ఒక వేళ నిజంగా చైనా అలాంటి వైరస్‌ను చొప్పించిందంటే దెబ్బకు దెబ్బ తీసే జాగ్రత్త అని అర్థం చేసుకోవాలి.

ఇక అపూలియా సమావేశాలకు ప్రధాని నరేంద్రమోడీ హాజరైపుడు ఫొటో తీసుకొనేందుకు హాజరైన నేతలందరూ చుట్టుముట్టారని, నేతల మధ్యలో మోడీ ఉండటమే దానికి నిదర్శనం అన్నట్లు సమావేశ గ్రూపు ఫొటోను చూపి కొంత మంది చౌకబారు ప్రచారం చేస్తున్నారు. ఐదుసార్లు ఈ సమావేశాలకు మోడీ వెళ్లారన్నది మరొకటి. యుపిఏ పదేండ్ల కాలంలో మన్మోహన్‌సింగ్ కూడా ఐదుసార్లు హాజరయ్యారు. (2006 సెంట్‌పీటర్స్‌బర్గ్ సమావేశానికి మనదేశం నుంచి తీసుకువెళ్లిన జర్నలిస్టుల బృందంలో ఈ రచయిత కూడా ఒకరు) భారత్ ఈ కూటమి సభ్యదేశంగా చేరనుందనే భావం కల్పిస్తూ కొందరు విశ్లేషణలు చేస్తున్నారు.


ఇక అపూలియా సమావేశాలకు ప్రధాని నరేంద్రమోడీ హాజరైపుడు ఫొటో తీసుకొనేందుకు హాజరైన నేతలందరూ చుట్టుముట్టారని, నేతల మధ్యలో మోడీ ఉండటమే దానికి నిదర్శనం అన్నట్లు సమావేశ గ్రూపు ఫొటోను చూపి కొంత మంది చౌకబారు ప్రచారం చేస్తున్నారు. ఐదుసార్లు ఈ సమావేశాలకు మోడీ వెళ్లారన్నది మరొకటి. యుపిఏ పదేండ్ల కాలంలో మన్మోహన్‌సింగ్ కూడా ఐదుసార్లు హాజరయ్యారు.(2006 సెంట్‌పీటర్స్‌బర్గ్ సమావేశానికి మనదేశం నుంచి తీసుకువెళ్లిన జర్నలిస్టుల బృందంలో ఈ రచయిత కూడా ఒకరు) భారత్ ఈ కూటమి సభ్యదేశంగా చేరనుందనే భావం కల్పిస్తూ కొందరు విశ్లేషణలు చేస్తున్నారు. ఏ ఒక్కదేశమూ ఈ గ్రూపును విస్తరించే ప్రతిపాదనలు ముందుకు తేలేదు. ఒకవేళ విస్తరించినా మనదేశాన్ని చేర్చుకుంటారన్నది సందేహమే. ఆ గ్రూపులోని ఐదు దేశాల జిడిపి కంటే మనది ఎక్కువగా ఉన్నది తప్ప ధనికదేశ వర్గీకరణకు ఎంతో దూరంలో ఉంది. యాభై ఏండ్లుగా ఉన్న ఆ బృందం ప్రపంచ పరిణామాలను నియంత్రించటంలో నానాటికీ బలహీనపడుతున్న తరుణంలో మనదేశం చేరినంత మాత్రాన మన జనానికి ఒరిగేదేమిటి ? ఒకవేళ నిజంగా చేరితే చైనా, రష్యాలతో ఒక శత్రుకూటమిగా మనదేశం కూడా లడాయికి దిగటమే. అటువంటి దుస్సాహసానికి నరేంద్రమోడీ పాల్పడతారా?

చెట్టూ పుట్ట గుట్ట
చదును చేసి దుక్కిదున్నిన
దేహాలది.

మట్టిని చాళ్ళు గొట్టి
చెమటను విత్తిన చేతులది
గుంజలు నరికి
భుజాలు కాయలు గట్టేలా మోసి
మంచె వేసి
వడిసెల తిప్పుతూ అడవి
జంతువులను
గురిచూసి కొట్టిన బొబ్బలు తేలిన
హస్తాలది.

పొద్దున్నే గడ్డిపరకలపై
తేలిన పొగమంచును తొక్కుతూ
నడిచిన చెప్పులెరగని పాదాలది.

ఇంతకూ పాట ఎవరిది?



రాత్రి చంద్రుడిని
జాము చుక్కల్ని
కొండగాలి పరవశాన్ని
తెల్లవార్లూ కంతాల నిండా
కైగట్టిన గొంతులది
నిద్రలెరుగని
చింతనిప్పురంగు కళ్ళది.

నారుపోసి
మడిచెక్కలు దమ్ముజేసి
నెలవంకలా నడుము వంచి
బురద మన్నులో
సుతారంగా వేళ్ళు జొనిపి
పచ్చాపచ్చని రంగులద్దిన
నల్లకలువలది.


చేతులను కొడవళ్ళలా వంచి
పంటలు కోసి
పనలు కట్టి
కుప్పనూర్చి పొలికట్టిన
ప్రకృతి చెలికానిది
నల్లకొడిసె వన్నెగానిది.
ఆరు రుతువుల సోపతిగానిది

వీళ్ళను
ఏ ఫిలింఫేరు గుర్తించదు
ఆస్కారూ పిలిచి
పురస్కారమివ్వదు.
జానపదులు పాడుకునే జీవితాలే
పే..ద్ద గ్రామీ అవార్డులు

- మణీందర్ గరికపాటి

రేపటి కామ్రేడ్స్!

— రంగనాయకమ్మ



పెద్ద డిగ్రీల చదువులు చదివిన ఇద్దరు స్నేహితుల మధ్య సాగే సంభాషణ ఇది!

"ఏంటి గోపాల్, కొత్త చొక్కా లాగ వుందే! ఎప్పుడూ లేదు ఇది నీ ఒంటి మీద! కొన్నావా? ఎంతా? కాస్త చవకేనా? ఎప్పుడూ?"

"ఏడిసినట్టే అడిగావులే! చదివిందంతా ఏ బొందలో పడేస్తావు?"

"ఏంటి గోపాల్, మరీనూ? ఏమన్నానిప్పుడు? నీ షర్టు కొత్తది లాగ వుంది, చవకేనా కాస్త - అన్నా, అంతేగా? పుస్తకాలు చదివితే మాత్రం, నీకు చొక్కా నిన్న చవగ్గా దొరికిందో లేదో తెలుస్తుందా?"

గోపాల్ నవ్వాడు.

" తెలవదా? డజన్ సార్లు చెపితే, 'క్షమించు! క్షమించు!' అంటూ పరిగెత్తుతూ లైబ్రెరీకి పోతే, అక్కడ దొరకలేదని, తిన్నగా పుస్తకాల షాపుకి పోయి, 'కాపిటల్' కొనేసి, బస్సులోనే చదవడం ప్రారంభించానన్నావు! మరి, ఎంత నేర్చుకున్నావు? 'సరుకుకి ధర, చవగ్గా వున్నా ప్రియంగా వున్నా, దాని విలువ అదేలే' అని అర్థం కాలేదా?"

"అయ్యబాబోయ్! ఆ పుస్తకం ఎన్ని పేజీలదో! నాలుగో ఐదో వందలు దాటి పోయి వుంటుంది! నేను మొదలు పెట్టింది ఎప్పుడు? వారం దాటలేదు! అవన్నీ ఎక్కడ కనపడ్డాయి? నిజం చెప్పు! అలాంటివి కూడా వున్నాయా ఆ పుస్తకంలో? ఉంటే నేనింకా చదవలేదుగా? అయినా, మొదట్లోనే ఒక మాట దొరికింది అందులో! 'డబ్బు'ని, 'జనరల్ ఈక్వివలెంట్' అన్నాడు, ఆ మార్క్సు. మొదట్లో అర్థం కాలేదు గానీ, నిజంగా, అంతేగా మరి? సొసైటీలో, ఏ వస్తువుని అమ్మాలన్నా, కొనాలన్నా, అది 'డబ్బు'తో మారవలిసిందేగా? ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకునే పద్ధతి ఎప్పుడో పోయిందట! మా అమ్మమ్మ తెగ ఆశ్చర్యపోతుంది ఇప్పటికీ! తన చిన్నప్పుడు, కరివేపాకు ఇస్తే, వంకాయలు ఇచ్చే వారంట! కాసిన్ని పాలు పోస్తే, బుట్టెడు గోంగూర ఇచ్చే వారంట! సోలెడు బియ్యం ఇస్తే, బుట్టెడు ముంజెలు అప్పజెప్పేసేవారంట! ఇప్పుడా..."

"ఇప్పుడా!?" - అని ఆశ్చర్యపోతుందా మీ అమ్మమ్మ? అయితే, అమ్మమ్మకి కూడా నువ్వు చదివే 'కాపిటల్'నే చదువుతూ వినిపించు! ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకుంటే, మారకం అయినట్టే, వస్తువుకీ, డబ్బుకీ జరిగే మారకం అయినా అలాంటిదేగా? అదీ మరుపై పోయిందా? డబ్బు వెనకాల వుండేది ఏమిటి, అది కూడా ఒక వస్తువే అని..."

"ఆఁ, ఆఁ, గుర్తొచ్చింది గోపాల్! గుర్తొస్తోంది! డబ్బు వెనకాల వుండే 'బంగారం' కూడా ఒక వస్తువే! అది, మనుషులు చేసే వస్తువేగా? అవును, వంకాయలిచ్చి బీరకాయలు తీసుకుంటే, వాటిని పండించే వాళ్ళ శ్రమలు సమానంగా వున్నట్టు, వస్తువుకీ - డబ్బుకీ మారకాలు జరిగితే కూడా అంతే కదా? వంకాయలిస్తే బీరకాయలు రాకపోవచ్చు, దోసకాయలూ రాకపోవచ్చు. 'డబ్బు'తో అయితే, ఆ సమస్య ఉండదులే. వంకాయల రైతు, అవి అమ్మేసి డబ్బుని తీసుకుంటే, దానితో బీరకాయలో, దోసకాయలో కొనెయ్యవచ్చు! డబ్బుతో దేన్నయినా కొనొచ్చు! డబ్బుతో జరిగేది కూడా మారకమే! మర్చిపోలేదు గానీ, ఎందుకో చప్పున గుర్తు రాలేదు! అది కాదు, మొన్న ఏదో నిన్ను బాగా అడగాలనుకున్నాను. ఒక్క మాట చెప్పెయ్యి! పరిశ్రమల వాళ్ళు, సరుకుల్ని తయారు చేయించి వాటికి ధరలు పెట్టేటప్పుడు, సాధనాల ఖర్చులూ, జీతాలూ, అన్నీ కలుపుతారు - అన్నావు గానీ, 'లాభం' అని ఇంకో మాట కూడా కలుపుతారన్నావు! అప్పుడే నాకు నచ్చలేదనుకో! అయినా, గోపాల్ బాగా చదువుతాడులే, మళ్ళీ అడిగితే తెలుస్తుందిలే - అనుకున్నాను నిజంగా. ఇప్పుడు నువ్వు కాస్సేపు కూర్చుంటావా? పోనీ నేను సాయంత్రం రానా?"

"అబ్బా! ఎంత సేపు మాట్లాడావు? అసలేంటి నీకు నచ్చనిది? ఏదీ, మళ్ళీ చెప్పు!" అంటూ గోపాల్ స్నేహితుణ్ణి ఇష్టంగా చూస్తూ అన్నాడు.

'చెప్పేశానుగా అంతా! అదే మళ్ళీ చెపుతా, వినూ! అది కాదు, పరిశ్రమల వాళ్ళు, అదే, కంపెనీల వాళ్ళు - అన్నావులే, వాళ్ళు, తయారు చేయించే సరుకులికి 'ధరల్ని' పెట్టేటప్పుడు, మొదట ఉత్పత్తి సాధనాల్ని కొన్న ఖర్చునీ, వాటిని వాడేస్తూ కొత్త శ్రమలు చేసే వాళ్ళకిచ్చే జీతాల ఖర్చునీ, ఈ రెండు ఖర్చులతో పాటు, ఇంకొక్క పైసా అయినా ఖర్చు అవని దాన్ని, 'లాభం' అనే పేరుతో కూడా రావాలని' దాన్ని కూడా ధరలో కలిపేస్తారన్నావు. అదే మరి కొంచెం చెప్పు!"

"అర్థం కావటం లేదా? అన్నీ కలిపే ధర అయినట్టు! ఇక, తర్వాత సరుకు అమ్మకం!"

"అమ్మో! అలాంటి ధర తోనే అమ్మకం అవుతుందా? అంత ధరతో ఎవరు కొంటారోయ్? కొనే వాళ్ళేమన్నా పిచ్చి వాళ్ళా?"

"కొనే వాళ్ళు పిచ్చి వాళ్ళు కారు గానీ, అమ్మే వాళ్ళు మాత్రం చాలా గడుసు వాళ్ళులే! నువ్వు ఇంకా, ఆ పుస్తకాన్ని చేతుల్తో ముట్టుకున్న తర్వాత కూడా లాభం మాటతో నువ్వింకా వెర్రి మొహం తోనే వున్నావులే రవీ!"

"నాకేం వెర్రి మొహం లేదోయ్! నన్ను లెక్చెరర్లందరూ మెచ్చుకుంటారు. నిన్ను మెచ్చుకున్నారా చెప్పు ఎప్పుడన్నా? నేనేదో వందల వందల పేజీల పుస్తకాన్ని, కొన్న వారం రోజుల్లో పూర్తి చెయ్యలేదని, నన్ను తిడతావు? న్యాయమేనా నీకు?"

"నిన్ను తిట్టానా? అది తిట్టా! విమర్శించాను! అది అవసరం! సరే, చెప్పు! ఏంటీ నీ ప్రశ్న? అదా? 'లాభం'తో కూడా ధరతో వున్న సరుకుని ఎవరన్నా కొంటారా - అన్నావు. నిన్న నేను కొనలేదా? కొన్నాను కదా, లాభం గురించి చదివిన వాణ్ణే! ఈ చొక్కాని 400 ధరతో కొన్నా! ఇందులో లాభం ఎంత వుంటుందో ఊహిస్తే, కనీసం 100 రూపాయలైనా ఉంటుంది. దాని కోసం ఒక్క పైసా అయినా ఖర్చవకుండా! ఇదంతా తెలిసే! కొనక ఏం చేస్తావు? తెలిసినా కొనాలి, తెలియక పోయినా కొనాలి! 'లాభం' అంటే, పెద్ద దొంగతనం అవడం కన్నా ఇంకేం వుంటుంది?"

"ధరలో లాభం, అంత ఉంటుందో, ఎంత ఉంటుందో, ఎలా చెప్పగలం? మనం ఊహిస్తే సరిపోతుందా? ఎక్కౌంటు చూశావా? అది అక్కర లేదా?"

"ఎక్కౌంట్లు ఎందుకు? అందులో ఏమన్నా రాసి వుంటుందా చదవడానికి?"

"రాసి వుండాలా? అదేం మాట? సాధనాల ఖర్చూ, జీతాల ఖర్చూ, ఆ రెండూ వుంటే చాలు! 'ధర'లో నించి ఆ రెండూ తీసేస్తే, మిగతాది లాభమే అవదా? అలా తెలియదా?"

"అబ్బా! మంచి ఎక్కౌంట్లు వాడివే! మార్కులు లొస్తున్నాయా?"

"ఆఁ, ఫస్టు మార్కుల వాళ్ళల్లో ఒకణ్ణి నేను కూడా! నువ్వు నమ్మవు నన్ను!"

"నిన్ను మార్కుల్లో ఫస్టు క్లాసు వాడిగా నువ్వు చెప్పకుండానే నమ్ముతాను. కానీ, స్టూడెంట్స్‌గా మనం నేర్చుకోవలిసింది, మార్కులే, టీచర్ల పొగడ్తలే కాదు రవీ!"

"ఆఁ, ఇంకా చెప్పకు! తెలుసులే. స్టూడెంట్‌గా ఆ పుస్తకాన్ని కంఠతా పట్టమంటావు! సరే, పడతానులే బాబూ!"

"స్టూడెంట్లే కాదు, శ్రామిక వర్గం వాళ్ళందరూ ఆ పుస్తకాన్ని కంఠతా పట్టాలి!"

"కంఠతా పట్టాక ఏం చేస్తాం?"

"అది అడగక్కర లేదు, ఏం చెయ్యాలో ఎవరో ఒకరు చెప్పక్కర లేదు, చదివితే నీకే తెలుస్తుంది!"

"ఓరి నాయనో! చదివేస్తే చాలదా? తర్వాత చేసే పని కూడా వుందా! ఇదేం పుస్తకం రా బాబూ? అందులో ఏమన్నా భూతం వుందంటావా?"

"తప్పకుండా వుంది! 'లాభం' అనే భూతం! దాన్ని హతమార్చడమే జరగాలి!"

"అమ్మో! అదో పనా? ఎవరు చేస్తారు?"

"ఇంకెవరు? మనం కూడా! నువ్వు కూడా! నేను కూడా!"

"ఇదేమిటి? మనం ఉద్యోగాల్లో వుంటాం కదా?"

"ఇప్పుడు ఉద్యోగా లెవడిస్తున్నాడు? ఉద్యోగం దొరికి జీతం కూడా దొరికితే, 'అమ్మయ్య' అని సంతోషిస్తాం. కానీ, మనం చేసేది 'జీతం' కోసమే కాదు, 'లాభం' కోసం కూడా చెయ్యాలి. పని దినం పది గంటలైతే, జీతం కోసం 5, 6 గంటలూ, మిగతా పని లాభం కోసమే! అలా తెలిసినా, అలాగే చెయ్యాలి!"

"అలా ఉంటుందా? అయితే చెయ్యం!"

"అయితే, ఆ గంటలోనే పోతావు! ఇక, ఉద్యోగం వేపు రానే రాలేవు! నిరుద్యోగమే! ఉద్యోగం కన్నా పెద్ద ఉద్యోగం అన్నారు నిరుద్యోగాన్ని ఆ మధ్య ఎవరో గానీ!"

"ఇదేమిటి! నువ్వేదో సరదాగా మాట్లాడుతావు అనుకుంటే, ఇదేమిటి? ఒక్కటి చెప్పు! పరిశ్రమ, సరుకుల ధరల్లోకి లాభాన్ని చేర్చకుండా, ధరని నిర్ణయించరా అసలు? ధర ఎప్పుడూ అలా వుండదా అసలు?"

"ధర అలా వుంటే, ఒకే ఒక్క ధర అయినా అలా వుంటే, అది, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమేనా! అలా ఉంటుందా ధర? అలా ఉండదు! అసలు, 'పెట్టుబడి' అనే మాట గురించి ఎంత గొప్పగా అంటారో తెలుసుగా? డబ్బు ఖర్చు గురించి కాదు, 'పెట్టుబడి' అనే దాని గురించే ఆ గొప్ప! డబ్బు, అనేది, తనతో పాటు ఎక్కువ డబ్బుని తెచ్చే కార్యకలాపంలో వుంటే, అప్పుడే అది 'పెట్టుబడి'! దాని యజమాని పెట్టుబడిదారుడు! అతన్ని 'బూర్జువా' అని కూడా అంటారు! ఇంగ్లీషులో తెలుసుగా, కేపిటలిస్టు! గుప్పెడు పైసలు, చారెడు రూపాయిల్ని తీసుకు రావాలి! అదీ పెట్టుబడి కార్యం!"

"ఎలాగ తీసుకు రావటం? ఏదన్నా మహిమ వుంటుందా డబ్బుని పెంచేది?"

"లాభం, మహిమే కదా?"

(ఇంకా ఉంది)





ఖాసీందేవ్‌పేటలో 9 సెంటీమీటర్ల వాన

- రాష్ట్రంలో 150కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- వచ్చే మూడ్రోజులు వర్ష సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం రాత్రి ఉదయం 8:30 నుంచి రాత్రి 10 గంటల వరకు 150కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా, మండలంలోని ఖాసీందేవ్‌పేటలో అత్యధికంగా 9.08 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. వచ్చే మూడ్రోజులు రాష్ట్రంలో ఉరుములు, మెరుపులు మరియు ఈదురుగాలులు(గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగం)తో కూడి తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. బుధవారం నాడు నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో, గురువారం నాడు ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షం పడే సూచనలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో రాబోయే 48 గంటల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

బిజినెస్

జియో నెట్‌వర్క్ సేవల్లో అంతరాయం

- కస్టమర్ కేర్ స్పందన కరువు
- వాపోయిన వినియోగదారులు



ముంబయి : ముకేష్ అంబానీకి చెందిన రియలన్స్ జియో మొబైల్ నెట్‌వర్క్‌తో పాటు జియో ఫైబర్ సేవలకూ అంతరాయం ఏర్పాడింది. దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి సమస్య ఉత్పన్నం కావడంతో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. జియో ఫైబర్, మొబైల్ ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ సేవల్లో అంతరాయం చోటు చేసుకుంది. దీనికి గల స్పష్టమైన కారణాలను ఆ కంపెనీ వెల్లడించలేదు. సేవలపై వినియోగదారులు కస్టమర్ కేర్‌ను సంప్రదించిన సరిగా స్పందించడం లేదంటూ వాపోయారు. ఇతర నెట్‌వర్క్‌ల సహాయంతో సోషల్ మీడియా వేదికల్లో తమ ఆందోళనను వ్యక్తం చేశారు. జియో సర్వీసులు నిలిపోవడంతో మీమ్స్ వెల్లువెత్తాయి. దాదాపు 3వేల మందికిపైగా జియో సర్వీసులు పని చేయడం లేదని ఫిర్యాదు చేశారు. జియో నెట్‌వర్క్ డౌన్ కావడంతో మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో వాట్సాప్ పని చేయకుండా పోయింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఎక్స్, గూగుల్, యూట్యూబ్ సహా పలు సర్వీలను వినియోగించుకోలేకపోయామని వినియోగదారులు ఆందోళన పడ్డారు. మొబైల్ ఇంటర్నెట్‌లో సమస్యలు తలెత్తుతున్నాయని 54 శాతం ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. మరో 38శాతం జియో ఫైబర్, ఏడు శాతం మొబైల్ నెట్‌వర్క్‌లో సమస్య ఉత్పన్నమైనట్లు ఫిర్యాదు చేశారు.

ఎన్‌ఎండిసి కొత్త ఆర్అండ్‌డీ సెంటర్ ఏర్పాటు

- హైదరాబాద్‌లో రూ.50 కోట్లతో నిర్మాణం



హైదరాబాద్ : ప్రముఖ ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తిదారు ఎన్ఎండిసి లిమిటెడ్ హైదరాబాద్ పటాన్‌చేరులో కొత్త పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మంగళవారం దీనిని ఆ సంస్థ సిఎండి అమితవ ముఖర్జీ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ఆర్అండ్‌డి కోసం రూ.150 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు. కొత్త ఆర్అండ్‌డి సెంటర్ కోసం రూ.50 కోట్లు వ్యయం చేశామన్నారు. ఆర్అండ్‌డి ద్వారా భారతీయ మైనింగ్ పరిశ్రమను స్థిరమైన భవిష్యత్తు వైపు ఆవిష్కరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాము ఇక్కడ పరిశోధనలో మాత్రమే పెట్టుబడి పెట్టడం లేదని.. దేశ భవిష్యత్తు కోసం వ్యయం చేస్తున్నామన్నారు. కొత్త సెంటర్‌లో అత్యాధునిక ప్రయోగశాలలు ఉన్నాయి. ఇవి సుస్థిర ఖనిజ సాంకేతికత. ధాతువు శుద్ధీకరణలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయి. నిపుణుల బందంచే నిర్వహించబడుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

హయర్ ఫినిక్స్ శ్రేణీ రిఫ్రిజిరేటర్ల విస్తరణ

న్యూఢిల్లీ: ప్రముఖ గృహోపకరణాల ఉత్పత్తుల కంపెనీ హయర్ ఇండియా తన డైరెక్ట్ కూల్ ఫీనిక్స్ శ్రేణీ రిఫ్రిజిరేటర్లను విస్తరించినట్లు ప్రకటించింది. 185, 190 లీటర్ల సామర్థ్యంలో అందుబాటులో ఉన్నాయని హయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ తెలిపారు. ఇవి రూ. 21,000 ధరతో ప్రారంభమవుతాయన్నారు. రెండు మోడళ్లపై 10 సంవత్సరాల కంప్రెసర్ వారంటీని అందిస్తోంది.

టాటా కాపిటల్‌తో ఎంజి మోటార్ ఒప్పందం

న్యూఢిల్లీ : ఛానల్ ఫైనాన్స్ ఆప్షన్స్ మెరుగుపరచడానికి టాటా కాపిటల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా వెల్లడించింది. దీంతో తమ వాహన కొనుగోలుదారులకు సులభంగా రుణాలు, సరళమైన తిరిగి చెల్లింపుల అవధి, పోటీయుత వడ్డీతో అనుకూలంగా రూపొందించబడిన ఫైనాన్సింగ్ ఆప్షన్స్ లభించనున్నాయని ఆ సంస్థ పేర్కొంది. ఈ ఒప్పందంపై టాటా కాపిటల్ ఎస్ఎంఇ సిఒఒ నరేంద్ర కామత్, జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సుతీందర్ సింగ్ బజ్వా సంతకాలు చేశారు.

స్కోడా నుంచి సరికొత్త కుషాక్, స్లావియా

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ స్కోడా ఆటో ఇండియా సరికొత్తగా కుషాక్, స్లావియా వేరియంట్లను విడుదల చేసినట్లు ప్రకటించింది. భద్రతలో 5 స్టార్ రేటింగ్ కలిగిన నూతన వేరియంట్‌లు 1.0 టిఎస్ఐ పెట్రోల్ వర్షన్, 1.5 టిఎస్ఐ పెట్రోల్ వర్షన్లలో లభ్యమవుతుందని ఆ సంస్థ తెలిపింది. కుషాక్ లీటర్‌కు 19.76 కిలోమీటర్లు, స్లావియా 20.32 కిలోమీటర్ల మైలేజీని ఇస్తాయని తెలిపింది. వీటి ప్రారంభ ధరను రూ.10.69 లక్షలుగా నిర్ణయించింది.

ఉప్పల్ స్టేడియం కరెంట్ బిల్లు క్లియర్

అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి : హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)తో పదేండ్లుగా నడుస్తున్న విద్యుత్ వివాదానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవ్‌రాజ్ నేతృత్వంలో కార్యవర్గం శాశ్వత ముగింపు పలికింది. మంగళవారం (టీఎస్ఎస్‌పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీకి రూ.1 కోటీ 48 లక్షల 94 వేల 521 మొత్తాన్ని చెక్ రూపంలో హెచ్‌సీఏ బృందం అందజేసింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. 2015లో పురుడు పోసుకున్న ఈ విద్యుత్ జగడానికి తమ కార్యవర్గం శుభం కార్డు వేసిందన్నారు. సుమారు రూ.1 కోటీ 64 లక్షల విద్యుత్ బిల్లు బకాయి ఉండగా, ఐపీఎల్ సమయంలో తొలుత రూ.15 లక్షలు చెల్లించామని చెప్పారు. మిగిలిన మొత్తం 4-5 వాయిదాల్లో చెల్లిద్దామని ఆలోచన చేసినా హెచ్‌సీఏ పేరు ప్రతిష్టలను దృష్టిలో పెట్టుకుని ఒకేసారి అంతా చెల్లించేశామన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఐపీఎల్ సందర్భంగా విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉందనే కారణంతో క్రికెటర్లు ప్రాక్టీసు చేస్తుండగా కరెంట్ కట్ చేసి హైదరాబాద్, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎండీ ఫరూఖీని జగన్‌మోహన్‌రావు కోరారు. ఐపీఎల్ సమయంలో కొందరు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో క్రికెటర్లు ఇబ్బంది పడ్డారన్నారు. ఈ విషయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైందని చెప్పారు.

బదిలీలు, పదోన్నతులు యథాతథం

- బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ యథాతథంగా కొనసాగుతుందని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లు హైకోర్టులో పిటిషన్‌పై ఆరాతీయగా ఆయన పై విధంగా స్పందించారు. బదిలీలు, పదోన్నతులు ఆపాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేయలేదని స్పష్టం చేశారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పూర్తి చేస్తామని చెప్పారు. వాదనల మధ్యలో న్యాయమూర్తులు ఏమైనా వ్యాఖ్యలు చేసి ఉండొచ్చనీ, అవి ఈ ప్రక్రియ కొనసాగించేందుకు అడ్డంకి కాదని అన్నారు. మల్టీజోన్-1, మల్టీజోన్-2 పరిధిలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మల్టీజోన్-2లో ఇప్పటికే 776 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్ఎం పదోన్నతులను కల్పించారు. మల్టీజోన్-1లో సుమారు పది వేల మంది ఎస్జీటీలు, భాషా పండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులను కల్పించేందుకు ఉత్తర్వులు సిద్ధం చేశారు. సోమవారం రాత్రి కొందరు ఉపాధ్యాయులకు ఇచ్చి వెనక్కి తీసుకున్నారు. మంగళవారం రాత్రి ఆ ఉత్తర్వులు ఇచ్చే అవకాశమున్నది.

ఆర్ఎంపీ, పీఎంపీలపై వేధింపులు ఆపాలి

- శిక్షణనిచ్చి కమ్యూనిటీ పారామెడికల్‌గా ప్రభుత్వ గుర్తింపునివ్వాలి: ప్రభుత్వానికి ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్ఎంపీ, పీఎంపీలపై వేధింపులు ఆపాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక నాయకులు మాట్లాడారు. కొద్ది రోజులుగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అకారణంగా దాడులు చేస్తూ గ్రామీణ వైద్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జీవో నెంబర్ 1273 ద్వారా ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి కమ్యూనిటీ పారామెడికల్‌గా గుర్తింపు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. రెండు విడతలుగా దాదాపు 12 వేల మందికి శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ తమ సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి ప్రభుత్వ గుర్తింపు ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ దిశగా ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్యారోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని రమేష్, ఐక్య వేదిక నాయకులు చొప్పరి శంకర్ ముదిరాజ్, బాలబ్రహ్మాచారి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, భాస్కర్, రవిశంకర్, ఎండీ. హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కమిషన్ల వెనుక రాజకీయ కుట్రలు

- విద్యుత్ ఒప్పందాల్లో ఒక్క పైసా నష్టం జరగలేదు : మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ ప్రభుత్వం.. గత బీఆర్ఎస్ సర్కారుపై నిందలు వేయటానికి, మాజీ సీఎం కేసీఆర్‌పై బురదజల్లడానికే విచారణ కమిషన్లను వేసిందని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. వాటి వెనుక రాజకీయ కుట్రలు దాగున్నాయని ఆయన విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తమ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాల్లో ఒక్క పైసా నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ చైర్మెన్‌తో మీడియా సమావేశం ఏర్పాటు చేయించారని చెప్పారు. గతంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాట్లాడిన మాటలనే ఆ సందర్భంగా చైర్మెన్ చెప్పారని విమర్శించారు. తద్వారా ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపేందుకు ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నేత కేసీఆర్ తన లేఖలో అన్ని విషయాలనూ స్పష్టం చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఏమీ చేయలేమనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మీడియాకు లీకులనిచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందంతో రూ.6 వేల కోట్ల నష్టం కాదు, అంతకుమించి లాభం జరిగిందని జగదీశ్‌రెడ్డి వివరించారు.

తొమ్మిది, పదో షెడ్యూళ్లలోని అంశాలపై దృష్టి సారించండి

మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఏర్పడి పదేండ్లు పూర్తయినా ఇంకా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని మాజీ మంత్రి వి.శ్రీనివాసగౌడ్ తెలిపారు. ముఖ్యంగా తొమ్మిది, పదో షెడ్యూళ్లలోని అంశాలు జఠిలంగా ఉన్నాయని అన్నారు. వాటి పరిష్కారంపై దృష్టి సారించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తొమ్మిదో షెడ్యూల్‌లోని 30 సంస్థలకు సంబంధించిన సమస్యలు, పదో షెడ్యూల్‌లోని 102 సంస్థల అంశాలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. తమ పార్టీకి రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం కాదనీ, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

భూ యజమానులపై చర్యలు తీసుకోవాలి

- నోటరీదారులకు ఇంటిపట్టాలివ్వాలి : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేదలు 2016లో కొనుగోలు చేసుకున్న ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలనీ, జీవో 59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి పట్టాలివ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం వట్టినాగులపల్లిలో వ్యకాస బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. వట్టి నాగులపల్లి శివారులోని 130/3, 130/4 సర్వే నెంబర్లలోని ఏడెకరాల లావణి పట్టా భూమి భిక్షపతి, పెంటమ్మ పేరుపై ఉందనీ, అందులో రెండెకరాల భూమిని ఇంటి స్థలాల ప్లాట్లు చేసి 110 మంది పేదలకు నోటరీ ద్వారా అమ్మేశారని తెలిపారు. నోటరీదారులు 2016లోనే కరెంటు స్తంభాలు నాటుకుని ఇండ్లు కట్టుకున్నారనీ, ఇప్పుడు పేదల ఇండ్లను కూల్చివేయడం దారుణమని చెప్పారు. బాధితులు పోలీస్‌స్టేషన్, ఎంఆర్‌ఓ అధికారులను కలుస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి భూ యజమా నులపై చర్యలు తీసుకోవాలనీ, పేదలకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు. పేదలకు న్యాయం దక్కేవరకు పోరాడుతామని చెప్పారు. పర్యటనలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.పద్మ, సహాయ కార్యదర్శి కందుకూరి జగన్, తదితరులున్నారు.

షకీల్ కొడుకు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

నవతెలంగాణ -హైదరాబాద్

జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసులో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రాహిల్ అమీర్ అభ్యర్థన మేరకు ముందస్తు బెయిల్ ఉత్తర్వులు వెలువరించేందుకు హైకోర్టు నిరాకరించింది. రెండేండ్ల కిందట దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక మరణించింది. ఇతరులు గాయపడ్డారు. దీనిపై జూబ్లీహిల్స్ పీఎస్ కేసు పెట్టింది. అఫ్రాన్ అనే యువకుడే వాహనం నడిపినట్టుగా చార్జిషీట్ దాఖలైంది. ఇప్పుడు పోలీసులు జూబ్లీహిల్స్ ప్రమాద సమయంలో కారు నడిపింది రాహిలేనని తేల్చారు. దీంతో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రాహిల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ తుకారాం జి కొట్టివేశారు.

టీచర్ల ప్రమోషన్లను తప్పుపట్టిన హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

టీచర్ల ప్రమోషన్ల వివాదం విచారణలో ఉండగానే ఆ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే జరిపిన ప్రమోషన్ల ఉత్తర్వులను వాపస్ తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ తీరు కోర్టు ధిక్కారమే అవుతుందని అభిప్రాయపడింది. టీచర్ అర్హత పరీక్ష (టెట్)తో సంబంధం లేకుండా ప్రమోషన్స్ ఇవ్వాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ నిలిపివేస్తూ జస్టిస్ అభినంద్ కుమార్ సావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. విచారణకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన హాజరయ్యారు. ఆమె చెప్పిన వివరణపై బెంచ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. టెట్‌కు సంబంధించి రెండు విభిన్న ఆర్డర్లు ఉన్నందున వాటి తిరిగి సింగిల్ జడ్జి విచారణ పూర్తి చేసి తీర్పు చెప్పాలంది. ఈ ఆదేశాల తర్వాత ప్రభుత్వం ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడంపై బెంచ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ప్రమోషన్‌కు వీలుగా ఉత్తర్వులు ఇవ్వలేమంది.

విద్యా హక్కు చట్టం అమలుపై వివరణ ఇవ్వండి

నవతెలంగాణ-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం 2009లో పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యా హక్కు కల్పిస్తూ చట్ట రూపకల్పన చేసినప్పటికీ దానిని నేటి వరకు ఎందుకు అమలు చేయలేదని రాష్ట్రాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఉచిత నిర్బంధ విద్యా చట్టం అమలు ఏవిధంగా జరిగిందో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఆ చట్టంలో 121సీ ప్రకారం ప్రయివేటు స్కూళ్లల్లో పేద విద్యార్థులకు 1 నుంచి 10 వ తరగతి వరకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలనీ, ఈ చట్టాన్ని అమలు చేయడం లేదని న్యాయవాది యోగేష్ పిల్ వేశారు. దీనిపై విచారణ ఈ నెల చివరికి వాయిదా పడింది.

బాలిక అక్రమ రవాణా నిందితుల పిటిషన్ కొట్టివేత

నవతెలంగాణ-హైదరాబాద్

యాదగిరిగుట్టలో బాలికల అక్రమ రవాణా, వాళ్లను వ్యభిచార కూపంలోకి నెట్టేలా చేసిన నిందితులపై కేసును కొట్టి వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. మానవ అక్రమ రవాణా, వ్యభిచార గృహం నిర్వహణలపై 2018లో పెట్టిన కేసులను ఎత్తేయాలని కామసాని రాజేశ్వరి, అదే ఇంటి పేరుతో ఉన్న మరో ఐదుగురు వేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. బాలికలను అక్రమంగా రవాణా చేసి వాళ్ల పెద్దవాళ్లమాదిరిగా కనిపించేలా ఇంజక్షన్లు చేసి వ్యభిచారం రొంపిలోకి పిటిషనర్లు నెట్టారనే తీవ్ర అభియోగాలు న్నాయనీ, కేసును కొట్టేయాలన్న వాళ్ల అభ్యర్థనను డిస్మిస్ చేయాలన్న పోలీసుల వాదనను హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించింది.

తెలంగాణలో గనులను వేలం వేయొద్దు

- ప్రభుత్వమే నిర్వహించాలి :సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఈ నెలాఖరులోగా తెలంగాణలోని గనులను వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గనులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. తెలంగాణలోని ఐదు ఇనుప, ఐదు సున్నపురాయి, ఒక మాంగనీస్ మైన్‌లను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయకపోతే కేంద్రమే వేస్తుందని ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి ప్రజాధనాన్ని దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి కార్పొరేట్ సంస్థల లాభాల కోసం రాష్ట్రంలో గనులను ప్రయివేటీకరించడానికి ప్రయత్నించడం శోచనీయమని పేర్కొన్నారు. సింగరేణిలోని 15 బొగ్గు బావులను వేలం వేయరాదనీ, వాటిని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కోయగూడెం, సత్తుపల్లి, ఓసీపీ3 లలో అరబిందో ఫార్మాకు కేటాయించి రూ.50 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను బీజేపీ తీసుకున్నదని విమర్శించారు. సింగరేణి బొగ్గుబావులు ప్రయివేటు కంపెనీల చేతుల్లోకి వెళ్లకుండా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై డీసీపీ సమీక్ష

- రెడ్‌కార్నర్ నోటీసు పురోగతిపై ఆరా
- రాజకీయ ప్రముఖుల పాత్రపై మరింత సమాచార సేకరణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై దర్యాప్తు అధికారులతో పశ్చిమ మండల డీసీపీ విజయకుమార్ సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఇప్పటివరకూ ఈ కేసులో సాధించిన పురోగతి, సేకరించిన ఆధారాలు, విచారణలో రాబట్టిన సమాచారం, మొదలగు అంశాలపై మరోసారి సంపూర్ణంగా ఆయన రివ్యూ చేసినట్టు తెలిసింది. ప్రధానంగా ఈ కేసులో కీలక పాత్రధారి అయిన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావును విచారిస్తేనేగానీ ఈ కేసులో చిక్కుముడిగా మారిన మరికొన్ని అంశాలు తేటతెల్లం కావని విచారణ అధికారులు ఆయనకు వివరించినట్టు తెలిసింది. అయితే, ప్రభాకర్‌రావు కోసం జారీ చేసి రెడ్‌కార్నర్ నోటీస్‌ను అమలు చేయడంలో సీబీఐ మొదలుకుని ఇంటర్‌పోల్ వరకు ఏ మేరకు సఫలీకృతం

అవుతున్నాయనే అంశంపై కూడా కూలంకషంగా చర్చ జరిగినట్టు తెలిసింది. అయితే, ఇప్పటివరకూ పట్టుబడ్డ డీఎస్పీ ప్రణీత్‌రావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులు విచారణలో వెల్లడించిన ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా చర్చించినట్టు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ చేయాలని తమకు ఆదేశాలు ఇచ్చింది ప్రభాకర్‌రావు అయితే, ఆయన్ను ఈ దిశగా ప్రేరేపించింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నాయకులని కొన్ని సందర్భాలలో ఈ నలుగురు అధికారుల నుంచి సమాచారం లభించినప్పటికీ వాటిని ధ్రువీకరించడానికి తగిన ఆధారాలు ఇంకా సేకరించాల్సి ఉందని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. మొత్తంమీద ప్రభాకర్‌రావును తీసుకొచ్చి క్షుణ్ణంగా విచారిస్తేనేగానీ తెరవెనుక ఉన్న రాజకీయ ప్రముఖుల గుట్టు సాక్ష్యాలతో సహా బయట పడవని విచారణ అధికారులు ఒక అభిప్రాయానికి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

అప్పుడే చెప్పాం..వినలే

(మొదటిపేజీ తరువాయి)

విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట తన వాదన వినిపించారు. ఆయనతో పాటు అప్పటి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం కూడా ఉన్నారు. కమిషన్ ఎదుట రఘు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఒప్పందంలోని లోపాలను కమిషన్‌కు వివరించారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణంపైనా తమ అభ్యంతరాలను తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందానికి తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇప్పటి వరకు ఎలాంటి ఆమోదం తెలుపలేదని స్పష్టం చేశారు. కేవలం మధ్యంతర టారిఫ్‌పై మాత్రమే ఓ ఆర్డర్ ఇచ్చారనీ, అది లెర్నింగ్ లైసెన్స్ వంటిదే తప్ప, ఆమోదం తెలిపినట్టు కాదన్నారు. పై అంశాలపై తమ వద్ద ఉన్న సమాచారం మొత్తం కమిషన్‌కు అందచేశామని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందాన్ని ఎమ్ఓయూ రూపంలో కాకుండా టెండర్ ప్రక్రియ ద్వారా అయితే ఎలాంటి ప్రయోజనాలు కలిగేవో కమిషన్‌కు వివరించినట్టు చెప్పారు. ఒప్పందం ప్రకారం ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సంస్థలు ఏనాడు కరెంటును సరఫరా చేయలేదన్నారు. ఈ ఒప్పందం వల్ల విద్యుత్ సంస్థలకు రూ.2,600 కోట్ల నష్టం జరిగిందన్నారు. మొదట చేసుకున్న ఒప్పందంప్రకారమే సక్రమంగా విద్యుత్ సరఫరా జరగనప్పుడు, దానికి అదనంగా మరో వెయ్యి మెగావాట్లకోసం అదే ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్నారనీ, దానివల్ల లాభం లేదని తర్వాత తెలుసుకొని రద్దు చేసుకుందామనుకుంటే సాధ్యం కాలేదని వివరించారు. వరద ముంపు ప్రాంతాల్లో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణం చేపట్టారనీ, ఇక్కడ కూడా కాంపిటీషన్ పద్ధతిలో కాకుండా పరస్పర ఒప్పందాలు (ఎమ్ఓయూ) చేసుకున్నారన్నారు. 2013-24 తర్వాత కాంపిటేటివ్ బిడ్డింగ్‌లో బీహెచ్ఈఎల్ జీరోకు పడిపోయిందనీ, దీనిపై కాగ్ స్పష్టమైన రిపోర్టు ఇచ్చిందని గుర్తుచేశారు. అలాంటి సంస్థకు ఎమ్ఓయూ రూపంలో ప్రాజెక్టుల్ని ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. మూడేండ్లలో పూర్తి కావల్సిన ప్రాజెక్టులు 9 ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. భద్రాద్రి థర్మల్ ప్లాంట్‌లో సబ్ క్రిటికల్ టెక్నాలజీ రాష్ట్ర ప్రభుత్వం ఛాయిస్ కాదనీ, బలవంతంగా ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని రుద్దారని విమర్శించారు. 2010లో తయారు చేసుకున్న సబ్ క్రిటికల్ టెక్నాలజీ యంత్రాలను బీహెచ్ఇఎల్ ఆరేండ్ల తర్వాత ప్రభుత్వానికి అంటగట్టిందనీ, ఆ యంత్రాలు సరైనవి కావని తేల్చిచెప్పారు. గోదావరిలో వరద ఎక్కువైతే భద్రాద్రి థర్మల్ కేంద్రం ముంపునకు గురవుతుందనీ, ఆ విషయం అప్పట్లోనే చెప్పినా వినిపించుకోలేదన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను తప్పుడు లోకేషన్‌లో నిర్మాణం చేయడం వల్ల రవాణా చార్జీల భారం ఎక్కువగా పడుతుందని వివరించారు. భద్రాద్రి నిర్మాణంలో పర్యావరణ అంశాలను లెక్క చెయ్యలేదనీ, ఆలస్యానికి ప్రభుత్వం చేసిన తప్పిదాలే కారణం తప్ప మరొకటి కాదని అన్నారు. ఈ అంశాలపై పలు అభ్యంతరాలను రెగ్యులేటరీ కమిషన్ దృష్టికి 2016లోనే తీసుకెళ్లామనీ, దీనిపై విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏడేండ్ల వరకు చేయలేదని గుర్తుచేశారు.

రాజ్యాంగ వ్యవస్థల్ని పట్టించుకోలేదు–కోదండరాం

ప్రజల సొమ్ముకు ప్రభుత్వం ధర్మకర్తగా వ్యవహరించాలే తప్ప, ఇష్టం వచ్చినట్టు ప్రజాధనాన్ని ఖర్చు చేస్తామంటే కుదరదని అప్పటి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వ్యవస్థల్ని ధ్వంసం చేసిందన్నారు. ఛత్తీస్‌గఢ్, యాదాద్రి, భద్రాద్రిపై అప్పట్లోనే తాము అనేక లోపాలు ఎత్తి చూపామనీ, నిర్బంధాలు ప్రయోగించి, ప్రశ్నించే గొంతుల్ని నొక్కే ప్రయత్నం చేశారని అన్నారు. కాళేశ్వరం సహా రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. కమిషన్ ఎదుట తమ వద్ద ఉన్న సమాచారం అంతా ఇచ్చామనీ, మాజీ సీఎం కేసీఆర్ విచారణకు సహకరించాలని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి మాజీ సీఎం కే చంద్రశేఖరరావు రాసిన లేఖలోని అంశాలపై సాంకేతిక వివరణలు కోరినట్టు తెలిసింది. లేఖలోని రాజకీయ, వ్యక్తిగత అంశాలను ఓ భాగంగా, ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణంపై ఆయన ఇచ్చిన సమాచారాన్ని కూడా క్రాస్ చెక్ చేసుకున్నట్టు సమాచారం. కేసీఆర్‌ను మరోసారి విచారణకు వ్యక్తిగతంగా పిలవాలా లేదా అనే అంశంపై నిర్ణయాన్ని వాయిదా వేసినట్టు తెలిసింది. అయితే మరోసారి కేసీఆర్‌కు లేఖ రాస్తే ఎలా ఉంటుందనే విషయంపై కూడా కమిషన్ ఆలోచిస్తున్నట్టు సమాచారం.

దోస్త్ రెండో విడతలో 41,533 మందికి సీట్లు

- సెల్ఫ్ రిపోర్టింగ్‌కు 26 వరకు గడువు
- నేటి నుంచి మూడోవిడత కౌన్సెలింగ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు సంబంధించి రెండో విడత సీట్లను ఉన్నత విద్యామండలి మంగళవారం కేటాయించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం, దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దోస్త్ రెండో విడతలో 44,803 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. వారిలో 41,533 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. అందులో 7,039 మంది మెరుగైన సీట్లను పొందారని పేర్కొన్నారు. మొదటి ప్రాధాన్యత ద్వారా 28,838 మంది, రెండో ప్రాధాన్యత ద్వారా 12,695 మంది సీట్లు సాధించారని వివరించారు. విద్యార్థులు తక్కువ వెబ్‌ఆప్షన్లను నమోదు చేయడం వల్ల 3,270 మందికి సీట్లు కేటాయించలేదని తెలిపారు. రెండో విడతలో ఆర్ట్స్‌లో 4,884 మందికి, కామర్స్‌లో 14,012 మందికి, లైఫ్ సైన్సెస్‌లో 8,791 మందికి, ఫిజికల్ సైన్స్‌లో 9,727 మందికి, డీ ఫార్మసీలో 75 మందికి, ఇతర కోర్సుల్లో 4,044 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 26 వరకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. మొదటివిడతలో సీటు పొంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులకు రెండో విడతలో సీటు కేటాయిస్తే వారు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని కోరారు. లేదంటే ఆ సీటు రద్దవుతుందని తెలిపారు. రెండో విడతలో సీటు కేటాయిస్తే మొదటి విడతలో సీటు రద్దవుతుందని వివరించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన తర్వాత మెరుగైన సీటు కోసం మూడో విడతలో మళ్లీ వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. మూడో విడత సీట్ల కేటాయింపు తర్వాత సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు వచ్చేనెల ఎనిమిది నుంచి 12 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. రిపోర్టు చేయకుంటే ఆ విద్యార్థి సీటును కోల్పోతారని తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను దృష్టిలో ఉంచు కుని మూడో విడత కౌన్సెలింగ్ షెడ్యూ ల్‌ను సవరించామని పేర్కొన్నారు. బుధవారం నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. వచ్చేనెల రెండో తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. బుధవారం నుంచి వచ్చేనెల మూడో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఆరో తేదీన సీట్లు కేటాయిస్తామని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ తరగతులు వచ్చేనెల 15 నుంచి ప్రారంభమవుతాయని వివరించారు.

ఆగిన సాంచెల సప్పుడు

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లదీస్తూ వచ్చిన పరిశ్రమ ఇప్పుడు పూర్తిగా కనుమరుగయ్యే దిశగా పయనిస్తోంది. దీనికి కేంద్ర ప్రభుత్వ విధానాలూ ఒక కారణమయ్యాయి.

ఆర్డర్లూ లేవు.. విద్యుత్ సబ్సిడీ ఎత్తివేత

గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లు ప్రస్తుతం నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.34లక్షల విలువైన సర్వశిక్ష అభియాన్ వస్త్ర ఉత్పత్తులకు మాత్రమే ఆర్డర్లు ఇచ్చింది. రూ.350కోట్ల బకాయిల్లో రూ.150కోట్లు మాత్రమే విడుదల చేసింది. విద్యుత్ సబ్సిడీ కూడా లేదు. గత సర్కారు ఇక్కడి పరిశ్రమను 5హెచ్‌పీ విద్యుత్ వినియోగించే స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ కింద జమ కట్టింది. ఆ పేరుతో 10హెచ్‌పీ విద్యుత్ వినియోగించినా సిరిసిల్ల విద్యుత్ సహకార సంస్థ (సెస్) ద్వారా మరమగ్గాలకు వినియోగించే కరెంటుకు యూనిట్‌కు రూ.4మాత్రమే వసూలు చేసింది. అందులో రూ.2 రాయితీ కింద చెల్లించింది. ఈ సబ్సిడీ కోసం పరిశ్రమలోని ఒక్కో యూనిట్‌లో మూడు, నాలుగు మీటర్లు తీసుకుని రాయితీ కింద విద్యుత్ వినియోగించుకుంటూ ఉత్పత్తులు సాగిస్తూ వచ్చిన పరిశ్రమకు కొత్త నిబంధన 'షాక్' ఇచ్చినట్టయింది.

ఒక్కో ఆసామికి చెందిన పవర్‌లూమ్స్ యూనిట్‌లో ఎన్ని మీటర్లు ఉన్నా.. ఒక్క దానికే రాయితీ ఇస్తామని మెలిక పెట్టడంతో మిగిలిన మీటర్లపై యూనిట్ కరెంటుకు రూ.8.50 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఆసాములు ఆశలు వదులకుని సాంచెలను తుక్కు కింద అమ్మేసుకుంటున్నారు.

మగ్గాలను తెగనమ్ముకుంటూ..

ఒకప్పుడు సుమారు 45వేలకుపైగా మరమగ్గాలు ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఐదేండ్ల కిందటి వరకు 36 వేలకు చేరాయి. ఈ ఐదేండ్లలోనూ గత బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన ఆర్డర్లతో 15వేల మగ్గాలు మాత్రమే నడిచేవి. దీంతో మిగిలిన సాంచెలన్నీ సంక్షోభాన్ని తట్టుకోలేక ఒక్కొక్కొటిగా అమ్ముకునే పరిస్థితికి చేరాయి. ఏటా సుమారు 2వేల నుంచి 2500 మగ్గాల చొప్పున స్క్రాప్ కింద అమ్ముకుంటూ రావడంతో ప్రస్తుతం 23వేలకు మించి మగ్గాలు లేకుండా పోయాయి. ఇప్పుడు ఆర్డర్లు బంద్ కావడం, విద్యుత్ సబ్సిడీకి మంగళం పాడటంతో ఆర్నెళ్లుగా పెద్దఎత్తున మగ్గాలన్నీ స్క్రాప్ కింద తీసేస్తున్నారు. ఒక్కో మగ్గంపై రూ.లక్షన్నర ఖర్చుపెట్టి కొనుగోలు చేసిన ఆసాములంతా ఇప్పుడు కిలో రూ.36చొప్పున అమ్ముకుంటున్నారు.

పరిశ్రమను ఆదుకోవాలి

కోడం రమణ, సిరిసిల్ల పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి. గత ప్రభుత్వం మాదిరిగానే ఆర్డర్లు ఇవ్వాలి. వ్యవసాయానికి ఇస్తున్న మాదిరిగానే చేనేత రంగానికీ ఉచిత కరెంటు ఇవ్వాలి. లేదంటే ఇన్నాళ్లూ ఇచ్చిన కరెంటు సబ్సిడీని కొనసాగించాలి. నేత కార్మికుల సంక్షేమ పథకాలను కొనసాగించాలి.

పీజీఈసెట్‌లో 18,829 మంది ఉత్తీర్ణులు

ఫలితాలు విడుదల చేసిన బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా–డీ(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 10 నుంచి 13 వరకు నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) రాతపరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జేఎన్టీయూ హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, జేఎన్టీయూహెచ్ వీసీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి ఈ ఫలితాలను విడుదల చేశారు. పీజీఈసెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 22,712 మంది దరఖాస్తు చేయగా, 20,626 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 18,829 (91.28 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 16,563 మంది దరఖాస్తు చేస్తే, 14,882 మంది పరీక్ష రాశారు. వారిలో 13,891 (93.34 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే ఈ ఏడాది 2.06 శాతం ఫలితాలు తగ్గాయి. ఈ ఏడాది 10,179 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 9,156 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 8,246 (90.06 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 12,533 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 11,470 మంది పరీక్ష రాశారు. వారిలో 10,583 (92.27 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 2.21 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూహెచ్ రెక్టార్ కె విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు, పీజీఈసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి, కోకన్వీనర్ బి రవీంద్రారెడ్డి, కోఆర్డినేటర్ బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీజీఈసెట్ ఫలితాల వివరాలు

దరఖాస్తు చేసిన వారు	- 22,712
పరీక్ష రాసిన వారు	- 20,626
ఉత్తీర్ణులైన వారు	- 18,829
శాతం	- 91.28

బెంగళూరు టూ హైదరాబాద్ డ్రగ్స్ సరఫరా

- రెండు వేర్వేరు కేసుల్లో ఆరుగురి అరెస్ట్
- డ్రగ్స్, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం



నవతెలంగాణ–సిటీబ్యూరో

మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న..వినియోగిస్తున్న ఆరుగురిని పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా వేర్వేరు చోట్ల అరెస్టు చేశారు. వారి నుంచి డ్రగ్స్, నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక కేసులో వనస్థలిపురం పోలీసులు ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులతో కలిసి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి 26 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ తరుణ్‌జోషి వివరాలు వెల్లడించారు. హయత్‌నగర్‌కు చెందిన ఏ.భరత్‌రెడ్డి, వనస్థలిపురానికి చెందిన సి.విక్యత్ స్నేహితులు. మద్యానికి బానిసలైన ఇద్దరూ మాదక ద్రవ్యాలనూ సేవించారు. డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో తామే విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బెంగళూర్‌కు వెళ్లి గ్రాముకు రూ.1200 చొప్పున చెల్లించి డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో గ్రాము రూ.4వేల నుంచి రూ.5వేల చొప్పున విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు వనస్థలిపురం పోలీసులతో కలిసి ప్రత్యేక నిఘా వేశారు.

ఇద్దరిని అరెస్టు చేశాక.. వారిచ్చిన సమాచారంతో మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్న హయత్‌నగర్‌కు చెందిన టి.హేమంత్‌కుమార్‌ను కూడా అరెస్టు చేశారు. ఇదిలావుండగా, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఇద్దరు సరఫరాదారులతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మరో వ్యక్తిని భువనగిరి రూరల్ ఏరియాలో ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2 లీటర్ల హ్యాష్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్లు, రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా డ్రగ్స్ రవాణా చేసినా.. అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

యువతిపై కత్తిపీటతో దాడి

- నిందితుడి అరెస్ట్



నవతెలంగాణ– చాంద్రాయణగుట్ట

తనతో కొన్నాళ్లు ప్రేమ వ్యవహారం నడిపిన యువతి.. ఆ తర్వాత దూరంగా ఉండటాన్ని జీర్ణించుకోలేని ఓ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చి ఆమెపై కత్తిపీటతో దాడి చేశాడు. ఈ ఘటన హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాక ఎస్ఆర్‌టీ కాలనీలో నివాసం ఉంటున్న బాధితురాలు కాస్మోటిక్స్ బ్యూటీ పార్లర్‌లో పని చేస్తున్నది. ఆమె తల్లి కూడా బయట పనికి వెళ్తుంది. బాధితురాలికి ఐదేండ్ల కిందట అర్షద్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. అనంతరం ఇరువురూ విడాకులకు దరఖాస్తు చేసుకోగా ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఇదిలా ఉండగా, బాధితురాలు హరిబౌలి నివాసి, తన స్కూల్ మిత్రుడైన మణికంఠతో ప్రేమ వ్యవహారం నడిపింది. అయితే, కొన్ని రోజులుగా మణికంఠకు కూడా ఆమె దూరంగా ఉంటోంది. అది తట్టుకోలేని మణికంఠ మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఆమె ఇంటికి వచ్చి డోర్ పెట్టాడు. ఆ సమయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన మణికంఠ అక్కడే ఉన్న కత్తిపీటతో ఆమెపై దాడి చేశాడు. కింద పడేసి తలపై గట్టిగా కొట్టి.. గొంతు కోయడానికి ప్రయత్నించాడు. బాధితురాలు కేకలు వేయడంతో.. ఇంటి యజమాని వచ్చి డోర్ తీశాడు. మణికంఠ అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. అంతలోనే బస్తీ వాసులు అక్కడకు చేరుకుని నిందితుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఛత్రినాక ఎస్ఐ శోభ, ఇతర సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని అస్రా ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్జీటీలందరికీ పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులివ్వాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీ)గా డీఈడీ, బీఈడీ అర్హతలతో నియామకమైన ఉపాధ్యాయులందరికీ సీనియార్టీ ప్రకారం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (పీఎస్‌హెచ్‌ఎం)గా పదోన్నతి అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ మేరకు 11, 12 జీవోలను సవరించాలని కోరింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను పది వేలకు పెంచుతామంటూ అసెంబ్లీలో మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు 5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో ఒక ఎస్జీటీ ఉపాధ్యాయునికి బహుళ సబ్జెక్టుల్లో పదోన్నతి అర్హత ఉంటే సీనియార్టీ ప్రకారం వెబ్ కౌన్సెలింగ్‌లో అన్ని సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఇస్తున్నారని తెలిపారు. దీనివల్ల సీనియార్టీలో దిగువన ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులు పదోన్నతి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరికి ఒక సబ్జెక్టులో మాత్రమే పదోన్నతి ఇచ్చి మిగిలిన సబ్జెక్టుల్లో పేరు తొలగించి తదుపరి అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతి ఇవ్వాలని సూచించారు. ఆ మేరకు విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు.

జులై 8 నుంచి గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్‌టెస్ట్

- నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ : బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-2 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిల్ కేంద్రాల్లో వచ్చేనెల ఎనిమిది నుంచి గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో మొదటి గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహిస్తామని తెలిపారు. రోజుకు రెండు విడతల్లో నిర్వహిస్తామనీ, మొదటి రోజు ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2, రెండో రోజు ఉదయం పేపర్-3, మధ్యాహ్నం పేపర్-4 రాతపరీక్షలుంటాయని వివరించారు.

రెండో గ్రాండ్‌టెస్ట్ వచ్చేనెల 15,16 తేదీల్లో, మూడో గ్రాండ్ టెస్ట్ అదేనెల 22, 23 తేదీల్లో, నాలుగో గ్రాండ్ టెస్ట్‌ను జులై 30,31 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ గ్రాండ్ టెస్ట్‌లకు హాజరు కావాలనుకునే ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు బుధవారం నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు www.tgbcstudy-circle.cgg.gov.in వెబ్‌సైట్‌ను చూడాలనీ, మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికసాయం

- రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల విధుల్లో పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా 13 మంది ఉద్యోగులు మరణించారనీ, ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ.రూ.1.95 కోట్లు ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని తెలిపారు.

ఫలించిన టీఎస్‌యూటీఎఫ్ ప్రాతినిధ్యం

ఎన్నికల శిక్షణ, పోలింగ్ సందర్భంగా వడదెబ్బ, రోడ్డు ప్రమాదాలు, గుండె, మెదడు సంబంధిత సమస్యలతో హఠాన్మరణానికి గురైన ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలంటూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది. ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గతనెల 14న హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆ ప్రాతినిధ్యం ఫలించింది. అందుకు స్పందించిన ఎన్నికల కమిషన్ మరణించిన ఉద్యోగులకు సంబంధించి ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు.

కొత్త మద్యం కంపెనీలకు ఎలా అనుమతిస్తారు?

- ఆబ్కారీ శాఖ అధికారులపై మంత్రి జూపల్లి ఆగ్రహం
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు
- విచారణ జరిపి నివేదిక సమర్పించాలంటూ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా కొత్త మద్యం కంపెనీలకు ఎలా అనుమతినిచ్చారని ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ అధికారుల పనితీరుపై ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్నవారు ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. అధికారుల స్వంత నిర్ణయాలు ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించాయనీ, దీని వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయని తెలిపారు. మద్యం కంపెనీల అనుమతుల వ్యవహారాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకురాకుండా బేవరేజెస్ కార్పొరేషన్ అధికారులు ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. కొత్త మద్యం కంపెనీల అనుమ తులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఎక్సైజ్ శాఖ కమి షనర్ శ్రీధర్, బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహంను మంత్రి ఆదేశించారు. నివేదిక తర్వాత దోషులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం, కల్తీ కల్లు, గుడుంబా, గంజాయి సరఫరా, అమ్మకాలపై నిరంతర నిఘా పెట్టాలని ఆదేశించారు. తయారీదారులు, సరఫరాదారులు, విక్రేతలు, సప్లయర్ నెట్‌వర్క్ జాబితా తయారు చేయాలని సూచించారు. తరచుగా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై సమాజంలో అవగాహన కల్పించేం దుకు మీడియా, సోషల్ మీడియాతో పాటు థియేటర్లలో ఆడియో, వీడి యోల రూపంలో విస్తత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులతో తరుచూ సమావేశాలు నిర్వహించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన దష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించే సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని చెప్పారు. అధి కారుల పని తీరును బట్టి ఇంక్రిమెంట్లు, రివార్డులు, బదిలీల్లో ప్రాధాన్యత నివ్వనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్, అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు, బ్రూవరీస్ కార్పోరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహం, ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్తగా 59వేల ఎకరాల్లో పామాయిల్ సాగు

- మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా 59వేల ఎకరాల్లో పామాయిల్ సాగైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పంట మార్పిడి ప్రాధాన్యత రీత్యా పామాయిల్, ఉద్యాన పంటలకు పెద్ద ఎత్తున సబ్సిడీ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఇందుకోసం కేంద్ర వాటా రూ.80.10 కోట్లు, రాష్ట్ర వాటా రూ.53.40 కోట్లు కలిపి మొత్తం రూ.133.50 కోట్లు విడుదల చేశామని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూక్ష్మ సేద్యానికి సంబంధించిన రూ.55.36 కోట్ల (2022-23) పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.



శ్రీధర్‌బాబు తన వ్యాఖ్యలను

వెనక్కి తీసుకోవాలి

- బీఆర్‌ఎస్ నేత దేవీ ప్రసాద్, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వాసుదేవరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశా వర్కర్లను గుర్రాలతో తొక్కించిందంటూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పచ్చి అబద్ధాలను వల్లె వేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత జి.దేవీ ప్రసాద్ విమర్శించారు. మంత్రి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వాసుదేవరెడ్డితో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీలు, ఆశాలకు దేశంలోనే అత్యధిక జీతాలను చెల్లించింది కేసీఆర్ ప్రభుత్వమేనని తెలిపారు. పింఛన్ల పెంపునకు సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబును చూసి నేర్చుకోవాలంటూ మాజీ మంత్రి హరీశ్ చేసిన సూచనలో తప్పేముందని ప్రశ్నించారు. ఆసరా పింఛన్లకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ ఇచ్చిన హామీని నెరవేర్చటం లేదని విమర్శించారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ... హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ గతంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే హరీశ్ కోరారని గుర్తు చేశారు. ఈ అంశంపై చర్చకు హరీశ్ ఎందుకు..? తానే చర్చకు వస్తానని బల్మూరి వెంకట్‌కు సవాల్ విసిరారు. నిరుద్యోగుల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. హరీశ్‌లాంటి నిఖార్సయిన ఉద్యమకారుడి గురించి మాట్లాడే నైతిక అర్హత వెంకట్‌కు లేదని ఎద్దేవా చేశారు.

నీట్‌పై ప్రత్యేక కమిటీ వేయాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్‌పై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో ఆ పరీక్షపై ప్రత్యేక కమిటీని వేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాల వారీగా నీట్ పరీక్షను నిర్వహించాలంటూ తమిళనాడులో విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. అదే విధానాన్ని మన రాష్ట్రంలో అనుసరించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి

నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఈ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌తోపాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నీట్ అవకతవకలపై ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై గవర్నర్ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

24 నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

- డీఎంఈకి నోటీసు అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 24 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) తెలిపింది. ఈ మేరకు మంగళారం అసోసియేషన్ నాయకులు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణిని కలిసి సమ్మె నోటీసును అందజేశారు. గత నెలలోనే సమ్మె నోటీస్ ఇచ్చినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేశారు. అయితే తాము ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లలో ఒక్క డిమాండ్‌ను కూడా తీర్చలేదనీ, అందుకే తప్పనిసరి పరిస్థితిలో సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు వారు తెలిపారు. గతంలో నోటీసు ఇచ్చి దాదాపు నెల గడిచినా ఎటువంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి అనుకూలమైన చర్యలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. డిమాండ్లను నెరవేర్చడంలో సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటే మెరుగైన ఆరోగ్య సేవలందించేందుకు వీలుంటుందని సూచించారు. నిర్దేశిత సమయంలో ఉపకార వేతనాల విడుదల, పెండింగ్ స్టైఫండ్స్ విడుదల, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గతంలో ఒప్పుకున్న మేరకు స్టైఫండ్, ఆంధ్రప్రదేశ్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్, ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు సరిపడేలా కొత్త హాస్టళ్ల నిర్మాణం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. డీఎంఈని కలిసి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ డి.శ్రీనాథ్, అధ్యక్షులు డాక్టర్ సీహెచ్.జీ.సాయి శ్రీహర్ష, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.ఐజక్ న్యూటన్ తదితతరులున్నారు.

ఎన్టీఏపై సుప్రీం ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

జరిగినప్పుడు దాన్ని సరిదిద్దాలని ఎన్టీఏకు సూచించింది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పడే శ్రమను మరిచిపోకూడదని, పరీక్షలు నిర్వహిస్తున్న ఏజెన్సీగా ఎన్టీఏ న్యాయబద్ధంగా వ్యవహరించాలని ధర్మాసనం పేర్కొంది. "పొరపాటు జరిగితే కనీసం ఫలానా చర్య తీసుకున్నామని చెప్పినా అది మీ పనితీరుపై విశ్వాసాన్ని కలిగిస్తుంది. ఎన్టీఏ నుంచి సకాలంలో సరైన చర్యలను ఆశిస్తున్నాం" అని తెలిపింది.

విద్యార్థుల కష్టాన్ని మర్చిపోకూడదని వ్యాఖ్యానించింది. నీట్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలని కేంద్రం, ఎన్టీఏకి తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేసింది.

వ్యక్తి దారుణ హత్య

- డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో సీఐ శ్రీనివాస్ విచారణ

హుస్నాబాద్ రూరల్ : రాత్రి ఆరుబయట నిద్రపోయిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీకూరు నరసయ్య(55) సోమవారం రాత్రి ఇంటి బయట నిద్రించగా.. గుర్తు తెలియని దుండగులు మారణాయుధాలతో దాడి చేసి నరికి చంపారు. నరసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున స్థానికులు చూసి పోలీసులకు సమాచారమందించారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణకు రిమాండ్

ప్రభుత్వ భూముల ఆక్రమణపై కేసు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం 41వ డివిజన్ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు కర్నాటి కృష్ణపై మంగళవారం ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబర్ ఐపిసి 420,427,447 పిడిపిపి యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. జీవో నెంబర్ 59 ద్వారా ప్రభుత్వ భూముల ఆక్రమణకు యత్నించినందుకు, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడంపై ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



కష్టం కౌలు రైతులది.. ప్రతిఫలం పట్టాదారులది..

రెండింతలైన కౌలు..

- అప్పులపాలై చివరికి పట్టణాలకు వలస..
- కౌలుదారుల కన్నీటి కష్టాలు
- ఉపాధి లేక కౌలుకు తీసుకొని రైతుల సాగు
- రైతుబంధు సాయం కోసం ఎదురుచూపులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ- మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయరంగంలో కౌలురైతుల పాత్ర కీలకంగా మారింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కోస్తాంధ్రలో ఎక్కువమంది కౌలు రైతులు ఉండేవారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోనూ వారి సంఖ్య పెరిగింది. 36శాతం మంది కౌలువ్యవసాయం చేస్తున్నవారు ఉండటం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కౌలు రైతులను గుర్తించడం లేదు. గతంలో పహాని కాలంలో కౌలు రైతు వివరాలు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కౌలు రైతు పంట నష్టపోతే ఆ పంటను చూసి పట్టదారుకు పరిహారం వస్తుంది తప్ప కౌలు రైతులకు ఏమాత్రం రాదు. బ్యాంకులు సైతం పంట రుణాన్ని పట్టాదారుకే అందజేస్తారు. ఇక విత్తనాలు ఎరువులు సైతం పట్టాదారు పాసుపుస్తకాలు చూసే అందజేస్తారు. పంటను కూడా దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో రైతుభీమా కానీ, రైతు బంధు కానీ అందడం లేదు. సాగు చేసినా, చేయకున్నా పట్టా ఉన్న రైతులకే రైతుబంధు, ఇతర సౌకర్యాలు అందుతున్నాయి. గతంలో రైతులు కాని వారికీ రైతుబంధు అందింది. కానీ వ్యవసాయం చేస్తున్న కౌలురైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రైతుబంధు సాయాన్ని అందజేస్తామని ప్రకటించింది. కౌలు రైతులకు అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పిన నేపథ్యంలో.. ఏ రకంగా వారిని గుర్తిస్తారనే చర్చ జరుగుతోంది. ఇటీవల ప్రజాపాలనలో రైతుబంధు కోసం రెండు లక్షల మంది కౌలురైతులు దరఖాస్తు చేసుకున్నారు. తీవ్రంగా నష్టపోతున్న తమను ఆదుకోవాలని కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జీవనోపాధి కోసం ఒకటి రెండు ఎకరాలు ఉన్న రైతులు భూములను కౌలుకు తీసుకొని పత్తి , మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 80 మంది శాతం మంది వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. అందులో 50 శాతానికి పైగా పట్టాదారుల నుంచి భూములను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నవారు ఉన్నారు. గద్వాల, నారాయణపేట నాగర్ కర్నూల్ జిల్లాలో అత్యధికంగా సాగు చేసుకుంటున్నారు. పదేండ్ల క్రితం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 72 వేల మంది కౌలు రైతులు ఉండేవారు. ఒక గద్వాల జిల్లాలోనే 56,000 మంది పైగా కౌలు రైతులు ఉన్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ఉన్నప్పటికీ 2010-11 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కేవలం 6200 మందిని మాత్రమే కౌలు రైతులుగా గుర్తించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కౌలు రైతులను గుర్తించడమే మానేశారు. వారికి భరోసా లేకుండా పోయింది. కౌలుదారుల గుర్తింపునకు ఒక విధానం అమలులో లేకపోవడం వల్ల వీరి ఆర్థిక పరిస్థితులు దయనీయంగా మారాయి. దీంతో పట్టాదారులకు కౌలు చెల్లించలేక సతమతమవుతున్నారు. పెట్టుబడులు పెరగడం, కనీసం మద్దతు ధర లేకపోవడం తదితర కారణాలవల్ల అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ధరణి విధానంలో రైతు పాసుబుక్కులు, పహానిలు, ప్రభుత్వ రికార్డుల్లో కౌలు కాలంను తీసేశారు. దీంతో కౌలు రైతులకు కనీసం గుర్తింపు లేకుండా పోయిందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అప్పులపాలై హైదరాబాద్‌కు వలస..

గద్వాల జిల్లా ఎర్రవల్లి గ్రామంలో వెంకటయ్య ఆరెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని విత్తనపత్తిని సాగు చేశారు. పెట్టుబడి నాలుగు లక్షల దాకా అయింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక మూడు లక్షలు వడ్డీ వ్యాపారస్తులకు అప్పయ్యాడు. కౌలు చెల్లించలేదు అని ఈసారి రైతు సైతం భూమిని ఇవ్వలేదు. తీసుకున్న అప్పు చెల్లించాలని వడ్డీ వ్యాపారస్తులు ఒత్తిడి చేయడంతో హైదరాబాద్‌కు వలస పోయాడు. ఇలాంటి పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో కోకొల్లలు.

అధికమైన కౌలు..

పదేండ్లకాలంలో కౌలు రైతులకు ప్రభుత్వ సహకారం అందకపోగా కౌలు రైతులకు పట్టాదారుల నుంచి ఒత్తిడి అధికమైంది. ఎకరాకు కౌలు 10,000 తీసుకునే పట్టాదారులు రెండింతలు పెంచారు. సాగునీటి సౌకర్యం లేని నారాయణపేట జిల్లాలో సైతం ఎకరాకు 15,000 వసూలు చేయడం ఇబ్బందిగా ఉందని కౌలురైతులు ఆవేదన చెందుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో మెట్ట అయితే రూ. 25 వేలకు పైగానే కౌలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ సహాయం లేక పట్టాదారులు సహకరించ కపోవడం వల్ల కౌలు రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. దుక్కులు దున్నడం మొదలుకొని పంట చేతికి వచ్చేదాకా వడ్డీ వ్యాపారస్తులను నమ్ముకొని సాగు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎరువులు, విత్తనాల కోసం దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చివరికి అప్పు తీర్చలేక సొంతపొలాన్ని..

తాడూరు మండలం గుంతకోడూరు గ్రామంలో రైతు వెంకటేష్ తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. గత ఏడాది మూడెకరాల్లో పత్తి మరో మూడు ఎకరాల్లో మిర్చి, ఒక ఎకరంలో కూరగాయలు సాగు చేశాడు. ఎకరాకు రూ. 25 వేల కౌలు ముందే చెల్లించాడు. వర్షాలు సరిగ్గా లేక మద్దతు ధర రాక కౌలుతోపాటు పెట్టుబడి కలిసి రెండున్నర లక్షల అప్పుల పాలయ్యాడు. అప్పు తీర్చలేక తనకున్న పొలాన్ని ఇతరులకు మార్ట్ గేజ్ కింద రిజిస్ట్రేషన్ చేశారంటే కౌలు రైతుల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

రైతుబంధు మాదిరిగా మాకు ఒక పథకం పెట్టాలి





రైతు భరోసా మాదిరిగా కౌలు రైతులకు ఒక పథకాన్ని మాకు పెట్టాలి. ముఖ్యంగా గుర్తింపు కార్డులు ఇవ్వడం ద్వారా బ్యాంకులో రుణం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. సాగు చేసుకున్న రైతులకే సహకారమందేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

చింతకాయల వెంకటేష్,
గుంతకోడూరు, నాగర్‌కర్నూల్ జిల్లా

నష్టాలు మాకు, ప్రతిఫలాలు పట్టాదారుకు..



సాగు చేసి నష్టపోతుంది కౌలుదారులు. ప్రభుత్వం అందించే రైతుబంధు, పంట నష్టపరిహారం పట్టాదారుకు ఇస్తున్నారు. ఇది సమంజసం కాదు. గత ఏడాది నేను నాలుగు ఎకరాల్లో విత్తనపత్తి వేస్తే రెండు లక్షల నష్టం జరిగింది. అధికారులు అంచనా వేసి నివేదిక ఇచ్చారు సహాయం మాత్రం పట్టాదారుకే వచ్చింది. మాకు ఏ మాత్రం రాలేదు.

వెంకటయ్య,
ఎర్రవల్లి చౌరస్తా గద్వాల జిల్లా

అక్రమాలపై నజర్

- అదనపు ఖర్చులపై మంత్రి ఆరా
- విజిలెన్స్ విచారణ అనంతరం బాధ్యులపై చర్యలకు సిద్ధం
- మున్సిపల్ కార్పొరేషన్‌లో వారానికో విభాగంపై కలెక్టర్ సమీక్ష
- పారదర్శక పాలనే తమ ప్రభుత్వ ధ్యేయం
- మానేరు రివర్ ఫ్రంట్ రెండో దశ పనులు త్వరలో ప్రారంభం : మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

కరీం'నగర' మున్సిపల్ కార్పొరేషన్ అక్రమాలపై మంత్రి ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధానంగా నగరాభివృద్ధిలో చేపట్టిన అభివృద్ధి పనుల అంచనా విలువలో అదనపు ఖర్చులపై ఆరా తీయడం ప్రారంభించారు. స్మార్ట్‌సిటీ, పారిశుధ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా సహా పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఇంజినీరింగ్ విభాగం, సీఎం అస్యూరెన్స్ ద్వారా చేపట్టిన 80 రకాల పనులకు సంబంధించినవి, అందులో ఇంకా ప్రారంభం కాని పనులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్టు వివరించారు. ముఖ్యంగా ఒకటే పని కింద ప్రతిపాదన చేసిన రూ.37 కోట్ల విలువైన పనులపైనా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ స్థాయి అధికారులు కూడా పరిశీలించారని తెలిపారు. స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలో ఏర్పాటు చేసిన 22 వైఫై, హాట్‌స్పాట్ కేంద్రాలను 120 మంది మాత్రమే వినియోగించుకున్నట్టు తేలిందని చెప్పారు. టెక్నాలజీ కాంపోనెంట్ కింద రూ.98 కోట్లతో కమాండ్ కంట్రోల్ నుంచి 700 సీసీ కెమెరాలు, ఆడియో సౌండ్, టెలివిజన్ ప్రజెంటేషన్, సున్నిత ప్రాంతాల్లో అలారం లాంటి ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. భవిష్యత్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని నగరవాసులు అధికంగా ఉపయోగించుకునేలా ప్రోత్సహిస్తామన్నారు.

జిల్లా పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

పర్యాటక రంగ అభివృద్ధికి గతంలో రూ.100 కోట్లు విడుదల చేయగా.. రూ.30 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, అందులో రూ.5 కోట్లు మాత్రమే ఖర్చయినట్టు అధికారులు నివేదిక ఇచ్చారని మంత్రి పొన్నం వివరించారు. ఇందిరా చౌక్ అభివృద్ధికి రూ.కోటి 30 లక్షల బిల్లు ఉంటే, మరో రూ.50 లక్షలు అదనంగా ఖర్చు చేయటం వెనుక ఆంతర్యంపై విచారణ చేపట్టినట్టు తెలిపారు. సీఎం అస్యూరెన్స్ కింద రూ.132 కోట్లు మంజూరు కాగా రూ.60 కోట్ల పనులు పూర్తయ్యాయని, మిగతావి పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని కూడా సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారికంగా అనుమతులు తీసుకుని నిర్మించిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ సాగుతోందని, నివేదికల అనంతరం అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు స్పష్టం చేశారు. సమావేశంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి సహా జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల సంక్షేమానికి

నూతన విధానం

- అక్రిడిటేషన్ల గడువు మరో మూడు నెలలు పెంపు
- త్వరలో హెల్త్‌కార్డుల సమస్య పరిష్కారం : తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

జర్నలిస్టుల సంక్షేమం కోసం నూతన విధానం రూపొందిస్తున్నామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో జరగనున్న టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర మహాసభకు వెళ్తూ మంగళవారం మార్గమధ్యలో సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇల్లు, ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి శాసనసభ వ్యవహారాలు, ఓటు ఆన్ అకౌంట్, తదుపరి లోక్‌సభ ఎన్నికలు వరుసగా రావడంతో పరిపాలనపై దృష్టి కేంద్రీకరించే విషయంలో కొంత ఆలస్యమైందని తెలిపారు. మీడియా అకాడమీ చైర్మెన్‌గా తాను సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి జర్నలిస్టుల సంక్షేమ కోసం విధి, విధానాలు రూపొందిస్తే వెంటనే సంతకం చేసి అమలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు. హెల్త్ కార్డుల విషయంలో సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో 24 వేల అక్రిడిటేషన్లు ఉన్నాయని, అనర్హులకు అక్రిడిటేషన్లు అందకుండా ఒక క్రీమ్ లైన్ ఏర్పాటు చేస్తామని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ తప్పకుండా అక్రిడిటేషన్ వచ్చేలా చేస్తామని చెప్పారు. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో ఓ కుటుంబం ఆత్మహత్య విషయంలో జర్నలిస్టుల బ్లాక్ మెయిల్ కారణంగా జర్నలిస్టుల వృత్తికే మచ్చ ఏర్పడిందని, ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెలతో ముగుస్తున్న అక్రిడిటేషన్ల గడువును మరో మూడు నెలలు పెంచి ఈ లోపుగా కొత్త అక్రిడిటేషన్ల విషయంలో కసరత్తు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ కోశాధికారి రాజేష్, యూనియన్ హర్యానా, బీహార్ రాష్ట్రాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బంటు కృష్ణ, ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయకుమార్, నాగరాజు, రామకృష్ణ, హరి, జర్నలిస్టులు ఉన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో.. 14మంది వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఫార్మసిస్ట్ సస్పెన్షన్
- కలెక్టర్ బిఎం.సంతోష్ ఆకస్మిక తనిఖీ

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

విధుల్లో నిర్లక్ష్యం వహించిన 14 మంది వైద్య సిబ్బందికి జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బిఎం.సంతోష్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పని చేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ జిల్లా ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వార్డులోనూ తిరిగి రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఎంత మంది నిర్దేశిత సమయానికి వచ్చారని రిజిస్టర్‌లో పరిశీలించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు 14 మందితోపాటు మరో నలుగురు వైద్య సిబ్బంది హాజరు కాలేదు. దాంతో



ప్రతిరోజూ వారి హాజరు వివరాలను తెలిపే బయోమెట్రిక్ యంత్రంలోని వివరాలను ప్రింటు తీసి ఇవ్వాల్సిందిగా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. విధులను సరిగా నిర్వహించని 14 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే, ఫార్మసీ స్టోర్ తనిఖీ చేసి స్టాక్ వివరాలు, రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి.. ఫార్మసిస్టును వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే ఇన్ పేషెంట్, అవుట్‌పేషెంట్స్ నమోదు వివరాలు తెలిపే రికార్డులను పరిశీలించారు. కంటి వైద్య చికిత్సకు సంబంధించిన ల్యాబ్‌ను పరిశీలించి, సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా చూడాలని, ఆపరేషన్ థియేటర్ జులై 1 నుంచి పనిచేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. 50 పడకల వార్డును వినియోగంలోకి తీసుకొచ్చి పేషెంట్లను (పురుషులను) షిఫ్ట్ చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.నవీన్ క్రాంతి, వైద్య బృందం ఉన్నారు.



పసికందుపై వీధి కుక్క దాడి

ఆస్పత్రిలో పరిస్థితి విషమించి మృతి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మహబూబాబాద్ జిల్లాలో అమానుష ఘటన జరిగింది. ఆరు బయట మంచంలో పడుకోబెట్టిన 42 రోజుల పసికందుపై వీధి కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన పసి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన తొర్రూర్ డివిజన్లోని మడిపల్లి గ్రామంలో జరిగింది, జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి..

ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామానికి చెందిన రేణుక పురుడు కోసం మడిపల్లి గ్రామంలో తల్లిదండ్రులు నకెరకంటి ముత్తయ్య- ఉప్పలమ్మ ఇంటికి వచ్చింది. 42 రోజుల కిందట ప్రసవం జరగ్గా.. మగ బిడ్డ పుట్టాడు. బిడ్డను సోమవారం ఉదయం ఇంటి బయట మంచంలో పడుకోబెట్టారు. ఆ సమయంలో తల్లి ఇంట్లోకెళ్లగా.. వీధి కుక్క వచ్చి పసికందుపై దాడి చేసింది. మొహంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పసికందు మృతిచెందాడు. మంగళవారం చిన్న ముప్పారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

నవతెలంగాణ
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం జూన్ 19, 2024 www.navatelangana.com

డ్రయినేజీని పరిశీలించిన కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలో వర్షానికి జలమయమైన సత్తిరెడ్డి నగర్‌లో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షానికి డ్రయినేజీ ఓవర్ ఫ్లోతో పొంగుతుందని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, కాలనీవాసులు శ్రీనివాస్‌రెడ్డి, శాస్త్రి, అశోక్ కుమార్, సునీల్, సురేందర్, కృష్ణారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా, ఉప్పల్

బేగంపేటలోని మెట్రో భవన్‌లో మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో నెలకొన్న పలు విషయాల మీద వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా మెట్రో జాబ్స్‌లో 30శాతం లోకల్ వారికే ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండీ తప్పకుండా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడంతో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ ఆధ్వర్యంలో చక్రిపురం చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. చర్లపల్లి డివిజన్‌లోని ఈసీ నగర్ నుంచి రాంపల్లి చెరువు వరకు డ్రయినేజీ పైపులైన్ నిర్మాణానికి రూ.37.07 కోట్ల నిధులు మంజూరు చేశారని శ్రీదేవి తెలిపారు. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసుకొని పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజవర్గ అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేసిన ఉప్పల్ నియోజక వర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, కాసుల పోచయ్యగౌడ్, ప్రభుగౌడ్, శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, రాజు గౌడ్, ముత్యాలు, నజీర్, నర్సింహ నాయక్, హనుమంత్ నాయక్, భిక్షపతి, పాండు ముదిరాజ్, ప్రేమ్, శ్రీను, విజయ్, భాను చందర్ బాల్ నర్సింహ, నర్సిరెడ్డి, గణేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, గణేష్ గౌడ్, బసంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సాయిచరణ్, భానునేత, శంకర్, చరణ్, సాయి, రాములు, నవనీత, నీరజ, సంధ్య అరుణ, మున్నీ, గిరిజ, వరలక్ష్మి, మనీషా, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ శివమణి ఆధ్వర్యంలో..



ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి పనులలో భాగంగా స్ట్రామ్ వాటర్ బాక్స్ డ్రెన్ పనులకు రూ.30 కోట్లు కాప్రా డివిజన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్ శివమణి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. నిధుల మంజూరు కృషి చేసిన ఉప్పల్ నియోజనవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాప్రా డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనుల కోసం మరింత నిధులు చేకూరుస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి బీపీసీఎల్ దగ్గర లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'ఉచిత మెగా హెల్త్ క్యాంపును మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును ప్రారంభించిన బీపీసీఎల్ ఇన్‌చార్జి ఎం. సూర్య నాయక్ మాట్లాడుతూ.. తమ ప్లాంట్‌లోని ఎంప్లాయిస్‌కు మెడికల్ క్యాంపు సర్వీసెస్ ఏర్పాటు చేసిన క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. క్యాంపులో కమలానగర్ 'ప్లానెట్ ఆప్టికల్స్' వారి ఆధ్వర్యంలో అనీల్, సునీల్ కంటి పరీక్షలు చేశారు. పద్మసాయి డెంటల్ డాక్టర్ దినేష్ నమిలే బృందం దంత పరీక్షలు చేశారు. డాక్టర్ కాత్యాయిని జనరల్ పరీక్షలు చేశారు. ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ చాముండేశ్వరి శారీరక పరీక్షలు నిర్వహించారు. నాగార్జున నగర్ సన్‌సీడ్ హాస్పిటల్ డాక్టర్లు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎస్‌కే డయాగ్నొస్టిక్ వారు బీపీ, షుగర్‌తో పాటు పలు రక్త పరీక్షలు చేశారు. ఈ క్యాంపులో 190 మంది పాల్గొని అన్ని పరీక్షలు చేయించుకోగా 8 మంది రోగులకు ఉచితంగా కాటరాక్టు ఆపరేషన్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మెంబర్స్ కంతేటి విజయ కుమార్, చనమోలు వరప్రసాద్, శ్రీదేవి, హెచ్. రోజీ, బీపీసీఎల్ సీనియర్ మేనేజర్ వీవీ. నరసింహరావు మేనేజర్ దీపేంద్ర కుమార్ పాల్గొన్నారు.

చెట్లను పెంచడం సామాజిక బాధ్యత



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

చెట్లను పెంచడం సామాజిక బాధ్యత అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో మన బడి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సృష్టిలో సమస్త జీవరాసులు ఒకదానిపై మరొకటి ఆధారపడి పర్యావరణాన్ని కలుషితం చేయడాన్ని నివారించాలన్నారు. మన అందరికీ ఇల్లు లాంటి భూమాతను చాలా ఆరోగ్యకరంగా, ఆకు పచ్చగా ఉంచేందుకు కృషి చేద్దామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పర్యావరణ మార్పులు, కాలుష్య భూతమే ప్రపంచ మానవాళికి పెను సవాలుగా మారబోతుందన్నారు. ఆ ప్రమాదాన్ని గుర్తించి ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తెలిపారు. పచ్చదనాన్ని కాపాడటంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాపురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్లను శుభ్రం చేయాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర




వర్షాకాలం సీజన్ కావడంతో వాటర్ ట్యాంకర్లను శుభ్రం చేయాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం పురపాలక సంఘం పరిధిలోని 16వ వార్డులోని రాజ్ సుఖ్‌నగర్ వాటర్ ట్యాంకును పరిశీలించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు సకాలంలో అందించడానికి వాటర్ సిబ్బంది పని చేయాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- యోగా ట్రైనర్ సిమ్రాన్ అహుజా
- కంట్రీ క్లబ్ ఆధ్వర్యంలో యోగా మహోత్సవ్
- రాజీవ్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో





యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కోసం దేశవ్యాప్తంగా కంట్రీ క్లబ్ ఆధ్వర్యంలో యోగా మహోత్సవ్ అద్భుతమని ఇంటర్నేషనల్ యోగ ట్రైనర్ మాజీ మిస్ ఇండియా, సిమ్రాన్ అహుజా అన్నారు. మంగళవారం బేగంపేటలో కంట్రి క్లబ్ అధినేత సీఎండీ వై.రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో దేశంలోని కంట్రీ క్లబ్ వీఐపీ ప్లాటినం గ్లోబల్ మెంబర్ షిప్ కార్డును సిమ్రాన్ అహుజా ఆవిష్కరించారు కంట్రీ క్లబ్ హైదరాబాద్ వేదికగా 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిమ్రాన్ అహుజా కొన్ని యోగా ఆసనాలను ప్రదర్శిస్తూ ప్రత్యక్ష సెషన్‌ను నిర్వహించారు. ముఖ్యంగా హఠ యోగా, ప్రాణాయామాలు, యోగా నిద్ర, సూర్య నమస్కారాలు, చంద్ర నమస్కారాలతో ఔత్సాహికులకు శిక్షణ అందించింది. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ తత్వశాస్త్రం మూలాలను గౌరవిస్తూ ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతనిచ్చే కంట్రీక్లబ్ 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కంట్రీ క్లబ్ ప్లాటినం గ్లోబల్ మెంబర్ షిప్ కార్డ్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.. ప్రపంచవ్యాప్తంగా 180 కంటే ఎక్కువ దేశాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రజలు యోగాను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలనే ప్రధాని మోడీ దార్శనికతకు అనుగుణంగా భారతదేశంలోని కంట్రీ క్లబ్‌లలో వివిధ ఈవెంట్‌లు, సెషన్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇక దిగ్గజ క్రీడా ప్రముఖులైన కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్, మేరీ కోమ్, సానియా మీర్జా,పి వి సింధు,నిఖత్ జరీన్‌లతో అనుబంధం కలిగి ఉండడం గర్వంగా భావిస్తున్నామన్నారు. మాజీ మిస్ ఇండియా, ప్రముఖ అంతర్జాతీయ యోగా ట్రైనర్ సిమ్రాన్ తన అభిప్రాయాలను పంచుకుంటూ ప్రస్తుతం ప్రపంచదేశాలు సైతం భారత్ వైపు చూస్తున్నాయంటే ఇందులో యోగా కూడా ఒక కారణమేనన్నారు. యూఎస్ వంటి అగ్రదేశాల్లో యోగా భాగమైందని, అధునాతన ఫిట్నెస్ వ్యాయామాలకు బదులుగా వివిధ దేశాల్లో యోగాను అనుసరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఒక్కో ఆసనం ఒక్కో ఆరోగ్య సంరక్షణకు కేంద్రాలుగా నిలుస్తున్నాయని ఆమె తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో భూ కబ్జాలు..దోపిడీ

- కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి
- ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఘట్కేసర్



కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే భూ కబ్జాలు, అక్రమాలు, దోపిడీలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మండలం కాచవని సింగారం, ముత్వెల్ గూడెంలో వందల ఏండ్ల చరిత్ర గల బర్లదొడ్ల భూములు కబ్జాకు గురవుతున్న విషయం తెలుసుకొని బర్లదొడ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్‌కు ఓటు వేయలేదని కక్షతో అధికారులతో, పోలీసులతో కలిసి వందల ఏండ్ల చరిత్ర గల బర్లదొడ్ల భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఘట్కేసర్ మండలంలో కబ్జాకు గురైన భూముల్లో కాంగ్రెస్ నాయకులే హస్తం ఉందన్నారు. అణగారిన వర్గాల, పేదల భూముల జోలికి వెళ్లొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తం వెంకట్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాస్వ రాజుగౌడ్, భూ బాధిత కుటుంబాలు, తదితరులున్నారు.

విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలి

- కీసర సీఐ వెంకటయ్య

నవతెలంగాణ-కీసర



విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అందరూ ఆరోగ్యంగా జీవించాలని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజానికి సవాల్ గా మారిన మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని సూచించారు. చదువుకోవాల్సిన సమయంలో మత్తుకు అలవాటు పడి ఎంతోమంది యువతీ యువకులు బానిసలు అవుతున్నారన్నారు. మత్తు మాయలో పడితే నేరుగా మృత్యు లోయలో పడ్డట్టేనన్నారు. ఇలాంటి మత్తు పదార్థాల జోలికి పోకుండా తగు జాగ్రత్తలతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు కీసర ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన యువనేత సందీప్ గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు అత్వెల్లి సందీప్‌గౌడ్ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వారితో కలిసి మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ భవిష్యత్తులో అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సైతం భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

కేసీఆర్‌ను కలిసిన పవన్ ముదిరాజ్

నవతెలంగాణ-శామీర్‌పేట



మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావును శామీర్‌పేట గ్రామానికి చెందిన మలిదశ ఉద్యమకారుడు, కేసీఆర్ వీరాభిమాని పవన్ ముదిరాజ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా రాష్ట్ర ప్రజల ప్రక్షాన నిలబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కేసీఆర్ చెప్పారని పవన్ పేర్కొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్ద పీట



- మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్

నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అభివృద్ధి పనులు చేసేందుకు ఎమ్మెల్సీ వాణి నిధుల నుంచి రూ. 50 లక్షలు, మంత్రి శ్రీధర్ బాబు ఫండ్ నుంచి రూ.45 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మున్సిపల్ నిధులు రూ.1 కోటి 34 లక్షల 15 వేలతో ఓపెన్ జిమ్, టాయిలెట్స్, మున్సిపల్ సాధారణ నిధులతో వివిధ కాలనీల్లో ఓపెన్ నాలాలు శుభ్రం చేసేందుకు, హెచ్ఏసీపీ సంస్థ నుంచి మెషిన్, గడ్డి మందు దోమల మందు పారిశుధ్య సామాగ్రి కొనుగోలు మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో భూగర్భ మురుగు కాలువ రిపేర్లు, మంచి నీటి సరఫరా పైప్ లైన్ రిపేరు, మోటార్ల రిపేరు, జెట్టింగ్ మిషన్ రిపేరు, ఎలక్ట్రికల్ రెగ్యులర్ మెయింటనెన్స్, శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేసేందుకు పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజ మల్లయ్య, డీఈఈ చిరంజీవులు, టీపీవో శ్రీధర్ ప్రసాద్, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు నాను నాయక్, నాగయిపల్లి సుజాత, కొత్త హేమలత, మంగల్‌పురి వెంకటేష్, కొత్తసురేఖ, వరగంటి వెంకటేష్, మాదిరెడ్డి పావనీరెడ్డి, సంపన్ బోల్ స్వప్న, గోగుల సరిత, ముప్ప శ్రీలత, గురువెళ్లి వెంకటరమణ, పాండాల అనురాధ, వసుపతి రమేష్ గౌడ్, మాదిరెడ్డి నరసింహరెడ్డి, రామారం శ్రీహరి గౌడ్, కో ఆప్షన్ సభ్యులు, వడియాల రజినీ, వహిదా బేగం, కందాడి చెన్నారెడ్డిలు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, ఇందిరానగర్‌లో రూ.31 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. అను మతి లేకుండా సీసీ రోడ్లపై గుంతలు తీస్తున్న వారిపై అధికారులు చర్య తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సురేష్, జెడి నర్సింగ్, జామ్‌ధర్, రాజేష్, రాము, సురేష్ రెడ్డి, సోమయ్య ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

నవతెలంగాణ-కీసర



కీసర మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో 10 గ్రామాల్లో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశం నిర్వహించారు. కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి డీఆర్‌డీవో సాంభశివరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో సాంభశివరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంపై గ్రామసభలో వచ్చిన అభ్యంతరాలను ఓపెన్ ఫోరంలో చదివి వినిపించారు. గ్రామాల్లో రికార్డులు, క్షేత్ర స్థాయిలో పనులను గ్రామసభలు నిర్వహించి ఓపెన్ ఫోరం మీటింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కీసర ఎంపీడీవో గ్యామ, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, డీఆర్‌డీవో అధికారి గోపాలకృష్ణ, ఎంపీటీసీలు నారాయణ శర్మ వెంకట్ రెడ్డి, ఏపీవో అర్పిత, కాశన్న, జైపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ -మేడ్చల్



గంజాయి విక్రయించినా, సేవించిన ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీత హెచ్చరించారు. అక్రమంగా గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న శంకర్ భాగ్, సిబాకిలా అనే ఇద్దరు వ్యక్తులను విశ్వసనీయ సమాచారంతో సోమవారం శామీర్‌పేట్ మండల పరిధిలోని దేవరయంజాల్‌లో పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి 3.5కేజీల ఎండుగంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. నిందితులు మేడ్చల్ పట్టణంలోని పారిశ్రామికవాడ, పలు ఇంజనీరింగ్ కళాశాలల వద్ద గంజాయిని విక్రయిస్తున్నట్టు చెప్పారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచామని వెల్లడించారు.

విగ్రహాల ధ్వంసం హేయనీయం : సింగిరెడ్డి నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్



డబిల్‌పూర్ గ్రామంలోని సీతారామాంజనేయుల విగ్రహాల ధ్వంసం హేయమని బీజేపీ మేడ్చల్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మత పట్ల విశ్వాసాల పట్ల ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే ధోరణిలో ఆలయాలు, విగ్రహాల ధ్వంసం అనేది హిందువుల మత సహనాన్ని పరీక్షించడమేనన్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. డబిల్‌పూర్ గ్రామంలో 5 శబ్దాలుగా ప్రజలు విశ్వాసంతో కొలుస్తున్న సీతారామ వీరాంజనేయ హనుమాన్ దేవాలయంలోని విగ్రహాలను దుండగులు ధ్వంసం చేయడం దారుణమన్నారు. శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడిన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలన్నారు.

డబిల్‌పూర్‌లో సీతారాముల విగ్రహాల ధ్వంసం

- గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు
- భారీ ఎత్తున పోలీసుల మోహరింపు

నవ తెలంగాణ- మేడ్చల్



మేడ్చల్ మండల పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విగ్రహాల ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మేడ్చల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. కాగా మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సింహరెడ్డి, ఎస్‌వోటీ అడిషనల్ డీసీపీ శోభన్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఇద్దరు అనుమానితులను అదుపులకు తీసుకున్నామని విచారణ చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



దుకాణాలను మూయించిన యువకులు

గుర్తుతెలియని వ్యక్తులు సీతారాముల విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ గ్రామంలో యువకులు జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు. గ్రామంలోని వ్యాపార దుకాణాలను మూయించారు.



హయత్‌నగర్‌లోని బాటి లింగ్ కంపెనీలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి అమ్మవారికి, ఉప్పల మ్మ తల్లి అమ్మవారిని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తర్వాత మైసమ్మ ఎల్లమ్మ ఉప్పలమ్మకు బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా సతీమణి ఉప్పల స్వప్న, వారి కుమారులు ఉప్పల సాయికిరణ్, ఉప్పల సాయి తేజ, బంధుమిత్రులు, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ - నాగోల్

ఘనంగా శ్రీనివాస్ చార్యుల జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - సంతోష్‌నగర్



భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య 1964 సెక్రెటరీ జనరల్ శ్రీనివాస చార్యులు జన్మదిన వేడు కలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జీవిత బీమా అధికారు లు, ఏజెంట్లు, నాయకులు స్నేహితులు, అభిమానులు, తెలంగాణ రాష్ట్ర రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సీనియర్ నేతలు కేక్ కట్ చేయించి, ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.



'పేదలకు విద్యను దూరం చేసేందుకు బీజేపీ కుట్రలు'

- విద్యార్థి మార్చ్‌లో బాలాపూర్ ప్రగతిశీల యువజన సంఘం నాయకులు

నవతెలంగాణ - బడంగ్‌పేట్

పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకే బీజేపీ ప్రభుత్వం పలు రకాల కుట్రలు చేస్తుందని బాలాపూర్ ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ నాయకులు ఆరోపించారు. వివిధ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలపై హిమాయత్ నగర్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు మంగళవారం విద్యార్థి మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కారమోల రాకేష్, కొల్లూరు భీమేష్ మాట్లాడుతూ..పేద విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం ఆటలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలు రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించి, నీట్ అవకతవకల బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పేపర్ లీక్ పై ప్రధాని మోడీ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి నీట్ నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, హర్యానా, తదితర బీజేపీ పాలిత ప్రాంతాలలోనే ఇలాంటి అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వీటిపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ వ్యవహారంపై ప్రధాని మౌనం విడాలన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధర్మంగా వ్యవహరిస్తున్నారని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి హేతుబద్ధత లేదని దాన్ని బోర్డులో ఎవరున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్‌లో బీజేపీ చేసిన కుట్రతో లక్షలాది మంది విద్యార్థులు తమ జీవితాలను నష్టపోయారని ఆరోపించారు. విద్యారంగం పట్ల మొదటి నుంచి నిర్లక్ష్యంగా ఉంటున్న బీజేపీ విద్యను కాషాయీకరణ వైపు తిప్పాలని ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు, కొల్లూర్ శంకర్, జి మహేష్, పి నరేష్, ఎస్ మహేష్, ప్రవీణ్, పలు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇఎస్‌సీఐలో నాలుగు అద్వితీయమైన కోర్సులు

- కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్ రావు

నవతెలంగాణ - సిటీబ్యూరో

గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో నాలుగు అద్వితీయమైన కోర్సులను ప్రవేశపెట్టినట్లు కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు తెలిపారు. ఆర్బిట్రేషన్, సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికేషన్ కోసం ఒక సంవత్సరం వ్యవధి గల రెండు వేర్వేరు కోర్సులకుగాను జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయంతో కుదుర్చుకున్న ఒప్పందంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నట్లు అయన మంగళవారం తెలిపారు. ఆర్బిట్రేషన్‌లో ఒక ఏడాది వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికేషన్ కోర్సును ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో వచ్చే ఆగస్టు మొదటివారం నుండి క్లాసులు ప్రారంభిస్తున్నట్లు, అలాగే సైబర్ సెక్యూరిటీ అనేది కూడా నేటి రోజుల్లో అత్యంత ప్రాధాన్యత గల కోర్సు కాబట్టి సైబర్ సెక్యూరిటీలో కూడా ఒక ఏడాది వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేషన్ కోర్సును కూడా ఆగస్టు నుండి ప్రారంభిస్తున్నట్లు కాలేజ్ డైరెక్టర్ రామేశ్వర్ రావు తెలిపారు. ఈ రెండు కోర్సులకు ఫీజు ఒక్కోదానికి ఒక లక్ష ఇరవై వేలు ఉంటుందని, రెండు కోర్సులకు కూడా ఫీజు వచ్చే నెల జులై 30వ వరకు కాలేజీ కార్యాలయంలో చెల్లించవచ్చన్నారు. అడ్మిషన్లు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను సెలెక్ట్ చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ఆర్బిట్రేషన్ కోర్సులో చేరేవారు ఏదేని డిగ్రీ పూర్తి చేసివుండాలని, డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో వుండే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అయిదేళ్ల ఎల్ఎల్‌బీలో కనీసం మూడేళ్లు పూర్తి చేసుకున్నవారు సైతం ఈ కోర్సులో చేరడానికి అర్హత కలిగివుంటారని డైరెక్టర్ తెలిపారు. సైబర్ సెక్యూరిటీలో ఒక ఏడాది వ్యవధి గల సర్టిఫికేషన్ కోర్సులో చేరాలనుకునేవారు ఏదేని గ్రాడ్యుయేషన్ కోర్సులో కనీసం 50 శాతం



మార్కులుండాలని, డిగ్రీ ఫైనల్ ఇయర్ అభ్యర్థులు కూడా ఈ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధి లభించే ఈ కోర్సుల్లో చేరితే యువత లబ్ది పొందుతారని అభిప్రాయపడ్డారు. ఈ రెండు కోర్సులతో పాటుగా ఒక సంవత్సరం వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ జనరల్ మేనేజ్ మెంట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్ మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీతోపాటు ఎన్విరాన్మెంట్ కోర్సులను కాలేజ్‌లోని స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్‌లో ప్రవేశపెట్టినట్లు ప్రస్తుతం వీటికి అడ్మిషన్స్ జరుగుతున్నాయని తెలిపారు.

జియోగ్రాఫికల్ ఇన్ఫర్ మేషన్ సిస్టమ్‌లో ఆరు మరియు నాలుగు వారాల స్వల్ప వ్యవధి గల కోర్సులను కూడా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా ప్రవేశ పెట్టడం జరిగిందని, ఆరు వారాల కోర్సుకు కోర్స్ ఫీజు రూ. 35వేలు కాగా, నాలుగు వారాల కోర్సుకు ఫీజ్ రూ. 25 వేలు చెలియించాల్సి ఉంటుందన్నారు. ఈ కోర్సులు బ్యాచ్‌ల వారీగా నిర్వహిస్తామని, అభ్యర్థుల డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులను నిర్వహిస్తామని అయన తెలిపారు. అన్ని వివరాలకు కాలేజ్ వెబ్ సైట్‌లో చూడవచ్చని లేదంటే కాలేజ్‌లో స్వయంగా సంప్రదించవచ్చని అయన తెలిపారు.



చెట్ల కొమ్మల తొలగింపు

కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్‌లోని కమలానగర్‌లో ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించినట్టు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ చెట్ల కొమ్మలు పెద్దగా పెరిగి..ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడినప్పుడు అవి కరెంటు తీగలకు ఆనుకొని ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే ఆస్కారం ఉందనే విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. అందుకే ఆ చెట్ల కొమ్మలను తొలగించినట్టు తెలిపారు. ఆయన వెంట కాలనీ వాసులు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ కోరారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఆఫీసర్ పంకజకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరే టర్ మాట్లాడుతూ శ్రీ రమణ కాలనీలో రోడ్ల నిర్మాణానికి విధులు కేటాయించాలన్నారు. ముఖ్యంగా వరద నీటి కాల్వల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించాలన్నారు. ముఖ్యంగా ఏపీ ఎస్సీబీ కాలనీలోకి వరద నీరు రాకుండా పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా వందనపురి కాలనీ నుండి కేకే గార్డెన్ వరకు వర్షపు నీటి కాల్వను త్వరితగతిన ప్రారంభించే విధంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్, సూపరిటెండెంట్ ఇంజనీర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

కుల జనగణన అనంతరమే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగచారి డిమాండ్



నవతెలంగాణ - ఎల్బీనగర్

కుల జనగణన అనంతరమే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగచారి డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ కొత్తపేట వర్కర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంకటస్వామి గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాయబండి పాండురంగ చారి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కుల జనగణన అనంతరమే స్థానిక సంస్థల్లో 43% బీసీ రిజర్వేషన్ అమలు ద్వారా బీసీ, ఎంబీసీలకు వర్గీకరణతో కూడిన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఉండడం వలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత స్థానానికి రాణించగలుగుతున్నారని వెల్లడించారు. దేశ జనాభాలో దాదాపు 60% ఉన్న బీసీ జాతులకు అసెంబ్లీ పార్లమెంట్ లాంటి చట్టసభలకు రాజ్యాంగపర రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం వల్లనే బీసీ సమాజం వెనుకబాటుకు కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా అభివృద్ధి చెందిన జాతి మాత్రమే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి సాధించగలదని చరిత్ర చెబుతున్న సత్యమిదేన్నారు. అయితే ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల కనుసన్నులలో మెదిలే రాజకీయ బానిసల పట్ల స్వయం గౌరవం ఉన్న బీసీలు, ఎస్సీ, ఎస్టీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా బీసీ సమాజానికి ఈ బానిసల నుండి మొదటి ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లాంటి ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీల్లో పని చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీలు తమ జాతి ప్రజల ప్రయోజనాల కంటే తమ బంధువులు, వారసుల కోసమే జాతి ప్రయోజనాలను తాకట్టు పెడుతుంటారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సంకేటి శంకర్, శంకర్ గౌడ్, రవీందర్ గౌడ్, నాగన్న, రవీందర్, ధనంజయ, కుమ్మరి మంజుల, కుమ్మరి పద్మమ్మ, ముంత జ్యోతి, శ్యాంపల్లి సురేష్, సాగర్, జయలక్ష్మి, శ్రీలత, శ్వేత, భారతమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ - సంతోష్ నగర్

మల్కాజిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి మంగళవారం నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సద్ది సందీప్ రెడ్డి, లింగాల దశరథ్ గౌడ్, సుంకరి రమేష్ గౌడ్, బీజేపీ మహిళా అధ్యక్షులు రజిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో కాలనీ వాసులతో 'కళ్లెం'



నవతెలంగాణ - వనస్థలిపురం

హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మార్నింగ్ వాక్‌లో భాగంగా డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో మంగళవారం కాలనీ వాసులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీ సమస్యలను, కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, కట రవీందర్, హరినాథ్ బాబు, వెంకటేష్ రెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పైప్‌లైన్‌ను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలనీ, విజయపురి కాలనీ ఫేస్ 1 సాయిబాబా గుడి వద్ద చాలా రోజుల కిందట డ్రయినేజీ పైప్‌లైన్ వేసి, రోడ్డు మరమ్మతులు చేయలేదనే విషయాన్ని కాలనీ వాసులు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్.. సంబంధిత జీహెచ్‌ఎంసీ ఎస్ఈ అశోక్ రెడ్డి, వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్ బాబు, డీజీఎం రాజగోపాల్, ఏఈ నరేందర్ తేజ, వాటర్ వర్క్స్ మేనేజర్ సిరివెన్నెలను అక్కడికి పిలిపించారు. తర్వాత అధికారులతో కలిసి ఆ రోడ్డును, డ్రైనేజ్ పైప్ లైన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే రోడ్డు వేయాలని అధికారులను కోరారు. అనంతరం కాలనీలో పర్యటించి.. చెత్త, చెదారాలను పరిశుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, విజయపూర్ కాలనీ ఫేస్ 1 ప్రధాన కార్యదర్శి సాయిరాం, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, సాంబశివరావు, బీజేవైఎం సెక్రెటరీ పవన్ రెడ్డి, నాయకులు విజయ్, జీహెచ్‌ఎంసీ ఎస్ఎస్ హకీం ఉద్దీన్, జవాన్ రామ్ చందర్, వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సూపర్‌వైజర్ జయసింహ, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





కర్మన్‌ఘాట్ ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ - సంతోష్‌నగర్

శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థాన ఆలయ హుండీని దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.32,89,015, అమెరికా డాలర్లు 329 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాస శర్మ, ఆలయ చైర్మెన్ శ్రీనల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్ గౌడ్, మేక సురేందర్ రెడ్డి, నారగోని శ్రీనివాస్ యాదవ్, చాతిరి మధుసూదన్ సాగర్, చీర తిరుమల్లేష్, గోగిరెడ్డి అంజిరెడ్డి, గూడూరు మధుసూదన్ రెడ్డి, చేగోని సురేష్ గౌడ్, మేకల యాదగిరి, బిల్లకంటి కిరణ్ కుమార్, ముద్దా కళ్యాణ్ చక్రవర్తి, సాంబరాజు శైలజ, ఆలయ అర్చకులు, సిబ్బంది, శ్రీ భ్రమరాంబికా సేవా సమితి వాలాంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌ను కలిసిన టీఎన్జీవోస్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



నవతెలంగాణ - సిటీబ్యూరో

టీఎన్జీవోస్ కేంద్ర సంఘం యూనియన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) మంగళవారం ప్రొఫెసర్ కోదండరామ్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోదండరామ్‌కు పూలబొకే అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, కేంద్ర సంఘం నాయకులు చంద్రశేఖర్, జిల్లా సభ్యులు బొల్లిగిద్ద శంకర్, ఆర్టీఏ అధ్యక్షులు అరుణ్ పాల్గొన్నారు.

నా జీవితం ప్రజా సేవకే అంకితం

- కొలన్ శంకర్ రెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నా జీవితం ప్రజా సేవకే అంకితమని బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గ్రామానికి చెందిన కొలన్ శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కుటుంబ సభ్యులు, పార్టీ నాయకుల మధ్య కేక్ కట్ చేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి పాటుపడటంతో పాటు పార్టీ బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి టి.దేవేందర్ గౌడ్, రాష్ట్ర మోర్చా నాయకులు శూరకర్ల రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు బంధ్యాల శంకర్ రెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి, చల్మా రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బొర్ర రవి, వివిధ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు నిత్యావసర సరకులు అందజేత



నవతెలంగాణ-కల్చరల్

అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక నిర్వహణలో మంగళవారం సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కెవి.రమణ మాసబ్ ట్యాంక్ వద్దనున్న ఆయన నివాస కార్యాలయంలో వికలాంగులకు నిత్యవసర వస్తువులను అందజేశారు ఆయన మాట్లాడుతూ సమాజం లో పేదరిక నిర్మూలన కోరకు ప్రతి వారూ వారి స్థాయి తగ్గట్లుగా సహాయ పడాలని కోరారు. సేవా గుణం మనిషి లోని దైవత్వం మేలు కొలుపుతుందని చెప్పారు. అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర రావు మాట్లాడుతూ వికలాంగులు సానుభూతి కోసం కాక హక్కుల కోసం ఉద్యమించాలని వారు సమాజం లో ఎవ్వరికీ తక్కువ కాదన్నారు. రాష్ట్ర ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ జీ.వసుంధర, సెట్విన్ పూర్వ ఎం డీ. వైద్య నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-అంబర్‌పేట:

నల్లగొండ,వరంగల్,ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్సీగా విజయం సాధించి ఇటీవల పదవి బాధ్యతల ను స్వీకరించిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సీనియర్ జర్నలిస్ట్, తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షులు, న్యాయవాది మణికొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహాసభ ఉపాధ్య క్షులు, న్యాయవాది కొండూరు వినోద్ కుమార్, జితేందర్, కార్యదర్శి కొంతం సురేష్ బాబు, కార్యవర్గ సభ్యులు గడేకర్ల సత్యనారాయణ, కాటం సునీల్, పలుగుల శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్టెల సుభాష్, మహాసభ మీడియా కమిటీ కన్వీనర్, కంచుకట్ల ప్రకాష్, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు గంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో మాట్లాడి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

టీవైజేఎఫ్ ఛాంబర్ కమిటీ చైర్మెన్ పీ.వీ ప్రభాకర్ రావు, రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ తనుగుల జితేందర్ రావు



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని టీవైజేఎఫ్ ఛాంబర్ కమిటీ చైర్మెన్ పీ.వీ ప్రభాకర్ రావు, రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ తనుగుల జితేందర్ రావు తెలిపారు. టీవైజేఎఫ్ రాష్ట్ర స్థాయి సమావేశానికి హాజరై పీవీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ తన పలుకుబడి మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు అవకాశం ఉన్న దగ్గర డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్, డాక్టర్ తనుగుల జితేందర్ రావు అహర్నిశలు, 24 గంటలు యూనియన్ జర్నలిస్టుల సమస్యలపై ఆలోచించే జితేందర్ రావు ఆలోచనలను ఆయన అభినందించారు. రాష్ట్ర నాయకత్వానికి, జిల్లాల నాయకత్వాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా యూనియన్‌లో చేరిన జర్నలిస్టులకు అభినందనలు తెలిపారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు, డాక్టర్ తనుగుల జితేందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్కింగ్ యూనియన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ముందు ఉంటామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తమ యూనియన్ ముందు వరసలో ఉంటుందని తెలిపారు. అక్రిడేషన్, నాన్‌అక్రిడేషన్ అనే తేడాలతో నూతనంగా జర్నలిజంలోకి వస్తున్న జర్నలిస్టులను నిరుత్సాహ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క జర్నలిస్టుని ఆదుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో టీవైజేఎఫ్ రాష్ట్ర నాయకులు, జిల్లాల నాయకులు, మహిళా జర్నలిస్టు సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల ఏరియర్స్ బకాయిలను విడుదల చేయండి

- నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు ఏప్రిల్ నుండి పెరిగిన వీడీఏ పాయింట్లు అమలు చేయాలని, అలాగే బకాయి ఉన్న రెండు నెలల ఏరియర్స్ డబ్బులు వెంటనే ఇవ్వాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) సీఐటీ యు డిమాండ్ చేసింది. పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పను సీఐటీయు అధ్యక్షులు ఎం.వెంకటేష్‌తో పాటు యూనియన్ నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు ఎం. వెంకటేష్ మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుంచి పెరిగిన వీడీఏ పాయింట్లను వెంటనే అమలు చేయాలని, బకాయి ఉన్న రెండు నెలల ఏరియర్స్ (ఏప్రిల్, మే) డబ్బులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల రోజు చేసిన డ్యూటీ డబ్బులను వెంటనే ఇవ్వాలని, లేబర్ డిపార్టు మెంట్‌లో జరిగిన ఒప్పందం ప్రకారం రిటైర్మెంట్ అయిన కార్మికులకు వైద్య సౌకర్యం వెంటనే కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సెమి స్కిల్డ్ పోస్టులు, రాసే పనిలో అన్ స్కిల్డ్‌గా పనిచేస్తున్న కార్మికులలో చదువు కుని అర్హత కలిగిన వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ.నర్సింహులు వెంకట్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జుమ్మేరాత్ బజార్ గ్రౌండ్ లోని షాహినాయత్ గంజ్ గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో గోషామహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్ సింగ్ పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు, బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతా రామశాస్త్రి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజేష్, కైలాష్, వెంకటేశ్వర్లు, మూర్తి, నవనీత టీ. విజయలక్ష్మి , జైపాల్ సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'మత్తుపదార్థాలకు బానిసలై దారి దోపిడీ'

- ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేసిన నారాయణగూడ పోలీసులు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మత్తుపదార్థాలకు బానిసలై దారి దోపిడీ, నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్లను నారాయణగూడ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, నారాయణగూడ సీఐ యూ. చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ బర్గర్ కింగ్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేసే డి.దినేష్ రెడ్డి అనే వ్యక్తి ఈ నెల 13న తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో హాస్టల్‌కు తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హిమాయత్‌నగర్‌లోని సిటీకేఫ్ సమీపంలోని స్ట్రీట్ నెం.11 వద్ద అకస్మాత్తుగా హెూండా డియో వాహనంపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి డబ్బు డిమాండ్ చేశారు. బాధితుడు తన వద్ద డబ్బు లేదని చెప్పడంతో వారు మొబైల్ ఇవ్వమని అడిగారు. కానీ అతడు మొబైల్ ఫోన్ ఇవ్వడానికి నిరాకరించడంతో వారు అతనిపై దాడి చేసి కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితుడు దినేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు, వాహన తనిఖీలలో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ ముగ్గురు దోపిడీకి పాల్పడ్డారని నిర్ధారించిన పోలీసులు వారిని జువైనల్ హెూంకు తరలించారు. వీరిలో ఓ మైనర్ ఓ గ్యాంగ్ రేప్ కేసులో గతంలో జైలు శిక్ష అనుభవించాడని, మత్తుపదార్థాలకు అలవాటు పడి, దారి దోపిడీలు, నేరాలకు పాల్పడుతూ అక్రమంగా దండుకున్న డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నారని ఏసీపీ తెలిపారు. మత్తు పదార్థాల వల్ల యువకుల జీవితాలు నాశనం అవుతున్నాయని, వాటి వల్ల కొందరు నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. తల్లి దండ్రులు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా యువకులను నిరంతరం గమనిస్తూ వారి రోజు వారి కార్యకలాపాల విషయాలను గమనిస్తూ ఉండాలని ఏసీపీ శంకర్ సూచించారు.ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు.

ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి అన్నారు. మంగళవారం కోఠి డిఎంహెచ్ఎస్ ప్రాంగణంలో ఆశా వర్కర్లకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో డాక్టర్ శిల్పారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని 26వేలమంది ఆశా వర్కర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆశా వర్కర్ల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు మూడు దశాబ్దాలకు పైగా పని చేస్తున్నారన్నారు. వారు రిజిస్టర్లు రాయడం, సర్వేలు నిర్వహించడం, ఆన్‌లైన్‌లో పనిచేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి అన్ని రకాల వ్యాధులను గుర్తించడంతో పాటు ప్రభుత్వం ద్వారా అనేక శిక్షణలు పొందారు. గర్భిణీ స్త్రీలు, శిశువులు, చిన్న పిల్లలు ఇతర వ్యక్తులకు ఆరోగ్య సేవలు. కరోనా మహమ్మారి సమయంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఆశా వర్కర్లకు ఆరోగ్యంలో గ్లోబల్ లీడర్‌లుగా అవార్డును ప్రకటించింది అని గుర్తు చేశారు. ఇంత అనుభవం ఉన్న ఆశా వర్కర్లను పరీక్షలు రాయమని అడగడం సమంజసం కాదన్నారు. పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆశాలకు కొత్త సమస్యలు తీసుకురావడం సరికాదన్నారు. ఆశలకు ఇచ్చే పారితోషికాన్ని ప్రస్తుత ప్రభుత్వం రూ. 18 వేలు పెంచి అమలు చేయాలన్నారు. ప్రతి నెల 2న వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర ప్రభుత్వాసుపత్రుల్లో ఆశా వర్కర్లందరూ మహిళలే కావడంతో ఆశాలకు తక్షణమే విశ్రాంతి గదులు లేవని వాటిని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ప్రసూతి సెలవులు కల్పిస్తూ సర్క్యులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ మద్దతు తెలిపారు. అనంతరం వారు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు వారిని సుల్తాన్ బజార్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు గేటు ముందు బైఠాయించారు. ఆశా వర్కర్ల సమస్యలపై స్పష్టత వచ్చేవరకు ఆందోళన విరమించే లేదని స్పష్టం చేశారు దీంతో మెటర్నల్ హెల్త్ న్యూట్రిషన్ జాయింట్ డైరెక్టర్ పద్మజ వారి వద్దకు వచ్చి ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో మహిళా మోర్చా నాయకులు గీతారెడ్డి, డాక్టర్ సమత, అనిత, జ్యోతి, భాగ్యలక్ష్మి, వాణి, మంజులారెడ్డి, పెద్ద ఎత్తున మహిళ నాయకులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డికి ఘనస్వాగతం పలుకుదాం

- బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఈ నెల 19న రావాల్సిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ నెల 20న వాయిదా పడిందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్ గౌతమ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారి రాష్ట్రానికి విచ్చేస్తున్న సందర్భంగా 20న సాయంత్రం 4 గంటలకు ఆయనకు ఘనస్వాగతం పలకాలని పేర్కొన్నారు.

పౌరాణిక నాటక పద్యాల పోటీ

నవతెలంగాణ-కల్చరల్

చిమ్మపూడి ఫౌండేషన్ నిర్వహణలో నేటి రాబోయే యువతరం తెలుగు భాష సంస్కృతి పై అవగాహన కోసం పౌరాణిక నాటక పద్యాల పోటీ నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు చిమ్మపూడి శ్రీరామమూర్తి తెలిపారు. భావ రాగ యుక్తంగా రెండు పద్యాలు పాడ గలిగి వుండాలి. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు జూనియర్‌లూ ఇంటర్ నుంచి డిగ్రీ(ఏ డిగ్రీ అయిన కావొచ్చు) విద్యార్థులు సీనియర్‌గా రెండు విభాగాలలో పోటీ ఉంటుంది. రెండు విభాగాలు వారిలో ప్రథమ, ద్వితీయ శ్రేణి విజేతలకు నగదుతో పాటు జ్ఞాపిక ప్రశంసాపత్రం బహుకరిస్తారు. పది ప్రోత్సహక బహుమతులు ఉన్నాయి. పోటీలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు అందజేస్తారు. జూలై చివరి వారంలో పోటీలు జరుగుతాయి. జూలై 2 తేదీ లోపల ఆసక్తి వున్న వారు 9704177270 కు ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంట్రీలకు ఎట్టి రుసుము లేదని తెలిపారు.

వాహిని ఇనిస్టిట్యూట్‌లో యోగ డ్రాయింగ్ పెయింటింగ్ తదితర అంశాలపై శిక్షణ

నవతెలంగాణ-కల్చరల్

చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గాన సభ వద్దనున్న వాహిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నిర్వహణ లో సంగీత నృత్య అంశాలతో పాటు యోగ డ్రాయింగ్ పెయింటింగ్ చేస్ లే కాకుండా గిటార్ కీ బోర్డు తదితర ప్రక్రియలలో శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ శంకరమంచి లక్ష్మి ప్రియ తెలిపారు. ఇతర వివరాలకు 9618020133 ద్వారా తెలుసుకోవచ్చు.

బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాన్ని మార్చాలి

- రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయ నాయకులు కొండ రాజు నరసింహ చారి



నవతెలంగాణ-ముషీరాబాద్

బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాన్ని మార్చాలని, స్వర్ణకార వృత్తిదారులకు బంగారం వ్యాపారస్తులకు పోలీసు వారితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయ నాయకులు కొండ్రోజు నరసింహచారి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద స్వర్ణకారులు బంగారం వ్యాపారస్తుల మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కొండరాజు నరసింహచారి, జాతీయ ఉపాధ్యక్షులు కనెగంటి సత్యనారాయణ, బీసీ సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి, హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రిటిష్ ప్రభుత్వం స్వర్ణకారులపై ఏర్పాటు చేసిన చట్టాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్ది బంగారం వ్యాపారస్తులకు రక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణకార వృత్తిదారులకు బంగారం వ్యాపారస్తులకు అక్రమ దొంగ బంగారం కేసుల పేరుతో ఎప్పుడో బ్రిటిష్ వాళ్ళు పెట్టిన చట్టం వలన పోలీసు వాళ్ళతో చాలా రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో దొంగలు ఎక్కడైనా దొంగతనం చేసి దొరికిన యెడల ఆ యొక్క దొంగ ఆస్తులు జప్తి చేసి బాధితులకు రికవరీ ఇప్పించాలని దొంగ వద్ద ఎలాంటి ఆస్తులు లేనియెడల జీవిత కాలం జైల్‌లో ఉంచి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దొంగలు తమ జల్సాల కోసం దొంగతనాలు చేసి పోలీసు వారికి దొరికినప్పుడు స్వర్ణకారుల షాపులను చూపెట్టడం వలన స్వర్ణకారులు బంగారం వ్యాపారస్తులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మహారాష్ట్రలో చేసిన విధంగా మన రాష్ట్రంలో కూడా చట్టం చేస్తే దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. సదరు దొంగతనం చేసిన వ్యక్తి ముత్తూట్ ఫైనాన్స్, శ్రీ రామ్ ఫైనాన్స్‌లో పెట్టి విడిపించుకోవడంలేదన్నారు. ఏమీ చేయని స్వర్ణకారులపై పోలీసులు ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే బ్రిటిష్ చట్టాన్ని సరిదిద్ది రాష్ట్ర స్వర్ణకారులను రక్షించాలని కోరారు. విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇప్పించాలన్నారు. దేవ శిల్పి విశ్వ కర్మ భగవానుడు జయంతి మహెూత్సవాలు అధికారికంగా నిర్వహించి ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్య, శ్రీను శ్యాంప్రసాద్, కాలే జగన్నాథం, పట్నాల సావిత్రి సిద్ధాంతం శ్యామల తదితర నాయకులు పాల్గొన్నారు.

రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రికి జేసీఐ అక్రిడిటేషన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బర్త్‌రైట్ బై రెయిన్‌బో ఆస్పత్రి, ప్రతిష్టాత్మకమైన జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ), నుంచి గౌరవనీయమైన 'గోల్డ్ సీల్ ఆఫ్ క్వాలిటీ అప్రూవల్‌'ను మారతహళ్లి, బెంగళూరు లోని తమ హాస్పిటల్స్ కోసం అందుకున్నట్టు వెల్లడిం చింది. "రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద ఈ ముఖ్యమైన మైలురాయిని చేరుకోవడం అసాధా రణమైన ఆరోగ్య సంరక్షణను అందించడంలో మా నిరంతర అంకితభావానికి నిదర్శనం. ఇది మా బందం ఐక్యత, సమ్మిళిత బలం, నిబద్ధత, మా ఆరోగ్య సంరక్షణ నిపుణులు అందించే సున్నితమైన సం రక్షణను ప్రదర్శిస్తుంది. భద్రత, నాణ్యత గొప్ప ప్రమాణాలు అనుసరణ పట్ల పూర్తి నిబద్ధత ప్రదర్శించటంతో పాటు మా రోగుల్లో ప్రతి ఒక్కరికీ ప్రపంచ స్థాయి వైద్య సంరక్షణ అందుతుందని హామీ ఇస్తున్నాం" అని డాక్టర్ రమేష్ కంచర్ల, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు.

భారతీయ సంస్కృతిలో గురుపరంపరకు ప్రాధాన్యత



- ఎమ్మెల్సీ వాణి దేవి

నవతెలంగాణ-కల్చరల్

భారతీయ సంస్కృతిలో గురుపరంపరకు ప్రాధాన్యత ఉందని, కళను నేర్చుకున్న శిష్యులు వారి గురువును గౌరవించటం, గురువులు వారి గురువులను స్మరించటం గొప్ప సంస్కారం అని శాసన మండలి సభ్యురాలు సురభి వాణీ దేవి అన్నారు. భారత చూడామణి అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నిర్వహణలో ప్రముఖ నాట్య గురువు నెమలికంటి సువర్ణ లత తన గురువులు పద్మశ్రీ అడయార్ కె లక్ష్మణ్, వేదాంతం జగన్నాథ శర్మల సంస్మరణలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై శిష్య బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన చేశారు ముఖ్య అతిథిగా వాణీ దేవి లాంఛనంగా దీపారాధన చేసి కార్యక్రమం ఆరంభించి మాట్లాడారు. సువర్ణ లత గత ఐదు దశాబ్దాలకు పైగా కూచిపూడి నాట్యం లో వందల మందికి శిక్షణ ఇచ్చి మంచి కళాకారులుగా తీర్చి దిద్దారని అభినందించారు. కర్ణాటక సంగీత నాట్య అకాడమీ పూర్వ చైర్మెన్ వైజయంతి కాశీ మాట్లాడుతూ క్రమశిక్షణ ఏకా గ్రత దీక్ష లకు నాట్యం సాధనం అన్నారు. ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంత లక్ష్మి నర్తకి మణులను అభినందిం చారు. నాట్య ప్రదర్శనలో తొలి అంశంగా పుష్పాంజలి తో ఆరంభించి అలరింపు, జతి స్వరం ఆధ్యాత్మిక రామాయణం తదితర అంశాలు కన్నుల పండుగగా నాగ చరిత, సాహితీ లక్ష్మి దిలేశ్ జైన్‌లు నర్తించారు. గురువు సువర్ణ లత అరం గ్రేటం చేయగా శ్రీవల్లి శర్మ గత్ర సహకారం అందించారు.



ఇద్దరు సెల్ ఫోన్ దొంగల అరెస్ట్

- రెండు సెల్‌ఫోన్‌లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం..
- సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జల్సాలు కలవాటు పడి విలాసవంతమైన జీవితం కోసం దొంగతనాలను వృత్తిగా చేసుకున్న ఇద్దరు పాత నేరస్తులను అరెస్టు చేసిన సంఘటన సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తాన్ బజార్ డివిజన్ ఏసీపీ శంకర్, ఇన్ స్పెక్టర్ శ్రీనివాసచారి, డీఎస్ ఐ నరేష్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. యాకత్‌పుర ప్రాంతానికి చెందిన ఇబ్రహీం షేక్ రసూల్ ఖాన్, అబ్దుల్ అర్బాజ్ లు చిన్ననాటి స్నేహితులు జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బును సంపాదించాలనే క్రమంలో మొబైల్ ఫోన్ దొంగతనాలను, రాబరీ చేస్తూ జీవనం గడుపుతున్నారు. కాగా ఈనెల 15న వీరు చాదర్‌ఘాట్ లోని రోజ్ బేకరీ ప్రాంతంలో ఓ క్యాబ్ డ్రైవర్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను, వాలెట్‌ను దొంగిలించిఅక్కడి నుంచి పరారయ్యారు. అదేరోజు కోఠి స్టేట్ బ్యాంక్ లోని లక్ష్మీ విలాస్ బ్యాంక్ ఫుట్‌పాత్ పక్కన ఓలా క్యాబ్ డ్రైవర్ ఫోన్ మాట్లాడుతుండగా డ్రైవర్ చేతిలోని ఫోను లాక్కొని పరారయ్యాడు. దీంతో క్యాప్ డ్రైవర్ మీర్జాపురి సన్నత్ సైమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన క్రైమ్ సిబ్బంది సీసీ టీవీ ఫుటేజీలు, వివిధ కోణాలలో పరిశీలించిన అనంతరం మొబైల్ స్నాచింగ్ పాల్పడిన ఇబ్రహీం షేక్ రసూల్ ఖాన్, అబ్దుల్ అర్బాజుల్ ను మంగళవారం ఉదయం గుజరాత్ గల్లీలో చోరీ చేసిన మొబైల్ ను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా క్రైమ్ పోలీసులు వారిని పట్టుకొని విచారించగా కోఠి పరిధిలో జరిగిన చోరి కాకుండా చాదర్ ఘాట్ లో జరిగిన మొబైల్ చోరీలను గుర్తించారు. ఇద్దరి నిందితుల వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లను, ఒక వ్యాలెట్, ఒక టీవీఎస్ రైడర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులు పాత నేరస్తులు, గతంలో వీరిపై అబిడ్స్, ఫలక్ నామ, రైన్ బజార్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదైయన్నారు. వీరిని రిమాండ్ తరలించారు.

షాపుల్లోకి దూసుకెళ్లిన స్కూల్ వ్యాన్

- రెండు షాపులు ధ్వంసం



నవతెలంగాణ-అంబర్‌పేట

ఓ స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంతో రెండు షాపులు ధ్వంసమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి. లక్ష్మీకాంత్ రెడ్డి, అడ్మిన్ ఎస్సై డి. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ ప్రాంతానికి చెందిన రమణయ్య కుమారు డు జానయ్య మంగళవారం ఉదయం 3.30 గంటలకు వివిధ స్కూళ్లకు విద్యా ర్థులను చేరవేయడానికి తిలక్‌నగర్ నుంచి కోరంటి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గ మధ్యలో తిలక్‌నగర్ మహేశ్ పాన్ షాప్ పక్కన ఉన్న వెల్డింగ్, టీ షాపులోకి వేగంగా స్కూల్ వ్యాను దూసుకెళ్లింది. దాంతో రెండు షాపులు పూర్తిగా ధ్వంసమై, ఆస్తి నష్టం జరిగింది. ఆ సమయంలో స్కూల్ వ్యాన్‌లో విద్యార్థులు ఎవరూ లేకపోవడం, రెండు షాపులలో కూడా ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. బాధితుల పిర్యాదు మేరకు జానయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
బుధవారం | జూన్ 19, 2024 | www.navatelangana.com
11

బోనాల నిధులకు ఆలయాల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలి

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వివిధ అమ్మవారి దేవాలయాల నిర్వాహకులు బోనాలు నిధుల మంజురుకు వెంటనే దరఖాస్తులు అందించాలని ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ సూచించారు. ప్రతీ ఏటా బోనాలు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి దేవాలయాలకు అలంకరణ, ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసే సంప్రదాయాన్ని పాటి స్తోంది. గత సంవత్సరం నిధులు పొందిన ఆలయాల నిర్వాహకుల దరఖా స్తులను మాత్రమే స్వీకరిస్తారు. తమ ఆలయం లెటర్ హెడ్‌తో పాటు ఆలయం ఫోటో, ప్రెసిడెంట్/సెక్రటరీ ఆధార్ కార్డు జెరాక్స్, ఆలయం బ్యాంక్ అక్కౌంట్ వివరాలు, నిధుల వినియోగం వివరాలతో యుటిలైజేషన్ సర్టిఫికేట్,రెండు రెవిన్యూ స్టాంప్స్ అందచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గత సంవత్సరం పొందిన చెక్కు, జిరాక్స్ కాపీని కూడా అందించాల్సి ఉందని సూచించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ మెట్టుగూడ డివిజన్ నాయకుడు రాపోలు సురేష్ కుమారుడు రాహుల్ ఆకస్మికంగా మరణించడంతో మంగళవారం ఆయన భౌతిక కాయాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన మతిపట్ల విచారం వ్యక్తం చేసి కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలిపారు.

నీట్ పరీక్షలో
అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



- పీడీఎస్‌యూ, ఏఐడీఎస్‌ఓ, యూఎస్ఎఫ్ఐ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ
- ఓయూలో భారీ ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ

నీట్ ప్రవేశ పరీక్షలో అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ, ఏఐడీఎస్‌ఓ, యూఎస్ఎఫ్ఐ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. నీటి లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి ఉస్మానియా ఉమెన్స్ హాస్టల్ వరకు విద్యార్థులు నల్ల గుడ్డలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉస్మానియా ఉమెన్స్ హాస్టల్ ఎదుట ఎన్‌టీఏ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాలు నోటిఫికేషన్ నియమ నిబంధనల ప్రకారం ఈనెల 14న విడుదల కావాల్సి ఉండగా పరీక్షల నిర్వహణలో లోపాలు బయటకు రాకుండా ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజు ఈనెల 4వ తేదీన విడుదల చేయడం అనేక అనుమానాలకు దారితిస్తున్నాయని తెలిపారు. పరీక్షలో విద్యార్థులకు చిత్ర విచిత్రమైన మార్కులు వచ్చాయని కొంత మంది విద్యార్థులకు 718, 719 మార్కులు ఎలా వచ్చాయని ఎన్‌టీఏ ఏజెన్సీని ప్రశ్నించారు. యూజీసీ మాత్రం గ్రేస్ మార్కులు కలిపామని చేతులు దులిపెసుకునే ప్రయత్నం చేస్తూ దాటివేసే ధోరణిలో ఉందన్నారు. అలాగే గ్రేస్ మార్కులు కలపాలని నీట్ యూజీ నియమ నిబంధనలలో లేకున్నా ఎలా కలిపారని ప్రశ్నించారు. ఇప్పటికే విడుదలైన పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రంలో వరుసగా ఉన్న విద్యార్థిలకు ఒకే విధంగా మార్కులు రావడం ప్రవేశ పరీక్ష లోపాలను ఎత్తిచూపుతుందన్నదని తెలిపారు. పేపర్ లికేజీ అయిందని వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ విచారణ చేపట్టకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకునే విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని వారు వాపోయారు.

అలాగే నీట్ ప్రవేశ పరీక్షను కేవలం హిందీ, ఇంగ్లీష్‌లలో నిర్వహించడం వలన దక్షణాది రాష్ట్రాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ యూజీ పరీక్షను స్థానిక బాషలలో కూడా నిర్వహించి దక్షణాది రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీట్ యూజీ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని, అక్రమాలపై వస్తున్న ఆరోపణలను పరిగణలోకి తీసుకుని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.. కేంద్ర ప్రభుత్వం కేంద్రీకత విద్యా వ్యవస్థను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించవద్దని హెచ్చరించారు. ఇప్పటికైనా నీట్ పరీక్షలు లీకేజీపై దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా తక్షణమే స్పందించి నీట్ పై తమ వైఖరి స్పష్టం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించకుంటే, ఆందోళన కార్యక్రమం కొనసాగిస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరెడ్డి, ఏఐడీఎస్‌ఓ మల్లేష్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి నాయకులు రంజిత్ ,రాజేష్, నిఖిత్, అభిషేక, నాగరాజు, మహేష్, సూర్య ,హరీష్ రాకేష్, శ్రీనాథ్, మమత, మౌనిక స్వప్న, రజితలతోపాటుగా విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

చిలకలగుడా పార్కు అభివృద్ధికి సహకారాన్ని అందిస్తాం



- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

చిలకలగుడా పార్కు నిర్వహణ బాధ్యతలు పకడ్బందీగా చేపట్టాలని, పార్కు అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. చిలకలగుడా పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. అసోసియేషన్ నేతలు మర్పెల్లి రవి, శ్రీనివాస్ గౌడ్, చంద్ర శేఖర్, రాములు, నరసింహ రెడ్డి, శ్యాం బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పార్కు సర్వతోముఖాభివద్దికి కొత్త కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. న్యాయవాదులు గురు మూర్తి, నాగేశ్వర్ రావులు సలహాదారులుగా, మర్పల్లి రవి అధ్యక్షుడిగా, శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శిగా ఏర్పడ్డ కమిటీకి సహకరించాలని కోరారు. నూతన కమిటీ ద్వారా పార్కు అభివృద్ధికి తమ పూర్తి మద్దతు ఉంటుందని పద్మారావు గౌడ్ తెలిపారు.



నిరుద్యోగులకు మొండిచేయి ఇంకెన్నాళ్లు

- ప్రభుత్వంపై మండిపడ్డ నిరుద్యోగుల హక్కుల వేదిక నేతలు
- 20న ఇందిరా పార్క్ వద్ద నిరుద్యోగ నిరసనకు పిలుపు

నవతెలంగాణ-బంజారా హిల్స్

ఉద్యోగ నియామకాలు చేపడతామని గద్దెనెక్కిన రేవంత్ సర్కారు ఇంకెన్నాళ్లు నిరుద్యోగులకు మొండి చేయి చూపిస్తుందని నిరుద్యోగ హక్కుల కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, అశోక్, నీల వెంకటేష్, అన్వర్,సింధు రెడ్డి,రామకష్ణ తదితరులు ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో నియామకాలు చేపట్టకపోవడం వల్లే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు విద్యార్థులు కలిసి ఎన్నుకున్నారని తెలిపారు. మ్యానిఫెస్టోలో భారీ ఉద్యోగాలు చేపడతామని హామీలు ఇచ్చి నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన విషయాన్ని రేవంత్ సర్కారు మరవడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచిన ఏ ఏ శాఖలలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో ఇప్పటి వరకు లెక్కలు తేల్చకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. లక్షల్లో ఉద్యోగాలు ఖాళీగా ఉండటంతో రాష్ట్రంలో పాలన సైతం కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నియామకాల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 25న ఇందిరా పార్క్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని చెప్పారు. విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గోడ కూలిన ఘటనపై స్పందించిన అధికారులు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-బంజారాహిల్స్

అకాల వర్షానికి గోడ కూలి నలుగురికి గాయాలై ఒకరి కాలు విరిగిన ఘటనకు సంబంధించి నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారం యంత్రాంగం స్పందించింది. జూబ్లీహిల్స్ డివిజన్‌లో కురిసిన భారీ వర్షాలు వల్ల ఫిల్మ్ నగర్‌లోని లోతట్టు ప్రాంతమైన బాలిరెడ్డి నగర్‌లో భారీ వరద నీరు కారణంగా రోడ్డు మొత్తం నడవడానికి వీలు లేని విధంగా మారింది. మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి జీహెచ్ఎంసీ అధికారులు డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి, ఏఈ వెంకటేష్, జయచంద్ర, వాటర్ డిపార్ట్మెంట్ మేనేజర్ పవన్ బాలరెడ్డి నగర్ బసవ తారక బస్తీలను సందర్శించారు.

డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి మాట్లాడుతూ అతి త్వరలోనే రోడ్డు పనులను ప్రారంభిస్తామన్నారు. అంతేకాకుండా నాలాలో పేరుకుపోయిన పూడికను బుధవారం నుండే తీయిస్తామన్నారు. వాటర్ బోర్డు అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించే విధంగా కార్యాచరణ ప్రణాళిక ప్రకారమే పనులు నిర్వహిస్తామని తెలిపారు.



కురుమ ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

- కురుమ యువ చైతన్య సమితి - తెలంగాణ

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కురుమల యోధుడు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి కురుమ యువ చైతన్య సమితి - తెలంగాణ విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేందర్, అతిథిగా హాజరైన బీసీ యువజన సంఘం అధ్యక్షులు శ్యాం కురుమలు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కురుమలనూ విస్మరించరాదని, బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి కేటాయించాలని కోరారు. రాహుల్ గాంధీ బీసీ జనగణన చేపడతామని తెలిపి అటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ నూతన ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందనే పూర్తి భరోసా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందం శ్రీశైలం,బీర్ల శ్రీనివాస్, బల్లె మహేష్,కందే కృష్ణ,సిరికొండ రమేష్ కురుమాలు పాల్గొన్నారు.





యూసఫ్‌గూడలో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం యూసఫ్ గూడ డివిజన్ శ్రీనగర్ కాలనీ డివిజన్‌లలో అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. సమస్యలపై శంఖారావంలో భాగంగా కమలపురి కాలనీ సంక్షేమ సంఘంలో కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అధికారులతో నిర్వహించారు. రెండు డివిజన్‌లలోని ప్రజలు డ్రయినేజీ, వాటర్ సమస్య, కరెంటు వీధిలైట్ల సమస్యలపై, అనేక ఫిర్యాదులు చేస్తూ ఎమ్మెల్యే సమక్షంలో సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్‌కు అర్జీలు అందజేశారు. అన్ని సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్ గూడా కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్యాం కుమార్, జీహెచ్ఎంసీ ఏఈ ఎం భరత్ కుమార్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, సివిల్ సప్లై అధికారి అంజద్, ఎలక్ట్రికల్ ఏఈ నరేందర్, సాంబశివరావు, కమలాపురి కాలనీ ప్రెసిడెంట్ గోకులే, ఇతర అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వంగపల్లి శ్రీను జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్శిటీ మలిదశ తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకుడు, దళిత దండోరా ఉద్యమ రథసారథి,ఓయూలో అనేక విద్యార్థి ,సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించి అంబేద్కర్ పూలే,కాన్షీరం రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని మహనీయుల ఆశయ సాధనకోసం కృషి చేస్తూ,తన జీవితాన్ని మాదిగల అభ్యున్నతి కోసం అంకితం చేసిన నాయకుడు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీను జన్మదిన వేడుకలను మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు,రీసెర్చ్ స్కాలర్ యల్ నాగరాజు అధ్యక్షతన ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు నర్సాని రమేష్, ఎస్‌టీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు తాళ్ళ అజయ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమిడేళ్ళి తిరుమలేశు,ఆల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ జన్నారపు జీవన్,హైదరాబాద్ అధ్యక్షులు కానుగంటి సురేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ వేంపటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాబాకు బక్రీద్ శుభాకాంక్షలు



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ బాబా ఫసియుద్దీన్‌ను బోరబండ డివిజన్ నాయకులు కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమం అని తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బోరబండ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహేష్ కాసుల, నరసింహ గౌడ, ఖయ్యూం, రాజశేఖర్ రెడ్డి, దేవేందర్, లఖన్ మరియు ముత్యాల మహేష్, ఇంకా అనేకమంది యువకులు ఉన్నారు.

'ది స్కిన్ సెన్స్'లో వేవ్‌మెడ్ పిక్సీ ఆవిష్కరణ

- ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ ఊర్మిళ చౌహాన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

దక్షిణాదిలో మొట్టమొదటి అధునాతన చర్మ సంరక్షణ సాంకేతికత నిపుణత కలిగిన వైద్యురాలు అలెక్యా సింగపూర్ నిర్వహణలోని 'ది స్కిన్ సెన్స్' బంజారాహిల్స్ వేదికగా వినూత్నమైన సాంకేతికతతో రూపొందించిన 'వేవ్‌మెడ్ పిక్సీ'ని ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2023 ఊర్మిళ చౌహాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్సల్‌టెంట్ డెర్మటాలజిస్టు అలేఖ్య మాట్లాడుతూ దక్షిణాదిలోని స్కిన్‌కేర్ రంగంలో ఇలాంటి వినూత్న ప్లాస్మా టెక్నాలజీని ఆవిష్కరించడం ఇదే మొదటిసారి అని తెలిపారు.

అతిథి ఊర్మిళ చౌహాన్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనానికి చర్మ సంరక్షణ చాలా అవసరమని అన్నారు. సౌందర్య సంరక్షణలో వేవ్మెడ్ పిక్సీ(Wavemed Pixi), వంటి అధునాతన చికిత్సలు ప్రాముఖ్యతను సంతరించుకున్నయాన్నారు. వేవ్‌మెడ్ పిక్సీ అనేది నాన్-ఇన్వాసివ్ సర్జరీ భవిష్యత్‌కు నాంది పలుకుతుందని తెలిపారు.

నాన్-సర్జికల్ బ్లీఫరోప్లాస్టీ వంటి అధునాతన పద్దతులను ఇది ప్రతిబింభిస్తుందని చెప్పారు. చర్మ సంరక్షణ కోసం దక్షణ భారత్‌లోనే ఇలాంటి అత్యాధునిక సేవలు మొట్టమొదటగా తీసుకువచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. నగరంలోని తమ క్లినిక్ వేదికగా ఎల్లప్పుడూ సురక్షితమైన, అత్యాధునిక పద్దతుల్లో సేవలు అందించడమవుతుందన్నారు. ఈ టెక్నాలజీ సహకారంతో నాన్-సర్జికల్ బ్లీఫరోప్లాస్టీతో ఎలాంటి సర్జరీ లేకుండానే కనురెప్పలు సంరక్షణ, పునరుజ్జీవనానికి గానూ నాన్-ఇన్వాసివ్ సేవలందిస్తుందన్నారు. ఈ పరికరాన్ని అతి సులభంగా వినియోగించేలా ప్రత్యేక సాంకేతికతతో



ఆలంపూర్ సమీపంలోని పవిత్ర కృష్ణానది లో తన సోదరుడు తలసాని శంకర్ యాదవ్ అస్థికల నిమజ్జనం కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.

నవతెలంగాణ-బేగంపేట

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

చెట్టుకు ఉరేసుకొని ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటో డ్రైవర్ ఎరుకల లక్ష్మణ్ (34) కి, భార్య నాగమణితో 13 జూన్, 2012లో వివాహం అయింది. వారికి ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. పద్మ నగర్ ఫేస్ -2 , రింగ్ రోడ్ కుత్బుల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం తన సొంత గ్రామమైన కొల్లూర్‌కు ఆస్తి విషయమై అన్నదమ్ములు యాదయ్య, రమేష్ లతో మాట్లాడి వస్తానని చెప్పి వెళ్లినట్టు భార్య ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం లక్ష్మణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.

పేద విద్యార్థికి బుక్స్ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండర్ సారా పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. మూడో తరగతి చదువుతున్న చైతన్యకు ఆసరాగా నిలిచారు. తండ్రి పూర్తిగా వికలాంగుడు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న చైతన్య టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్ అందజేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

సర్కార్ బడుల్లో ఎకో క్లబ్‌లు

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన
- 24 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ
- కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్





నవతెలంగాణ-సిటీబ్యూరో

పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర విద్యాశాఖ సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం 'మేరి లైఫ్' పథకంలో భాగంగా ఈ ఏడాది 'పర్యావరణ దినోత్సవం-భూమి పునరుద్ధరణ' పేరుతో కార్యక్రమాలను ప్రకటించింది. ఈ మేరకు 'సమగ్ర శిక్ష' ఆధ్వర్యంలో సంయుక్త కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు వారు పర్యావరణ సంబంధిత కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు రోజువారీ కార్యకలాపాలు చేపడుతున్నారు. ఈ విషయాలపై ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

వారం రోజులపాటు కార్యక్రమాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక స్కూల్స్ 375, ప్రాథమికోన్నత స్కూల్స్ 22, ఉన్నత పాఠశాలలు 108 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 90వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం నుంచే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో పర్యావరణ కార్యక్రమాలు మొదలు పెట్టారు. ప్రతిరోజూ ఒక్కో అంశం ఆధారంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పాఠశాల, మండల స్థాయిలో పంచాయతీరాజ్, వ్యవసాయ, అటవీ శాఖ, పలు ఎన్జీవోలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి ముందుకెళ్తున్నారు. ఈ కార్యక్రమాలు 7 వర్కింగ్ డేస్‌లో నిర్వహించనున్నారు. వీలును బట్టి ప్రతి రోజూ 30 నిమిషాల నుంచి గంట పాటు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా ప్లాన్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు తెలుసుకుంటున్నారు. చేపట్టిన కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను https://merilife.nic.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఒక్కో విద్యార్థి ఒక మొక్క..

ప్రతి ఏడాదీ హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల్లో నాటిన మొక్కల అలనాపాలన చూసేవారు లేకపోవడంతో చెట్లు ఎదగడం లేదు. ఈ విషయాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిక్షణకు కసరత్తు మొదలు పెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, కాపాడేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

- ఈ నెల 15న : ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవడంపై అవగాహన...
- ఈ నెల 18న : స్థిరమైన ఆహార వ్యవస్థను అవలంభించడం
- ఈ నెల 19న: ఎలక్ట్రానిక్ వ్యర్థాలు తగ్గించడం
- ఈ నెల 20న: వ్యర్థ పదార్థాలను తగ్గించడం
- ఈ నెల 21న: ఇంధన శక్తి వనరులను సంరక్షించడం
- ఈ నెల 22న: నీటి వనరులను సంరక్షించడం
- ఈ నెల 24న: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను అరికట్టడం

విద్యార్థులకు ఎంతో ఉపయోగం..

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నాం. ఈ కార్యక్రమం గురించి ఇప్పటికే ప్రధానోపాధ్యాయులందరికీ వివరించాం. 7 వర్కింగ్ డేస్‌లో ఈ కార్యక్రమం చేపడతాం. ప్రతి పాఠశాలలో మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశాలు అందాయి.

విజయకుమారి, డీఈఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత...



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని పద్మా నగర్ ఫేస్-2 సంక్షేమ సంఘం వారు ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 131 కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేస్ - 2 సంక్షేమ సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలనీకి చెందిన పలువురు కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానందని మంగళవారం కలిసి పద్మా నగర్ ఫేస్-2 రింగ్ రోడ్డు నుంచి నగరంలోని సికింద్రాబాద్, అఫ్జల్ గంజ్, కోఠీ ప్రాంతాలకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడుతూ పద్మా నగర్ ఫేస్ - 2 రింగ్ రోడ్ నుంచి నిత్యం వేలాదిమంది కళాశాల విద్యార్థులు, ప్రయాణికులు బస్సులో ప్రయాణిస్తారు. కరోనా సమయంలో ఇక్కడ నుంచి నడిచే బస్సులను నిలిపివేశారని, బస్సులను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, కోశాధికారి సంజీవ్ కుమార్, సభ్యులు దుర్గాప్రసాద్, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, శోభన్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి
- ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలి
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి డిమాండ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ దుండిగల్ పీహెచ్‌సీ(PHC)సమావేశం బి.లింగస్వామి అధ్యక్షతన షాపూర్ నగర్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో పీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నెలనెల వేతనాలు రాక ఎప్పుడు వస్తాయో ఎదురు చూడటం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులకు గురికావలసి వస్తుందని రాష్ట్రంలో సుమారు 30 వేల మంది ఆశా వర్కర్లు ఉన్నారు. గత 18 సంవత్సరాల నుంచి ఎన్‌హెచ్‌ఎం స్కీం ద్వారా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులు ఉన్నారు. ఇప్పటివరకు వీరికి కనీసం ఫిక్స్ వేతనం కూడా ప్రభుత్వం నిర్ణయించలేదు. పిఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు లేవు. ఈ పరిస్థితులలో ఒక కుటుంబం బతకాలంటే కనీసం రూ.26 వేలు ఉంటే సాధ్యమవుతుందని లెక్కలు చెబుతున్నాయి కానీ, ప్రభుత్వాలు ఈ అంశాన్ని పరిశీలించి పరిష్కరించడంలో విఫలమైనాయని ఆమె అన్నారు. ఆశా వర్కర్స్ సంఘటితంగా ఉండి, తమ హక్కుల కోసం పోరాడుతూ ఉంటే కొంతమంది ఆశా వర్కర్ల యూనియన్ల ముసుగులో కార్మికుల ఐక్యతను దెబ్బతీసే విధంగా కార్మికుల్ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, దుండిగల్ పీహెచ్‌సీ హంస, పద్మ, విజయ, సునీత, లక్ష్మి, రేణుక, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ బకాసురుడి పై ఉక్కు పాదం మోపాలి



- రెవిన్యూ మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రభుత్వ భూములను హారతి కర్పూరంలా మింగేస్తున్న భూబాకాసుడిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని జగద్గిరిగుట్ట డివిజన్ కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ కు చెందిన బాలక్రిష్ణ అనే వ్యక్తి గత కొన్ని ఏండ్లుగా సర్వే నెం.348/1గల పరికి చెరువు, మిగితా ఖాళీ స్థలాలను కబ్జాచేసుకున్నాడు. సుమరు 5 వందల కోట్లు ప్రభుత్వ స్థలాన్ని పేదప్రజలకు ఎలాంటి అనుమతి లేకుండా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడని ప్రభుత్వం సదరు భూ బకాసురుడిపై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వి.గణేష్,కో ఆర్డినేటర్ కే.నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్,కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ చారీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.



అమృత వల్లికి అంతర్జాతీయ పురస్కారం



నవతెలంగాణ-కల్చరల్

మన సంస్కృతి నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలలో ఆరుసార్లు తెలుగు భాషలో ప్రథమ విజేతగా నిలిచిన అమృత వల్లి అంతర్జాతీయ స్థాయిలో పురస్కారం అందుకున్నారు. కౌలాలంపూర్‌లోని టాన్ శ్రీ దాట్ కె అర్ సామా ఆడిటోరియంలో యునైటెడ్ హెరిటేజ్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో అమృత వల్లినీ మలేసియా యూనిట్ డిప్యూటీ మినిస్టర్ సరస్వతి కంద స్వామి పురస్కారంతో సత్కరించి మాట్లాడారు. మాతృ భాషను నిర్లక్ష్యం చేస్తున్న నేటి తరంలో అమృత వల్లి చిన్న వయస్సులోనే తన మాతృ భాష తెలుగులో పలు పర్యాయాలు ప్రథమ స్థానంలో పోటీలలో గెలు పొందటం విశేషం అన్నారు. అమృత వల్లి చదువుకొనే విద్యాలయం ప్రకాష్ పాఠశాల యాజమాన్యంకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ నిర్వాహకులు రామచంద్ర పవన్ పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలి



- బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి
- ప్రజాసంఘాల డిమాండ్

నవతెలంగాణ-బాలానగర్

మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా వారికి మాత్రం రక్షణ లేకుండా పోతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి చైతన్య రెడ్డి, ఐద్వా మండల కార్యదర్శి వి. కరుణ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో రైస్ మిల్లు డ్రైవర్ బలరాం తల్లితో పాటు నిద్రిస్తున్న ఆరేండ్ల బాలికను ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడి హతమార్చాడు. ఆ మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రస్తుతం మహిళల పై, బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, చట్టాలపై భయం ఉంటేనే వేధింపులకు కళ్లెం వేయగల మని అశ్లీల వెబ్ సైట్లు, వీడియోలతో యువత చెడు అలవాట్లకు పాల్పడుతున్నారని పెర్కొన్నారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్పందించి, ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తిక్, ఐద్వా మండల అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి సుగుణ, సీఐటీయూ నాయకులు పి.శంకర్, సతీష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని న్యూ గౌతమ్ నగర్‌లో స్థానిక నివాసితులు గత కొద్దిరోజులుగా డ్రయినేజీ సమస్య ఉందని మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కార్పొరేటర్ సతీష్ గౌడ్ జలమండలి మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి గౌతమ్ నగర్‌లో పర్యటించారు. పర్యటనలో భాగంగా బస్తీలో డ్రయినేజీ నీరు వెళ్లేందుకు పైపులైన్ సరిగ్గా లేకపోవడం వల్ల డ్రయినేజీ లైన్ లీక్ అవుతుందని గమనించి జలమండలి మేనేజర్ అనిల్‌కు వెంటనే టర్నింగ్‌లో యు పైప్ లైన్ వేసి సమస్యని పరిష్కరించాలని జలమండలి మేనేజర్ అనిల్ కుమార్ ను కార్పొరేటర్ ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించి, సమస్యను పరిష్కరిస్తారని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా బస్తీలలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే సమస్య పరిష్కరిస్తానని ఆయన బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అంజయ్య, సురేష్ గౌడ్, గోపాల్, సురేందర్ నాయుడు, వీరేశం గుప్తా పాల్గొన్నారు.

పెయింటింగ్ కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ పెయింటింగ్ అసోసియేషన్ సభ్యులతో మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్న సమయంలో, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేయొద్దని కార్మికులకు సూచిస్తూ జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేస్తుండగా ఏదైనా జరిగితే మీ కుటుంబం రోడ్డున పడుతారని, ఎత్తైన ప్రదేశాలలో పనిచేసేటప్పుడు, భద్రతా పరికరాలు వాడాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కొరకు ఎన్నో పథకాలను తీసుకొచ్చిందని అందులో, భారత పోస్ట్ ఆఫీస్ వారు రూపాయలు 735 తో రెండు లక్షల మూడు వందల తొంబై తొమ్మిది రూపాయల ప్రమాద బీమా అందిస్తున్నారని, అందరూ తప్పకుండా ఆ బీమా చేయించుకుంటే ఆపద సమయాల్లో, ఆదుకుంటుందని.అసోసియేషన్ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ రాష్ట్ర నాయకులు మల్లేష్ గౌడ్, జిల్లా నాయకులు కిషోర్, జిల్లా భవన నిర్మాణ కార్మికుల సెల్ పోరెడ్డి యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైంది..





- టీజీఎస్ ఆర్టీసీ ఆర్ఎం.కవిత రూపాల
- కూకట్‌పల్లిలో పలు బస్సు స్టాప్‌ల పరిశీలన

నవతెలంగాణ-కూకట్‌పల్లి

పాఠశాలలు, కళాశాలలు, పునఃప్రారంభం కావడం వల్ల, రద్దీ సమయాల్లో, క్రష్ రోడ్లు పెరిగే దృష్ట్యా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ప్రయాణికులు ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, మహిళా ప్రయాణికులు బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు భద్రతా నియమాలను పాటించాలని కూకట్ పల్లి డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత రుపాల తెలిపారు. భద్రతా నియమాలను పాటించాలి. టిజీఎస్ ఆర్టీసీతో తమ ప్రయాణాన్ని నమ్మకమైన , సురక్షితమైన యాత్రగా మార్చుకోవాలన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు బస్టాప్‌లో ఆమె పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంతో పాటుగా కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇసాక్ పాల్గొన్నారు. టీజీఎస్ ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్‌లో ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు.

ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ముఖ్యమైన బస్టాప్‌లో, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ల టీమ్‌ని మోహరించారు. బస్ స్టాప్‌లో బస్సులు ప్రవేశించి, వెళ్లిపోయే వరకు, డ్రైవర్లు, కండక్టర్ల ప్రవర్తనను పర్యవేక్షించడానికి. ఎస్‌డీఐల బృందం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా దిగడం, ఎక్కించడం కోసం అన్ని చర్యలు తీసుకుంటుందని రీజినల్ మేనేజర్ తెలిపారు. అంతే కాకుండా ప్రయాణికులందరూ సురక్షితంగా ఎక్కినట్టు నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే బస్సును తరలించాలని, ప్రయాణికులు ఫుట్ బోర్డు ప్రయాణంలో ఎవరూ లేరని నిర్ధారించుకోవాలని డ్రైవర్లకు సూచించారు. బస్టాపుల్లో అన్ని బస్సులు ఆగుతున్నాయని, ఏ బస్సు కూడా స్టేజీని దాటలేదని ఎస్‌డీఐ నిర్ధారిస్తారని, ప్రారంభంలో బోయిన్ పల్లి, బాలానగర్, గండి మైసమ్మ రూట్లలో సెకండ షిఫ్ట్‌లో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు చెప్పారు. అలాగే వివిధ రూట్లలో ఒక వారం రోజుల పాటు, ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడం వలన రద్దీ సమయాల్లో, క్రష్ లోడ్లు పెరిగే దృష్ట్యా పైన పేర్కొన్న ప్రత్యేక డ్రైవ్ చేపట్టబడిందని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. ప్రయాణికులు ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, మహిళా ప్రయాణికులు బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు భద్రతా నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేసింది.

ప్రయాణీకులు కొన్ని భద్రతా చర్యలను గమనించాలని పలు రీజనల్ మేనేజర్ కవిత రూపాల సూచించారు.

1, బస్ స్టాప్‌లో మాత్రమే నిలబడి బస్సులో సీటు పొందే ప్రయత్నంలో కదులుతున్న బస్సులో ఎక్కేందుకు ప్రయత్నించే, బస్టాప్ ముందు, మలుపుల వద్ద నిలబడకుండా ఉండాలన్నారు. ఇది ప్రయాణీకులకు చాలా ప్రమాదకరం అని, బస్ స్టాప్ లేదా బస్ బేలో ప్రయత్నించడం డ్రైవ్ చేయడానికి కూడా ఆటంకం కలిగిస్తుంది. 2. బస్సు బస్ బే లేదా బస్ స్టాప్ లోకి ప్రవేశించే వరకు ఆగాలి. 3. బస్ స్టాప్‌లోకి ప్రవేశించి బస్సును ఆపడానికి డ్రైవర్‌కు సమయం ఇవ్వండి. 4. బస్సు దిగే ప్రయాణీకులకు దారి ఇవ్వాలని దిగేవారు దిగిన తర్వాత మాత్రమే ఎక్కేవారు ఎక్కాలి. 5. ఇప్పటికే పూర్తి స్టాండింగ్ కెపాసిటీతో నడుపుతున్న బస్సులో మెట్ల వరకు ఎక్కకూడదని అంటే ఫుట్ బోర్డ్ ప్రయాణాన్ని నివారించాలి. 6. కదులుతున్న బస్సు ఎక్కే ప్రయత్నం అలాగే నడుస్తున్న లేదా కదిలే బస్సు నుంచి దిగొద్దు 7. దిగే ముందు బస్సు పూర్తిగా ఆగిన తరువాత దిగాలి. 8. ప్రయాణీకులు దిగే ముందు బస్సు కదిలి ఉంటే కండక్టర్ లేదా డ్రైవర్‌ను బస్సును ఆపాలని కోరి బస్సు ఆగిన తర్వాత మాత్రమే దిగాలి. 9. సురక్షితమైన ప్రయాణాన్ని నిర్ధారించడం కోసం బస్సులోని డ్రైవర్లు, కండక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

సంగీతమే ఆమె ప్రియనేస్తం..

సంగీతం ఆమె ప్రపంచం. మనసు కలత చెందినపుడు ఆ సంగీతమే ఆమెకు ప్రియనేస్తం. కొత్త ఊపిరి పోసే అమృతం. పుట్టింట సంగీతం సాహిత్యం పెనవేసుకున్న అందమైన పొదరిల్లు. అలాంటి చోట పుట్టి... వైవాహిక జీవితంలో కొన్ని ఒడుదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది. ఆ సమస్యల నుండి బయటపడేందుకు సంగీతమే ఆమెకు ఔషధమయింది. ఇలా సంగీతంలోనే సేదతీరుతున్న ప్రముఖ గాయనీమణి **నండూరి విజయసుమిత్ర**. ఆమె పరిచయం ఆమె మాటల్లోనే చదవండి...



నా చిన్నతనంలో నన్ను కర్ణాటక సంగీతం వైపు మరలించినవారు మా నాన్న. ఆయన పట్టుదల వల్లే కర్ణాటక సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా ప్రోత్సహించేవారు. నా తల్లితండ్రులు నన్ను ఓ ఎమ్మెస్ సుబ్బలక్ష్మిలా, ఓ పి. సుశీలలా చూడాలని ఎన్నో కలలు కనేవారు. పెద్ద గాయని కావాలని నిరంతరం తపించేవారు. అందుకే సంగీతం నేర్పిస్తూ కచేరీలకు కూడా నన్ను తీసుకెళ్ళేవారు. అయితే పెండ్లి తర్వాత వాటన్నింటికి తాళం పడిపోయింది. నా భర్త నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదు. కేవలం ఇంట్లోనే అప్పుడప్పుడు పాడుకుంటూ ఉండేదాన్ని.

ఇంటికే పరిమితమై...

పెండ్లి తర్వాత ఆయన ఉద్యోగరీత్యా మేము మద్రాసు, నెల్లూరు, హైదరాబాదులో కొంత కాలం కలిసి జీవించాం. ఆ సమయంలో ఇంటికే పరిమితమై ఆధ్యాత్మిక జీవితం గడిపాల్సి వచ్చింది. ప్రస్తుతం నా భర్త లేరు. కొన్నాళ్ళకు విజయవాడ వచ్చేసాను. సంగీతం విషయంలో నా అక్క చెల్లెలు, తల్లిదండ్రులు తప్ప ఎవ్వరూ నన్ను ప్రోత్సహించలేదు. కర్ణాటక సంగీతంలో నేను పెద్ద స్థాయిలో ఎదగాలని కోరుకున్న వాళ్ళ వీరే. ఇక సంగీతంలో నాకు గురువులుగా ఉండి ప్రోత్సహించిన వారు శ్రీ పి.సూర్యారావు, శ్రీమతి రామ కుమారి, శ్రీ అన్నవరపు రామస్వామి. అలాగే శ్రీ టి.ఎం.త్యాగరాజన్, శ్రీ కేవీ నారాయణస్వామి, శ్రీ బి. రాజం అయ్యారు. వీరంతా సంగీతంలో నాకు సమగ్రమైన అవగాహన వచ్చేలా చేశారు. వైలెన్ నేర్చుకున్నప్పుడు శ్రీ టి.ఎస్ కృష్ణన్ ఎన్నో మెళకువలు తెలిపారు.

డ్రామా ఆర్టిస్ట్‌గా...

నా వ్యక్తిగత జీవితంలోకి వస్తే నాకు ఒక బాబు. అతను ప్రస్తుతం ఎంబీబీఎస్ పూర్తి చేసి హైదరాబాదులోని ఇవియా హాస్పిటల్లో జనరల్ ఫిజీషియన్‌గా వర్క్ చేస్తున్నాడు. అతనికి పెండ్లై ఓ కూతురు ఉంది. పెండ్లి తర్వాత చాలా కాలం తర్వాత తిరిగి నా సంగీత జీవితాన్ని ప్రారంభించాను. ఆలిండియా రేడియోలో డ్రామా ఆర్టిస్ట్‌గా కొంత కాలం పని చేశాను. ఆ సమయంలో నండూరి సుబ్బారావు, సి.రామ్మోహన్ రావు, యోగానంద, పద్మజా నిర్మల, సరోజ నెమలి నన్నెంతో ప్రోత్సహించారు. అప్పట్లో లలిత సంగీత విభాగంలో మోదుమూడి సుధాకర్ ఉండేవారు. ఆయన మాకు బంధువు. ఈయన ప్రోత్సాహంతో రేడియోలో చాలా లలిత సంగీత కార్యక్రమాలు చేశాను. అలాగే అవుట్‌సైడ్ కన్నడ సంగీత కచేరీలు కూడా చేశాను.

క్యాజువల్ ఆర్టిస్ట్‌గా...

కొంత కాలం స్కూల్లో ఉద్యోగం చేశాను. అది క్రిస్టియన్స్ పాఠశాల కావడంతో వెస్టన్ మ్యూజిక్ గురించి కొంత అవగాహన వచ్చింది. అలాగే క్యాషియో కొంత నేర్చుకొని పిల్లలను కూడా ప్రోత్సహించేదాన్ని.





నా చిన్నతనంలో విజయవాడ, మద్రాసులో కూడా కొన్ని కచేరీలు చేశాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తం ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని పాటలు పాడాను. లలిత సంగీతంతో పాటు సినిమా పాటలు కూడా అప్పుడప్పుడు పాడేదాన్ని. విజయవాడ ఆల్ ఇండియా రేడియోలో క్యాజువల్ ఆర్టిస్టుగా కూడా చేశాను. అలాగే హైదరాబాదులో కూడా క్యాజువల్ ఆర్టిస్ట్‌గా ఉన్నాను. నేను ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీఏ మ్యూజిక్ చేశాను. మద్రాస్ గవర్నమెంట్ కాలేజ్ నుంచి సంగీత టైటిల్ కోర్సు పాస్ అయ్యాను.

తల్లి దండ్రుల ప్రోత్సాహంతోనే...

సెయింట్ జోన్స్ సెకండరీ హై స్కూల్ గన్నవరంలో, సింగరేణి కాలరీస్ గోల్డ్ హైస్కూల్లో కూచిపూడి ఆర్ట్ అకాడమీలో చాలా కాలం పని చేశాను. అలాగే విజయవాడలోని ప్రభుత్వ సంగీత కళాశాలలో ఐదేండ్లు విద్యనభ్యసించి డిప్లమా పూర్తి చేశాను. తెలుగు యూనివర్సిటీ తరపున అక్కడ డ్యాన్సులతో పాటు అన్ని కార్యక్రమాలకు పాటనే కాకుండా, మ్యూజిక్ నేర్పుతూ ఉండేదాన్ని. ఒకసారి సింగపూర్ కూడా వెళ్ళి కచేరీలో పాల్గొని వచ్చాను. ఆనాడు నా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఇప్పటి వరకు నా జీవితం సంగీతంతోనే కొనసాగుతోంది. ఏది ఏమైనా మధ్యలో చాలా ఏండ్లు ఖాళీగా ఉండాల్సి వచ్చింది. అయినా తిరిగి నా సంగీత ప్రపంచంలోకి వచ్చేశాను. చాలా సంతోషంగా ఉంది.

- అచ్యుతుని రాజ్యశ్రీ





కారణాలివే...

ప్రీ-మెనోపాజ్‌కు చాలా కారణాలున్నాయి. 45 -55 సంవత్సరాల మధ్య వయస్సులో మహిళల అండాశయ ఉత్పత్తి ఆగిపోతుంది. ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గడలే దీనికి కారణం.



పునరుత్పత్తి చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడే హార్మోన్ ఈస్ట్రోజెన్. సాధారణంగా చిన్న వయసులోనే పీరియడ్స్ ఆగిపోవడాన్ని "ప్రీ-మెనోపాజ్" అంటారు. ఈ కాలంలో, మహిళలు గర్భవతి అయ్యే అవకాశాలు చాలా తక్కువ. ప్రీ-మెనోపాజ్ సమస్య జీవనశైలి లో మార్పులు, ఆహారపు అలవాట్లకు సంబంధించిన సమస్య అని గైనకాలజిస్టులు చెబుతున్నారు.

ప్రీ-మెనోపాజ్‌కి కారణాలు..?

అండాశయంలో శస్త్రచికిత్స, ఏదైనా వ్యాధికి ఇచ్చే రేడియేషన్, అతిగా మద్యం సేవించడం, ధూమపానం, కీమోథెరపీ, వంశ పారంపర్యంగా కూడా ప్రీ-మెనోపాజ్ తలెత్తడానికి కారణాలని నిపుణులు చెబుతున్నారు. ఇవే కాకుండా, కొన్ని ఆటో ఇమ్యూన్ పరిస్థితులు లేదా ఆటో ఇమ్యూన్ సిండ్రోమ్‌లు ఆడవారిలో సర్వసాధారణంగా ఉంటాయి. దీని కారణంగా పీరియడ్స్ సడెన్ గా ఆగిపోతాయి.

లక్షణాలు.. ఎలా ఉంటాయి..?

ప్రీ-మెనోపాజ్ సమయంలో మహిళలకు చిరాకు, యోనిలో దురద, రొమ్ముల్లో వాపు, అధిక వేడి, రొమ్ములలో తేలికపాటి నొప్పి, లైంగిక కోరిక కోల్పోవడం, మానసిక సమస్య, ఎక్కువగా చెమటలు పట్టడం వంటి సమస్యలు కనిపిస్తాయి. అంతేకాదు పని చేయకపోయినా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంటుంది. అయితే, ఈ లక్షణాలు మెనోపాజ్‌కు 6-7 నెలల ముందు కనిపిస్తాయి.

ఆరోగ్యకరమైన ఆహారం..

మహిళలు తమ ఆహారంలో పోషకాహారాన్ని చేర్చుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ముఖ్యంగా క్యాల్షియం, విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎందుకంటే మెనోపాజ్ తర్వాత మహిళల్లో బోలు ఎముకల వ్యాధి ముప్పు పెరుగుతుంది.

వ్యాయామం..

మంచి నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటివి మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడతాయి. మెనోపాజ్ కారణంగా బరువు కూడా వేగంగా పెరుగుతారు. వ్యాయామం చేస్తే బరువును నియంత్రించవచ్చు.

ఈ ఆహారానికి దూరంగా ఉండండి..

కెఫిన్, ఆల్కహాల్ , స్పైసీ ఫుడ్ తీసుకోవడం తగ్గించుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల మెనోపాజ్ సమయంలో అధికంగా వేడి చేస్తుంది. ఎందుకంటే ఈ ఆహారాలు మెనోపాజ్ సమయంలో సంభవించే 'హీట్ ఫ్లాషెస్'ని ప్రోత్సహిస్తాయి.

పుష్కలంగా నీరు తాగాలి..

మెనోపాజ్ కారణంగా మహిళల్లో చర్మం, జుట్టు, గోర్లు పొడిగా మారుతాయి. ఈ సమస్యలను నివారించడానికి తగినంత నీరు తీసుకోవాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. ప్రీ-మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తే కచ్చితంగా వైద్యులను సంప్రదించాలి. ■

ఆధునికంగా ఐటీఐలు

(మొదటిపేజి తరువాయి)

విద్యార్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "మేం పాలకులం కాదు... సేవకులం అనే విషయాన్ని మర్చిపోవడం లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నిరుద్యోగ సమస్య అత్యంత కీలక పాత్ర పోషించింది... నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది" అని మరోమారు స్పష్టం చేశారు.

టాటా భాగస్వామ్యంతో ఏటీసీ ప్రాజెక్ట్

రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో పదేండ్లకుగానూ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చు కుంది. ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఈ కేంద్రాల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమించనున్నది. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘకాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్పకాలిక (షార్ట్ టర్మ్) కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. పదేండ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేండ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74). ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి.

కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ బృందంతో రేవంత్ భేటీ

(మొదటిపేజి తరువాయి)

అయ్యింది. హైదరాబాద్ గ్లోబల్ సిటీ వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాల్లో విస్తరిస్తున్న తీరుపై ఈ భేటీలో చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ దేశంలోనే శరవేగంగా వృద్ధి చెందుతోందని కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం ఈ సందర్భంగా తమ అధ్యయన వివరాలను పంచుకుంది. గడిచిన ఆరు నెలల్లో రియల్టీతో పాటు లీజింగ్, ఆఫీస్ స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ హైదరాబాద్ సిటీ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందని అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకోసారి వెల్లడించే తమ నివేదిక జులై నెలాఖరులో వెలువడుతుందని తెలిపింది. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతోపాటు హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమని పునరుద్ఘాటించారు. తెలంగాణ నుంచి అమెరికాలో ఉంటున్న వారి సంఖ్య, అక్కడి వెళ్లి వచ్చే వారి సంఖ్య పెరిగిపోయిందనీ, అందుకే న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

'పీఎం కిసాన్' నిధులు విడుదల

(మొదటిపేజి తరువాయి)

చేశారు. దీంతో దాదాపు 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున రూ.20 వేల కోట్ల నగదు జమకానుంది. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించిన మోడీ వారణాసిలో పర్యటించడం ఇదే తొలిసారి.

వర్షాల నేపథ్యంలో వ్యాధులు పెరిగే ప్రమాదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో వ్యాధులు కూడా ప్రబలే ప్రమాదముందని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ బి.రవీందర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణంలో తేమ శాతం పెరగడంతో వైరల్ ఇన్ఫెక్షన్లు, దోమలు, ఆహార, నీటి సంబంధిత వ్యాధులు పెరిగే ప్రమాదముందని తెలిపారు.

మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర దోమల ద్వారా వచ్చే వ్యాధుల బారిన పడకుండా దోమతెరలు, స్క్రీన్‌లు ఉపయోగించాలని సూచించారు. దోమలు పెరిగేందుకు ఎక్కువగా అవకాశమున్న ఉదయం, సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు సరిగ్గా మూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు తేలిక రంగులతో కూడిన దుస్తులను వేయాలనీ, అవి కూడా చేతులను, కాళ్లను పూర్తిగా కవర్ చేసేలా చూసుకోవాలని పేర్కొన్నారు. బయటికి వెళ్లే సమయంలో మస్కిటో రిపెల్లెంట్ క్రీములను ఉపయోగించాలని సూచించారు.

"వర్షాకాలంలో నీటి సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశముంది. బయటి నీరు తాగకుండా ఇంట్లో కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలి. భోజనానికి ముందు, తర్వాత, వాష్ రూం ఉపయోగించునే సమయంలో తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలి. బయటి ఆహారాన్ని తీసుకోవద్దు. ముఖ్యంగా సగం కోసినవి, కవర్ చేయని వాటి జోలికి వెళ్లొద్దు ..." అని రవీందర్ నాయక్ సూచించారు. తద్వారా జాండీస్, టైఫాయిడ్ బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చని తెలిపారు.

" వర్షాకాలంలో వైరల్ ఫీవర్లు కూడా ప్రజలను పెద్ద ఎత్తున ఇబ్బంది పెడుతుంటాయి. అనారోగ్యంతో ఉన్నవారితో చేతులు కలపడం, ఆహారం, నీరు, దుస్తులు పంచుకోవడం లాంటివి చేయకూడదు. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలి. తుమ్మినా, దగ్గినా ఇతరులు ఇన్ఫెక్షన్ బారిన పడకుండా మూతిని కవర్ చేసుకోవాలి. దగ్గు, జలుబు ఉంటే డిస్పోజబుల్ టిష్యూలను ఉపయోగించుకోవాలి. ఒక వేళ జ్వరంతో పాటు దగ్గు, తలనొప్పి, గొంతునొప్పి, ఒళ్లు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రులను సంప్రదించాలి. అత్యవసరమైతే 108 అంబులెన్స్‌కు కాల్ చేయాలి." అని డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఆయా వ్యాధుల బారిన పడితే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగ్గించేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసిందని డాక్టర్ బి.రవీందర్ నాయక్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లు, ఐవీ ఫ్లూయిడ్లు, అత్యవసర మందులు, అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఉపయోగించుకునేందుకు ఏఎన్ఎం, ఆశాలు, అంగన్ వాడీలకు ఓఆర్ఎస్ సాచెట్లను పంపిణీ చేసినట్టు వెల్లడించారు.

20 శాతం మించకుండా బదిలీలు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఉద్యోగులు, డాక్టర్ల బదిలీల్లో 20 శాతం మించకుండా చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని వైద్యవిద్య సంచాలకుల కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఉస్మానియా యూనిట్ (2024-26) అధ్యక్షులు డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.రంగా, కోశాధికారి డాక్టర్ టి.శంకర్ సింగ్, జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పి.ప్రవీణ్, డాక్టర్ బి.రమేశ్, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. 20 శాతానికి మించి అనుమతిస్తే అత్యవసర సేవలు, రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు అనుభవజ్ఞులైన డాక్టర్లు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చేసిన బదిలీలు కూడా 20 శాతానికి మించి చేయలేదని గుర్తుచేశారు. గతంలో ఇచ్చినట్టుగానే ఉద్యోగ సంఘం సభ్యులకు బదిలీల నుంచి ఖచ్చితంగా మినహాయింపునివ్వాలని కోరారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం తమదేననీ, వేరే ఇతర గుర్తింపు లేని సంఘం డీఎంఈ ద్వారా సిఫారసు చేయించుకుంటున్నట్టు తెలుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బదిలీల పేరుతో లక్షలాది రూపాయల వసూళ్లు చేస్తున్నారనీ, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమపై అనవసర ప్రచారం మానుకోవాలనీ, ఆర్థికశాఖ ఇచ్చే ఉత్తర్వుల అమలుకు తాము సహకరిస్తామని స్పష్టం చేశారు. అడిషనల్ డీఎంఈ, ఇతర పదోన్నతులు చేపట్టిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేయాలని సూచించారు.

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కొత్త వైద్యకళాశాలల్లో పని చేసే డాక్టర్లకు 30 శాతం నుంచి 50 శాతం అదనంగా వారి బేసిక్ పేపై అలవెన్స్ ఇస్తూ జీవో జారీ చేయాలని కోరారు. గతంలో డాక్టర్లకు ఇచ్చిచన ట్రాన్స్ పోర్ట్ అలవెన్స్, ఈఎల్ సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అలవెన్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఏ ప్రభుత్వ వైద్యులైన స్వచ్ఛంద పదవీ విరమణ కోరుకుంటే వారికి వెంటనే అనుమతితో పాటు అన్ని రకాల ప్రతిఫలాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యారోగ్యశాఖలో ప్రక్షాళన

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. గర్భిణీలు, బాలింతలకు మరింత ఉపయోగపడే విధంగా కేసీఆర్ కిట్‌లో మార్పులుంటాయని చెప్పారు. ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ లక్ష్యంగా కొత్తగా 75 ట్రామా కేర్ సెంటర్లు నెలకొల్పనున్నట్టు తెలిపారు. ప్రభుత్వాస్పత్రులను, రోగ నిర్ధారణ కేంద్రాలకు అనుసంధానించడం ద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు.

అవసరం లేకుండా మెడికల్ కాలేజీల ఏర్పాటు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాంతాల వారీగా సర్వే చేయకుండా అవసరం లేకపోయినా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఇచ్చిందని మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శించారు. దీంతో ఆ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వైద్య వృత్తి నెమ్మదిగా పెరగాల్సిన వృత్తి అని ఆయన అభిప్రాయపడ్డారు. అలా కాకుండా మాజీ సీఎం కేసీఆరే డాక్టర్ అయ్యాడనీ, ఆయనే ఇంజినీర్ అయ్యాడని ఎద్దేవా చేశారు. కరోనాకు పారాసిటామల్‌ను సిఫారసు చేసిన కేసీఆర్, కాళేశ్వరానికి డిజైన్ చేసేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం కోసమంటూ గత ప్రభుత్వం రూ.9 వేల కోట్లరూపాయలను రుణంగా తీసుకున్నదని చెప్పారు. వాటిని 21 అంతస్థుల నుంచి 14 అంతస్థులకు తగ్గించారని తెలిపారు. ప్రజలకు వైద్యరంగం మరింత మెరుగైన సేవలందించేలా రెగ్యులేటరీ పవర్స్ అమలు చేయనున్నట్టు తెలిపారు.

నీట్ వివాదంపై మౌనంగా ఎందుకున్నారు?

(మొదటిపేజి తరువాయి)

ఆందోళన చేస్తున్నా ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో మౌనం వహిస్తున్న ప్రధానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తమ గళాన్ని వినిపిస్తుందని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా బలమైన విధానాల రూపకల్పనకు పార్లమెంటు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆ కూటమి పాలిత రాష్ట్రాలైన బీహార్, గుజరాత్, హరియాణాల్లో జరిగిన అరెస్టులు పరీక్షలో అవినీతి జరిగిందని రుజువు చేస్తున్నాయని చెప్పారు. నీట్ పరీక్షలో 24లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు తారుమారైనా మోడీ ఏమీ పట్టనట్టు ఎప్పటిలాగే మౌనం వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు పేపర్ లీకేజీకి కేంద్రంగా మారాయని మండిపడ్డారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేపర్ లీకేజీలు కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందన్న అంశాన్ని గుర్తు చేశారు.

నీట్ రద్దుకు.. కదం తొక్కిన విద్యార్థులు

(మొదటిపేజి తరువాయి)

నీట్ పరీక్ష నిర్వహించిన ఏజెన్సీ ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని, పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ వై-జంక్షన్ నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తోపాటు విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొని ప్రసంగించారు.

దేశంలో నీట్ పరీక్ష మే 5న జరిగిందని.. అంతకంటే ముందే బీహార్‌లో పేపర్‌ను రూ.30 లక్షల నుంచి 50 లక్షల వరకు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానాలో హిందీ మీడియం బదులుగా ఇంగ్లీషు మీడియం పేపర్ ఇచ్చారనే పేరుతో విద్యార్థులు బయటకు వస్తే పరీక్ష ఆలస్యంగా జరిగిందనే కారణంగా గ్రేస్ టైమ్ అంటూ మార్కులు ఇచ్చారని, గుజరాత్‌లో పేపర్‌ను రూ.10లక్షలకు అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ నిర్లక్ష్యం.. తప్పులకు విద్యార్థులను శిక్షించడం తగదన్నారు. గ్రేస్ మార్కులు పొందిన 1563 మంది విద్యార్థుల మార్కులు రద్దు చేసి వారికి మాత్రమే రీ-ఎగ్జామ్ నిర్వహిస్తామని సుప్రీంకోర్టుకు చెప్పడం అంటే తప్పించుకోవడమేనన్నారు. అవకతవకలకు పాల్పడిన, పేపర్ అమ్ముకున్న ఎన్‌టీఏ చైర్మెన్, డైరెక్టర్ల పాత్రపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌టీఏను రద్దు చేసి తిరిగి ఆయా రాష్ట్రాలు పరీక్ష నిర్వహించుకునే వెసులుబాటు ఇవ్వాలని కోరారు. కేంద్ర మంత్రులు దీనిపై స్పందించడం లేదని, పరీక్షా పే చర్చ అనే మోడీ.. పరీక్షలు, పేపర్ లీకేజీలపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖ మంత్రే రెండుచోట్ల అవకతవకలు జరిగాయని ఒప్పుకున్న తర్వాత ప్రధాని మౌనం పాటించడం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న రాజకీయ పాత్రపైనా.. బీజేపీ నాయకులకు చెందిన కన్సల్టెన్సీ యాజమాన్యాలపైనా విచారణ జరిపి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఈ సమస్యపై మాట్లాడకుంటే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

స్టూడెంట్ మార్చ్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్, వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్, పీడీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పరుశురాం, మహేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, విద్యార్థి నేతలు ఎస్.రజనీకాంత్, ఎం.మమత, డి.కిరణ్, కె.అశోక్ రెడ్డి, బి.శంకర్, లెనిన్, రమ్య, ప్రణయ్,(ఎస్ఎఫ్ఐ), చందన రెడ్డి, విష్ణు, అభిషేక్, ముజ్జు(ఎన్ఎస్‌యూఐ), మణికంఠ రెడ్డి, గ్యార నరేష్, రఘురాం, సత్య, క్రాంతి, పార్థు, నజీర్(ఏఐఎస్ఎఫ్), పెద్దింటి రామకృష్ణ, అనిల్(పీడీఎస్‌యూ), గడ్డం శ్యామ్(పీడీఎస్‌యూ), ఎం.డి.జావేద్, హస్మిబాబు(డీవైఎఫ్ఐ), శ్రీనివాస్, సత్య(ఏఐవైఎఫ్), కిషన్(పీ.వై.ఎల్.), యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కలియుగానికి క్లైమాక్స్ ఉంటే?


నాగ్ అశ్విన్

ప్రభాస్ నటించిన సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఎడి'. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా రిలీజైన 'భైరవ అంథమ్' బిగ్గెస్ట్ సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా టాప్ చార్ట్‌లో ఉంది. ఈ ఎగ్జైట్‌మెంట్‌ని మరింతగా పెంచుతూ మేకర్స్ 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ 1 – ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఎడి'ని రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ,'ఈ కథ బేసిక్‌గా అన్నింటికి క్లైమాక్స్. కలియుగంలో ఏం జరుగుతుంది? ఏం జరగొచ్చు?, ఇలాంటి వాటన్నింటికీ ఇది క్లైమాక్స్. కేవలం మనదేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఈ కథకు రిలేట్ అవుతారు. చిన్నప్పటి నుంచి పౌరాణిక చిత్రాలంటే చాలా ఇష్టం. 'పాతాళభైరవి', 'భైరవ ద్వీపం', 'ఆదిత్య 369' నాకు ఇష్టమైన సినిమాలు. హాలీవుడ్ 'స్టార్ వార్స్' లాంటి సినిమా చూసినప్పుడు చాలా బావున్నాయనిపించాయి. అయితే ఇవి మన కథలు కావా? ఎప్పుడూ వెస్ట్‌లోనే జరగాలా? అనిపించేది. మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలున్నాయి. కృష్ణవతారంతో అది ఎండ్ అవుతుంది. అక్కడి నుంచి కలియుగంకు ఎంటరైనప్పుడు ఈ కథ ఎలా వెళ్తుతుందనేది ప్యూర్ క్రియేటివ్ ఇమాజినేషన్. దీన్ని కథగా రాయలనుకున్నా. మనం చదివిన పురాణాలు, ఎపిక్స్ అన్నింటికి ఒక క్లైమాక్స్‌లా ఈ సినిమా ఉంటుంది. ప్రతి యుగంలో కలిపురుషుడిలా ప్రవర్తించేవారు ఉన్నారు. ఒక యుగంలో రావణుడు, మరోయుగంలో దుర్యోధనుడు... ఇలా అన్నింట్లో ఒక రూపం తీసుకొని కలియుగంలో ఒక అల్టిమేట్ ఫైనల్ రూపం తీసుకుంటే అతనితో పోరాటం ఎలా ఉంటుందనే ఐడియాతో రాసుకున్నది. ఈ కథ రాయడానికి 5 సంవత్సరాలు పట్టింది. సరికొత్త ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీ అటెంప్ట్‌ని చూసి ప్రేక్షకుల ఎలా రియాక్ట్ అవుతారని క్యూరియస్‌గా ఎదురుచూస్తున్నా' అని అన్నారు. 'ప్రేక్షకులకు సరికొత్త ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని అద్భుతమైన విజువల్ వండర్‌గా అందించేందుకు దర్శక,నిర్మాతలు అన్ని హంగులతో సిద్ధం చేశారు' అని చిత్ర బృందం తెలిపింది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశా పటానీ సహా ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. వైజయంతీ మూవీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈచిత్రం ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

నవచిత్రం

నీలో ఏదో యుద్ధమా..


విజయ్ ఆంటోని

హీరో విజయ్ ఆంటోనీ 'తుఫాన్' చిత్రంతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాను ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. ఈ సంస్థ గతంలో విజయ్ ఆంటోనీ హీరోగా 'రాఘవన్, హత్య' సినిమాలను నిర్మించింది. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో ఈ సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్. తాజాగా ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'తుఫాన్ లా'ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'ఈ వాన నీలో ఈ క్షణం ఓ హోరై కురిసెనా.. పదే పదే ఆవేదనే నిన్నే వేధించెనా...నువ్వు నువ్వుగానే ఉన్న నీలో ఏదో యుద్ధమా...' అంటూ హీరో క్యారెక్టరైజేషన్‌లోని సంఘర్షణను వివరిస్తూ ఈ పాటను రూపకల్పన చేశారు.

ఈ పాటకు భాష్యశ్రీ లిరిక్స్ అందించగా, హైమత్ మహమ్మద్ పాడారు. విజయ్ ఆంటోనీ, అచ్చు రాజమణి సంగీతాన్ని అందించారు.

సీఎంని మెప్పించిన ట్రైలర్



రెగ్యులర్ మాస్ మసాలా కమర్షియల్ అంశాలే కాకుండా మన నేటివిటీని, మన ఆచార సంప్రదాయాల్ని చూపించే చిత్రాలు ఇప్పుడు ఎక్కువగా రావడం లేదు. కానీ మన ఆచార, సంప్రదాయాలు, మన సంస్కృతిని చాటేలా, మన ఇతిహాసగాథలైన రామాయణం నుంచి ప్రేరణ పొంది 'సీతా కళ్యాణ వైభోగమే' అనే సినిమాను సతీష్ పరమవేద తెరకెక్కించారు.

సుమన్ తేజ్, గరీమ చౌహాన్ హీరో, హీరోయిన్లుగా డ్రీమ్ గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై రాచాల యుగంధర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక ఈ చిత్రం ఈనెల 21న భారీ ఎత్తున విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్ర టీజర్, ట్రైలర్‌ను మేకర్స్ చూపించారు. ట్రైలర్‌ను వీక్షించిన అనంతరం చిత్రయూనిట్‌ను ప్రత్యేకంగా నిర్మాతను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ట్రైలర్, పాటలు చాలా బాగున్నాయని, సినిమా పెద్ద హిట్ అవ్వాలని, యూనిట్‌కు మంచి పేరు రావాలని ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రిని కలిసిన వారిలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నిర్మాత రాచాల యుగంధర్, డైరెక్టర్ సతీష్, నీరూస్ ప్రతినిధి అసీమ్, నటీనటులు సుమన్ తేజ్, గరీమ చౌహాన్, గగన్ విహారి కెమెరామెన్ పరశురామ్ తదితరులు ఉన్నారు. 'మా చిత్ర ట్రైలర్, పాటలను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చాలా బాగున్నాయని, సినిమా హిట్ కావాలని కోరుకోవడం ఆనందంగా ఉంది' అని మేకర్స్ అన్నారు.



ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించే పవర్‌ఫుల్ టైటిల్

బాబ్జీ దర్శకత్వంలో తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్థన్ నిర్మిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ సినిమా టైటిల్ లోగోను డైరెక్టర్ తేజ మంగళవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఏ సినిమాకి అయినా ప్రేక్షకులను ఆకర్షించేది, వారిని థియేటర్‌ల వద్దకు నడిచేలా చేసేది టైటిల్ మాత్రమే. ఈ 'పోలీస్ వారి హెచ్చరిక' అనే టైటిల్ కూడా అలాంటి శక్తివంతమైన మాస్ టైటిల్. ఈ టైటిల్ దర్శక, నిర్మాతలకు కొంగు బంగారంగా మారి విజయాన్ని చేకూరుస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'విజయాలను సెంటిమెంట్‌గా మలుచుకున్న సక్సెస్‌ఫుల్ దర్శకుడు తేజ చేతుల మీదుగా మా సినిమా పబ్లిసిటీని ప్రారంభించడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దీన్ని ఒక శుభసూచికంగా మేము భావిస్తున్నాం' అని నిర్మాత బెల్లి జనార్థన్ అన్నారు. దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ, 'సినిమా షూటింగ్‌ను రెండు తెలుగు రాష్ట్రాల్లోని అద్భుతమైన లొకేషన్‌లలో పూర్తి చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఓ వైవిధ్యమైన కథతో ప్రేక్షకులను అలరించనున్నాం' అని చెప్పారు.

సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, గిడ్డేశ్, శుభలేఖ సుధాకర్, షియాజీ షిండే , హిమజ , జయవాహినీ , శంకరాభరణం తులసి, ఖుషి మేఘన, రుచిత, గోవింద, హనుమ, బాబురాం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా : నళినీ కాంత్ , సంగీతం : గజ్వేల్ వేణు, ఎడిటర్ : శర్వాణి శివ, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ : హనుమంతరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎస్.పి . సుబ్బరాయుడు, రచన – దర్శకత్వం : బాబ్జీ.

యూనిక్ ఎంటర్‌టైనర్


శ్రీ విష్ణు

హీరో శ్రీ విష్ణు ప్రతి సినిమాలోనూ కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉండేలా చూసుకుంటూ డిఫరెంట్ స్క్రిప్ట్‌లను ఎంచుకుంటున్నారు. హసిత్ గోలీ దర్శకత్వంలో చేస్తున్న తన అప్ కమింగ్ యూనిక్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'శ్వాగ్'లో హిలేరియస్ రోల్‌లో కనిపించనున్నారు. శ్రీ విష్ణు, హసిత్ గోలీల నుండి రాబోత్ను మరొక యూనిక్ అటెంప్ట్. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సినిమాలోని అన్ని ప్రధాన పాత్రలను పరిచయం చేసిన తర్వాత మేకర్స్ రేజర్ టీజర్‌ని రిలీజ్ చేశారు. శ్రీవిష్ణు మగవారి గురించి స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇవ్వడంతో వీడియో ప్రారంభమవుతుంది. శ్రీవిష్ణు భవభూతి అనే మగ చావినిస్ట్ క్యారెక్టర్ పోషించారు. ఆయన లుక్స్, టెర్రిఫిక్ మేక్ఓవర్ ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేసింది. శ్రీవిష్ణు అద్భుతమైన చరిష్మాతో అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. ఆయన క్యారెక్టర్ ప్రేక్షకులను రెండుగా డివైడ్ చేస్తుంది. ఆయన్ని ప్రేమించినా, ద్వేషించినా, మీరు భవభూతిని ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారు. టీజర్ హైలీ ఎంటర్టైనింగ్‌గా ఉంది. హసిత్ గోలీ రైటింగ్, డైరెక్షన్ అద్భుతంగా ఆకట్టుకుంటోంది అని చిత్ర బృందం తెలిపింది. వింజమర వంశంలో క్వీన్ రుక్మిణి దేవిగా రీతూ వర్మ నటిస్తోంది. త్వరలోనే ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నారు.

శ్రీవిష్ణు, రీతూ వర్మ, మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోప రాజు రమణ తదితరులు నటిస్తున్నారు.

సరికొత్త స్క్రీన్‌ప్లేతో నింద


వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా 'నింద' అనే చిత్రాన్ని ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. కాండ్రకోట మిస్టరీ అనే క్యాప్షన్‌తో యదార్థ సంఘటనల ఆధారంగా ఈ మూవీని నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 21న రాబోతోంది. మైత్రీ మూవీస్ ఈ సినిమాను నైజాంలో రిలీజ్ చేస్తోంది. ఈ మూవీ విశేషాలను హీరో వరుణ్ సందేశ్ మంగళవారం మీడియాతో షేర్ చేసుకున్నారు.

- ఈ కథ విన్నప్పుడు ఈ మూవీని ఎవరు నిర్మిస్తారు?, ఎవరు తీస్తారు అనే ఆలోచనలు రాలేదు. కథతోపాటు రాజేష్ నెరేట్ చేసిన విధానం మరింతగా నచ్చింది. ఇక ఆయనే సినిమాను నిర్మిస్తున్నాడని తెలిసి మరింత సంతోషం కలిగింది. తన కథ మీద తనకు ఉన్న నమ్మకంతోనే నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఆయనకు చాలా గట్స్, ధైర్యం ఉండటం వల్లే దర్శకుడిగా, నిర్మాతగా ఈ సినిమాను చేశారు.
- సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ జోనర్‌లలో ఎన్నో సినిమాలు వచ్చాయి. ఈ సినిమా విషయంలో మాత్రం స్క్రీన్ ప్లే చాలా కొత్తగా ఉండబోతోంది.
- నెక్ట్స్ ఏం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు, ఊహించలేరు. అసలు పూర్తి కథను, స్క్రిప్ట్‌ని ఆర్టిస్టులెవ్వరికీ నెరేట్ చేయలేదు. దీంతో నటించే ఆర్టిస్టుల్లోనూ ఓ క్యూరియాసిటీ పెరిగింది. అసలు నేరస్థుడు ఎవరు? అనే విషయం తెలియకపోవడంతో సహజంగా నటించారు. కథ చెప్పినప్పుడు నేను గెస్ చేసేందుకు ప్రయత్నించాను. కానీ నేను కూడా చెప్పలేకపోయాను.
- ఇలాంటి చిత్రాలకు ఆర్ఆర్, కెమెరా వర్క్ చాలా ఇంపార్టెంట్. సాంతు ఓంకార్ తన ఆర్ఆర్, మ్యూజిక్‌తో నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లారు. రమీజ్ కెమెరా వర్క్ కూడా అద్భుతంగా ఉంటుంది.
- నేను బయట జాలీగా, చిల్‌గా ఉంటాను. ఎప్పుడూ కూడా సీరియస్‌గా ఉండను. కానీ ఈ చిత్రంలో నా వ్యక్తిత్వానికి, మనస్తత్వానికి పూర్తిగా భిన్నమైన పాత్రను పోషించాను. ఈ చిత్రంలో ఎంతో సెటిల్డ్‌గా, మెచ్యూర్డ్‌గా కనిపిస్తాను. 'నింద' తరువాత ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో ఆగస్ట్‌లో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నాను. అలాగే 'కానిస్టేబుల్' అనే మరో సినిమాను కూడా చేస్తున్నాను.

నింగినంటుతున్న ఇంటి అద్దెలు

- ఐదేండ్లలో 64 శాతం పెరుగుదల
- రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ అనరాక్ వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలోని ప్రజల ఆదాయాల్లో పెద్దగా పెరుగుదల లేకపోయినా.. నివాస అద్దెలు మాత్రం నింగినంటుతున్నాయి. గడిచిన ఐదేండ్లలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో అద్దెలు 64 శాతం పెరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ అనరాక్ వెల్లడించింది. 2019 నుంచి దేశంలో వేగంగా అద్దెలు పెరిగాయని తెలిపింది. అనరాక్ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), చెన్నయ్, కోల్‌కత్తా, పూణె, హైదరాబాద్, బెంగళూరు తదితర ఏడు ప్రధాన నగరాల్లో 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండు పడక గదుల ఇంటి అద్దెలు భారీగా పెరిగాయి.

దేశ రాజధాని సమీపంలోని నేషనల్ కాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్)లో 2018–19లో రూ.15,500గా ఉన్న సగటు అద్దె.. గడిచిన 2023–24 నాటికి 63.3 శాతం పెరిగి రూ.25,000కు చేరింది. దక్షిణ ఢిల్లీలో 43.5 శాతం పెరిగి రూ.19,500 నుంచి రూ.28,000కు అద్దెలు చేరాయి. ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్‌లోని చెంబూర్‌లో రెండు పడక గదుల ఇంటికి అత్యధికంగా రూ.63,500 సగటు అద్దె చెల్లిస్తున్నారు. ఇక్కడ 2019లో రూ.45,000గా ఉన్న అద్దెతో పోల్చితే 41.1 శాతం పెరుగుదల నమోదైంది. బెంగళూరులోని సర్జాపూర్ రోడ్‌లో సగటు అద్దె రూ.35,000కు చేరింది. 2019లో ఇక్కడ అద్దె రూ.21 వేలుగా ఉంది.

జూన్ త్రైమాసికంలో ఇలా..

ప్రస్తుత ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో ఇప్పటి వరకు నివాస గృహాల అద్దెల్లో 2–4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మార్చి త్రైమాసికంలో 4–9 శాతం వరకు పెరిగాయని అనరాక్ రిపోర్ట్ పేర్కొంది. 2024 జూన్ త్రైమాసికం(క్యూ2)లో నోయిడా సెక్టార్ –150లో అద్దెలు సగటున 4 శాతం పెరగ్గా.. మార్చి త్రైమాసికంలో 9 శాతం పతనం చోటు చేసుకుంది. క్యూ2లో గుర్‌గావ్, ద్వారకలో అద్దెలు 3 శాతం, 2 శాతం చొప్పున పెరిగాయి. మార్చి త్రైమాసికంలో హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల అద్దెల్లో 5 శాతం పెరుగుదల ఉండగా.. జూన్ త్రైమాసికం అద్దెల్లో 3 శాతం పెరుగుదల నమోదయ్యింది.

"జూన్ త్రైమాసికంలో సాధారణంగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో కొత్త సిబ్బంది నియామకం కారణంగా అద్దెలు ఇతర త్రైమాసికాల కంటే ఎక్కువగా పెరుగుతాయి" అని అనరాక్ గ్రూప్ వైస్ ఛైర్మన్ సంతోష్ కుమార్ తెలిపారు.

ఈ ఏడాది కొత్త నివాసాలు పెరుగుతున్న నేపథ్యంలో అద్దెల్లో తగ్గుదల ఉండొచ్చన్నారు. దేశంలోని ఏడు అతిపెద్ద నగరాలు 2024లో 5.31 లక్షల కొత్త యూనిట్లను డెలివరీ చేయబోతున్నాయని అనరాక్ అంచనా. ఇది 2023లో డెలివరీ చేయబడిన 4.35 లక్షల యూనిట్ల కంటే 22 శాతం ఎక్కువ. ఈ ఏడాది అత్యధిక యూనిట్లు ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్‌లో 1,60,900, ఆ తర్వాత ఎన్‌సీఆర్ పరిధిలో 1,44,397 యూనిట్లు, పూణెలో 97వేల చొప్పున నివాసాలు అందుబాటులోకి రానున్నాయని అనరాక్ అంచనా వేసింది.

ఆటలు

అందరి దృష్టి అమెరికాపైనే..

నేడు దక్షిణాఫ్రికాతో తొలి సూపర్-8 మ్యాచ్ | రాత్రి 8.00గంటలకు



ఆంటిగ్వా: ఐసిసి టి20 ప్రపంచకప్ గ్రూప్ లీగ్ పోటీలు ముగిసాయి. లీగ్ దశ పోటీలు ముగిసిన అనంతరం ప్రతి గ్రూప్‌లో టాప్–2లో నిలిచిన 8జట్ల మధ్య సూపర్–8 సమరం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. సూపర్–8లో ప్రతి జట్టు ఆ గ్రూప్‌లో మూడేసి మ్యాచ్‌లు చొప్పున ఆడనుంది. మూడు మ్యాచ్‌లు ముగిసిన అనంతరం ప్రతి గ్రూప్‌లో టాప్–2లో నిలిచిన రెండు జట్లు సెమీస్‌ఫైనల్‌కు చేరనున్నాయి. ఈ మెగా టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లోనే పాకిస్తాన్‌కు ఝలక్ ఇచ్చి అమెరికా సూపర్–8కు చేరగా.. మరో ఆతిథ్య జట్టు వెస్టిండీస్ కూడా గ్రూప్–సిలో నాలుగు వరుస విజయాలతో అగ్రస్థానంలో నిలిచి సూపర్–8కు చేరింది. ఈ క్రమంలో అమెరికా–దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆంటిగ్వా వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో సూపర్–8 సంగ్రామం మొదలు కానుంది. గ్రూప్–1లో భారత్, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్... గ్రూప్–2లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, అమెరికా జట్లు ఉన్నాయి.

పూరన్ మెరుపు ఇన్నింగ్స్..

గ్రూప్–సి ఆఖరి లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 104పరుగుల తేడాతో ఆఫ్ఘనిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. సోమవారం రాత్రి జరిగిన నామమాత్రపు గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో నికోలస్ పూరన్(98; 53బంతుల్లో 6ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 218పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. పూరన్‌కి తోడు ఛార్లెస్(43), హోప్(25), పావెల్(26) బ్యాటింగ్‌లో రాణించారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లు గులాబుద్దిన్‌కు రెండు, నవీన్–ఉల్–హక్, అజ్మతుల్లాకు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆఫ్ఘన్ జట్టు 16.2ఓవర్లలో 114పరుగులకే కుప్పకూలింది. జద్రాన్(38), ఒమర్జాయ్(23) టాప్ స్కోరర్స్. విండీస్ బౌలర్లు మెక్ కొయ్‌కు మూడు, మాటీ, హొస్సైన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పూరన్‌కు లభించింది. దీంతో గ్రూప్–సిలో వెస్టిండీస్ జట్టు వరుసగా నాలుగు మ్యాచుల్లో విజయాలను నమోదు చేసుకొని 8పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.

మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం

టి20 ప్రపంచ కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ ఉదంతం తెరపైకి వచ్చింది. మ్యాచ్ ఫిక్సింగ్ కోసం కెన్యా మాజీ క్రికెటర్ ఉగాండా జట్టు ఆటగాడిని సంప్రదించగా.. ఈ విషయాన్ని ఉగాండా ఆటగాడు వెంటనే ఐసిసి అవినీతి నిరోధక విభాగానికి తెలియజేసినట్లు సమాచారం. టి20 ప్రపంచ కప్‌లో భాగంగా గయానా వేదికగా ఉగాండా మూడు లీగ్ దశ మ్యాచ్‌లు ఆడింది. ఆ సందర్భంగా కెన్యా మాజీ పేసర్ మ్యాచ్ ఫిక్సింగ్ కోసం పలుమార్లు వేర్వేరు నంబర్లతో ఉగాండా ప్లేయర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించాడట. ఈ విషయాన్ని సదరు ప్లేయర్ ఐసీసీ అవినీతి నిరోధక బందం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణ చేపడతామని ఐసిసి తెలిపినట్లు సమాచారం. టి20 ప్రపంచకప్ గ్రూప్–సిలో ఉన్న ఉగాండా.. నాలుగు మ్యాచ్‌లు ఆడి ఒక దాంట్లో విజయం సాధించింది.

ఇంటర్వ్యూలకు హాజరైన గంభీర్, రామన్




ముంబయి: పురుషుల క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ పదవికి జరిగిన ఇంటర్వ్యూలకు టీమిండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్, డబ్ల్యువి. రామన్ హాజరయ్యారు. క్రికెట్ అడ్వైజరీ కమిటీ(సిఎసి) మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు వీరు హాజరయ్యారు. ఐసిసి టి20 ప్రపంచకప్ ముగిసిన అనంతరం టీమిండియా కోచ్ రాహుల్ ద్రావిడ్ పదవీకాలం ముగియనుండడంతో మాజీ క్రికెటర్ అశోక్ మల్హోత్రా నేతృత్వంలోని సిఎసి కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

గౌతమ్ గంభీర్ ప్రత్యక్షంగా ఇంటర్వ్యూకు హాజరుకాగా.. భారత మహిళల జట్టు బ్రాడ్‌కాస్టర్‌గా ఉన్న డబ్ల్యువి రామన్ బెంగళూరునుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మల్హోత్రాతోపాటు సులక్షణ నాయక్, జతిన్ పరాంజపే సిఎసి కమిటీ సభ్యులుగా ఉన్నారు. ప్రధాన కోచ్ పదవి రేసులో గౌతమ్ గంభీర్ పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. బిసిసిఐ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

ఒలింపిక్స్‌కు భారత షార్ట్ గన్ జట్టు ఇదే : ఎన్ఆర్ఎఐ



న్యూఢిల్లీ: 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే భారత షార్ట్ గన్ జట్టు బృందాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఎఐ) ప్రకటించింది. ఎన్ఆర్ఎఐ మంగళవారం ప్రకటించిన పురుషుల షార్ట్‌గన్ బృందానికి పృథ్వీరాజ్ థొండిమాన్, మహిళల బృందానికి రాజేశ్వరి కుమారి సారథ్యం వహించనున్నారు. పురుషుల, మహిళల బృందం మొత్తం ఐదు విభాగాల్లో పతకాలకు పోటీపడనున్నారు. పురుషుల స్కీట్‌లో అమన్‌జీత్, మహిళల స్కీట్ విభాగాల్లో రిజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ పతకాలకు పోటీపడనున్నారు. ఇక మహేశ్వరి, అమన్‌జీత్ బృందం స్కీట్ మిక్స్‌డ్ టీం విభాగంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

పురుషుల ట్రాప్	: పృథ్వీరాజ్ థొండిమాన్
మహిళల ట్రాప్	: రాజేశ్వరి కుమారి
పురుషుల స్కీట్	: అమన్‌జీత్ సింగ్
మహిళల స్కీట్	: రిజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్
స్కీట్ మిక్స్‌డ్ టీమ్	: అమన్‌జీత్ సింగ్, మహేశ్వరి చౌహాన్

ఐటీ కంపెనీలకు కార్మిక చట్టాల సడలింపు సరికాదు

- ఆ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలి
- కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదినికి సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఐటీ కంపెనీల్లో కార్మిక చట్టాల సడలింపు సరిగాదనీ, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణికుముదినికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనాలు పెంచకుండా యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గటం, మోడీ సర్కారు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని పత్రికలకు లీకులివ్వడం, ఐటీ పరిశ్రమలకు కార్మిక చట్టాల నుంచి మినహాయింపునివ్వడం వంటి కార్మిక వ్యతిరేక చర్యలను వీడాలని కోరారు. పని వేళలు, పని ప్రదేశంలో భద్రత, రవాణా సౌకర్యాలు, వేతనాలు, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి షరతులను అమలు చేయాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వడం దారుణమన్నారు. సౌకర్యాల కల్పన అమలుపై ఐటీ పరిశ్రమల్లో కార్మిక శాఖ ఎందుకు తనిఖీలు చేయడం లేదని అడిగారు. రాత్రి షిఫ్టుల కారణంగా మహిళలు ఎక్కువగా అసౌకర్యానికి గురవుతున్నారనీ, అందుకే చాలామంది షిఫ్ట్ డ్యూటీలను ఇష్టపడరని తెలిపారు. కంప్యూటరైజేషన్, పరిశ్రమల్లో అధునాతన యంత్రాల ఆవిష్కరణ జరిగినపుడు పనిగంటలు తగ్గాలి గానీ పెరగడమేంటని ప్రశ్నించారు.

ప్రజావాణికి 607 దరఖాస్తులు

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 607 దరఖాస్తులు అందాయని రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. రెవెన్యూపై 176, హౌసింగ్‌పై 58, పౌరసరఫరాల శాఖపై 54, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివద్ధి శాఖపై 36, హోం శాఖపై 62, ఇతర శాఖలకు సంబంధించి 221 దరఖాస్తులు అందినట్టు వివరించారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.